పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344
Shop online through our website navachethanabooks.in



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


ఒడిశాలో నక్సల్స్ లొంగుబాటు
ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు
కర్బీ ఆంగ్లాంగ్‌లో హింస 05


సంపుటి 09, సంచిక: 28 | బుధవారం | 24-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## 40% నిధులను రాష్ట్రాలు భరించలేవు

- కేంద్రం కొత్తచట్టం తీసుకురావడం దుర్మార్గం
- సంపన్నులకు బకాయిలు రద్దుచేసి పేదలకు అన్యాయం చేస్తోంది
- ఎంజి నరేగాను నిర్వీర్యం చేస్తోంది
- మోదీ సర్కార్‌పై సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరును రద్దుచేసి దాని స్థానంలో విబి జీ రామ్ జీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చి నీరుగారిచే ప్రయత్నం చేస్తోందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 40 శాతం నిధులను రాష్ట్రాలు భరించలేని విధంగా కొత్త చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. సంపన్న కుటుంబాలకు పాత బకాయిల పేరుతో రూ.28 లక్షల కోట్లను రద్దు చేసిన కేంద్రం పేదలకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిజెపి అనుకూల బిల్లులు ఆమోదింపజేసుకుంటోందన్నారు. ట్రంప్ వెనిజులా అధ్యక్షుడిని చంపుతానంటున్నాడని, అమెరికా టారీఫ్‌ల పేరుతో పెంచుకుంటూ పోతున్న ట్రంప్‌కు అనుకూలంగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. న్యూయార్క్‌లో జరిగిన సంఘటన ట్రంప్‌కు షాక్ ఇచ్చిందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం ఇటీవల రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించారు.

# సమన్వయం లేకుంటే ఫలితాలు రావ్



- ప్రభుత్వ శాఖలమధ్య సమన్వయం చేసుకునేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి
- ప్రభుత్వం ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం అవసరం
- అందరూ జవాబుదారీతనంతో పనిచేయాలి
- శాఖల కార్యదర్శులు ప్రతినెలా సిఎస్‌కు నివేదిక సమర్పించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- 26 లోగా అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి మారాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

అభివృద్ధి విషయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల మధ్య, శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావని, అధికారులందరూ సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకమని సూచించారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై వివిధ శాఖల కార్యదర్శులతో ముఖ్యమంత్రి మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలతో ముందుకు వెళుతున్నదని ప్రభుత్వం ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నప్పటికీ అధికారుల సహకారం ఉండాలని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రతీ నెల ప్రభుత్వ శాఖల కార్యదర్శుల పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సమీక్షిస్తారని, కార్యదర్శులు సిఎస్‌కు ప్రతీ నెల నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి శాఖల కార్యదర్శుల పనితీరుపై తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని సిఎం చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించామని, కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక విధానమంటూ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయని, ఈ నేపథ్యంలో ముఖ్యమైన విభాగాలకు ఒక విధానాన్ని రూపొందించామన్నారు. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని

తరువాయి 2లో


## ‘పాలమూరు’ పాపం బిఆర్‌ఎస్‌దే

- పనులు మెల్లగా చేయాలని, ఒక టిఎంసి నీటిని తగ్గించుకోవాలని గత ప్రభుత్వమే ఇఎన్‌సి ద్వారా ఆదేశాలు జారీచేసింది
- కాళేశ్వరంపై చూపిన ప్రేమ పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే పూర్తయ్యేది
- ప్రాజెక్టుపై శాసనసభలో చర్చకు మేం సిద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులను మెల్లగా నిర్వహించాలని, ఒక టిఎంసి నీటిని తగ్గించుకోవాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల శాఖ ఇఎన్‌సి ద్వారా ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 90 శాతం పనులను పూర్తి చేశామని చెబుతున్న బిఆర్ఎస్, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన చూపిన ప్రేమను పాలమూరు రంగారెడ్డికి నిధులను కేటాయిస్తే పూర్తయ్యేది కదా ? అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌పైన శాసన సభ సమావేశంలో

తరువాయి 2లో



అసెంబ్లీలో పవర్‌పాయింట్‌ను స్వాగతిస్తున్నాం : హరీశ్

తెలంగాణకు మరణశాసనం రాసిందే కెసిఆర్ : రాంచందర్‌రావు 04

ఫోన్ ట్యాపింగ్ కేసు



## కెసిఆర్, హరీష్‌కు త్వరలో నోటీసులు ?

విచారణ వేగవంతం చేసిన సిట్

ప్రజాపక్షం /హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయా అంటే ఔననే సంకేతాలు వెలువడుతున్నాయి. హైదరాబాద్ కమిషనర్ విసి.సజ్జనార్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది పోలీసు ఉన్నతాధికారులతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడు మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్, ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిన డేటా ఆధారంగా కొత్తగా ఏర్పాటైన సిట్ బృందం తొలిసారి రాజకీయ అగ్రనేతలకు నోటీసులు

తరువాయి 2లో

## రవాణాశాఖ డిసికి కోట్లలో అక్రమాస్తులు

**హైదరాబాద్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రవాణాశాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం 5గంటల నుంచి సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు,

తరువాయి 2లో

- హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో సోదాలు
- రూ.12కోట్లకు పైగా విలువైన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం
- కిషన్ నాయక్‌ను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు



## పోటీ పడకుంటే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకమే

- సంస్థపై ఆధారపడిన 80వేల మంది జీవితాలు రోడ్డునపడే ప్రమాదం
- తెలంగాణలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సింగరేణి జెండా ఎగరాలి
- టెక్నాలజీకి అనుగుణంగా సంస్థ పరుగులు పెట్టాలి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- శైలు బంకర్ బాధితులకు పునరావాసం ఏర్పాటు చేయండి
- ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి

ప్రతి రంగంలోనూ తీవ్రమైన పోటీ వస్తుందని, ఇతర రంగాలతో పోటీ పడకపోతే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నూతనంగా నిర్మించిన జిఎం కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా

తరువాయి 12లో

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

సిటియు ఉమ్మడి వేదిక పిలుపు



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12వ తేదీన సార్వత్రిక సమ్మె జరుగుతుంది. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక (జెపి సిటియు) ఈ పిలుపు ఇచ్చింది. అమానుషమైన నాలుగు లేబర్ కోడ్స్‌ను మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా అమలులోకి తీసుకురావడమే కాకుండా, ప్రజల హక్కులు, వారు ఉపాధి అవకాశాలపైన కూడా పార్లమెంటు వెలుపలా—లోపలా దేశ పాలక వర్గం బహుముఖ దాడులు చేయడాన్ని ప్రతిఘటిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఈ సమ్మె పిలుపు ఇచ్చింది. ఈ సమ్మె ద్వారా మోదీ ప్రభుత్వానికి ఒక బలమైన సందేశాన్ని పంపించాలని ఐక్యవేదిక నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక సమ్మె కోసం యావత్ కార్మికలోకం, ఇతర శ్రామిక వర్గాలు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను ధృతం చేయాలని ఈ సందర్భంగా సిటియు పిలుపు ఇచ్చింది. పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు తమ తమ సంస్థలు, సంఘాలను సన్నద్ధం చేయాలని కోరింది. దేశ శ్రామిక ప్రజానీకం మౌలిక హక్కులను సంరక్షించేందుకు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను సంరక్షించేందుకు పార్లమెంటులోని ప్రతిపక్షాలు, వివిధ వర్గాల ప్రజలు ప్రత్యేకించి యువకులు,విద్యార్థులు సార్వత్రిక సమ్మెకు మద్దతు, సంఘీభావం ప్రకటించేందుకు ముందుకు రావాలని పిలుపు ఇచ్చింది. సార్వత్రిక సమ్మెకు బేషరతుగా మద్దతు ప్రకటించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)కు సిటియు శాల్యూట్ చేసింది. వచ్చేనెల (జనవరి) తొమ్మిదో తేదీ మధ్యాహ్నం న్యూఢిల్లీ హెచ్‌కెఎస్ భవన్‌లో

తరువాయి 2లో

ఆరావళీ పర్వత శ్రేణిని పునర్నిర్వచించడానికి

## ఎందుకంత పట్టుదల ?

- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు
- ఎవరి ప్రయోజనం కోసం అని నిలదీత



న్యూఢిల్లీ : ‘ఆరావళీలు దేశ సహజ వారసత్వ సంపద అని, వాటికి గొప్ప పర్యావరణ విలువ ఉంది’ అని కాంగ్రెస్ పేర్కొంది. మోదీ ప్రభుత్వం ఈ పర్వత శ్రేణిని పునర్నిర్వచించడానికి ఎందుకు పట్టుబడుతోందని, అది ఎవరి ప్రయోజనం కోసం అని ఆ పార్టీ ఘాటుగా ప్రశ్నించింది. పురాతన పర్వత శ్రేణిపై పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఇటీవల ఇచ్చిన వివరణలపై మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ‘ఆరావళీలు మన సహజ వారసత్వంలో భాగం. వాటికి గొప్ప పర్యావరణ విలువ ఉంది. వాటికి గణనీయమైన పునరుద్ధరణ, అర్థవంతమైన రక్షణ అవసరం. మోదీ ప్రభుత్వం వాటిని పునర్నిర్వచించడానికి ఎందుకు పట్టుబడుతోంది? ఏ ఉద్దేశ్యంతో? ఎవరి ప్రయోజనం కోసం? ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా వంటి వృత్తిపరమైన సంస్థ సిఫార్సులను ఎందుకు ఉద్దేశపూర్వకంగా విస్మరించి పక్కన పెడుతున్నారు’ అని ఆయన ప్రశ్నించారు. ఆరావళీ సమస్యపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి ఇచ్చిన

తరువాయి 12లో

## సోయా రైతులను ఆదుకోండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి
- మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రత్యేక లేఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం (ఖరీఫ్) 2025–26 సీజన్‌లో కురిసిన అకాల, దీర్ఘకాలిక భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన సోయాబీన్ రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ప్రత్యేక లేఖలు రాసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ

తరువాయి 12లో




## పేరు మార్చిన నూతన చట్టంతో ఉపాధి ధ్వంసం

అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టిన వామపక్షాలు, ప్రజాసంఘాలు

వార్తలు 3లో



# ప్రపంచం
WORLD NEWS

## లైంగిక నేరస్థుడు ఎప్సీన్ జెట్‌లో ఇరవైయేళ్ళ యువతితో ట్రంప్ ప్రయాణం

**వాషింగ్టన్ :** లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్సీన్‌కు సంబంధించిన ఫైల్స్‌లో మరిన్ని పేజీలను జస్టిస్ విభాగం (డిఓజె) విడుదల చేసింది. ఎప్సీన్‌కు సంబంధించిన ప్రైవేటు విమానాలలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విచ్చలవిడిగా అనేకసార్లు ప్రయాణాలు చేశారని ఈ ఫైల్స్ ద్వారా తాజాగా బహిర్గతమైంది. గడచిన మూడు రోజులుగా 11,000 ఫైల్స్‌తోపాటు 400 వీడియోలను (10 జిబి) కూడా ఇప్పటివరకూ విడుదలయ్యాయి. 1993 నుండి 1996 వరకూ జెఫ్రీ ఎప్సీన్‌కు సంబంధించిన విమానాలలో అనేక సార్లు ప్రయాణం చేసినట్లు రికార్డుల్లో ఉందని అమెరికా డిఓజె వెల్లడించింది. ఎనిమిది విమానాల్లో అనేకసార్లు ప్రయాణాలు చేసినట్లు ఇప్పటివరకూ తెలిసిందని తాజాగా విడుదల చేసిన ఇ–మెయిల్స్ ద్వారా డిఓజె తెలిపింది. ఒక విమానంలో మాత్రం కేవలం ముగ్గురే ముగ్గురు ప్రయాణించారని, వారిలో ఒకరు ట్రంప్, మరొకరు ఎప్సీన్ కాగా వారిద్దరితో 20 ఏళ్ళ వయసుగల యువతి ఉందని డిఓజె తెలిపింది. లైంగిక ఆరోపణలపై ఎప్సీన్ చివరకు జైలుశిక్ష అనుభవిస్తూ 2019లో జైలులోనే మరణించాడు.

# ట్రంప్...ముందు నీ ఇల్లు చక్కదిద్దుకో

### మెత్తగా చీవాట్లు పెట్టిన వెనిజులా అధ్యక్షుడు మదురో







**వాషింగ్టన్ :** అమెరికా–వెనిజులా మధ్య ఉద్రిక్తతలు చల్లారడంలేదు. ఇప్పటికే రెండు చమురు నౌకలను స్వాధీనం చేసుకున్న అమెరికా మూడో నౌకను కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తోంది. వెనిజులా నుండి చమురు కొనుగోలు చేసేందుకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి పొందిన నౌకలను స్వాధీనం చేసుకోవాలని ఇటీవల ట్రంప్ ఆదేశం ఇచ్చిన తర్వాత ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. ఈ పరిస్థితుల మధ్య ''వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో కఠినంగా వ్యవహరించడం మానేయాలి, ఆయన తన పదవికి రాజీనామా చేయడం తెలివైన పని'' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉచిత సలహా ఇచ్చారు. దీనిపై నికొలస్ మదురో చాలా తీవ్రంగా స్పందిస్తూ, ''ట్రంప్..ముందు నువ్వు నీ ఇంటిని చక్కదిద్దుకో, నీ దేశంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోకుండా పొరుగుదేశాల విషయాల్లో జోక్యం చేసుకోవద్దు, వెనిజులా నౌకల 'పైరసీ' మానుకో'' అని హెచ్చరిక చేశారు. ఫ్లోరిడాలోని తన మార్–ఎ–లాగో రిసార్ట్‌లో విదేశాంగమంత్రి మార్కో రుబియో, రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్‌లతో కలిసి మాట్లాడుతూ ట్రంప్ చేసిన ప్రకటనపై మదురో తీవ్రంగా స్పందించారు. ''ట్రంప్ జాగ్రత్తగా ఉంటే తన సొంత దేశంలో ఆర్థిక సామాజిక విషయాలలో మెరుగైన పాలన అందిస్తారు, తన దేశ వ్యవహారాలను చక్కబెట్టుకోగలిగితే ప్రపంచ వ్యాపంగా ఆయన మెరుగైన స్థానంలో ఉండగలుగుతారు'' అని ట్రంప్‌కు మదురో మెత్తగా చీవాట్లు వేశారు. వెనిజులా నౌకల అక్రమ స్వాధీనం ''పైరసీ'' తప్ప మరోటి కాదని అన్నారు.

**వెనిజులా ఆయిల్ మేం వాడుకుంటాం లేదంటే అమ్ముకుంటాం**

వెనిజులాకు చెందిన చమురు నౌకలను అమెరికా స్వాధీనం చేసుకోవడం ఆపలేదు. ''ఈ నౌకల్లో ఉన్న చమురును మా దగ్గరే ఉంచుకుంటాం, లేకపోతే అమ్ముకుంటాం లేదంటే మేమే మా అవసరాలకోసం వాడుకుంటాం'' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురో రాజీనామా చేసేవరకూ ఒత్తిడి తీసుకువస్తామని ఫ్లోరిడాలో పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా నౌకలు మాదక ద్రవ్యాలను మోసుకువెళుతున్నాయని, చమురు విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్మును వెనిజులా డ్రగ్స్ ముఠాలకు, వారి నేరాలకు ఉపయోగిస్తోందని ట్రంప్ ఆరోపించారు.

**వెనిజులాకు రష్యా, చైనా మద్దతు**

కరీబియన్ జలాలలో తీవ్ర ఉద్రిక్తతలు ముసురుకుంటున్న తరుణంలో రష్యా–చైనా దేశాలు తీవ్రంగా స్పందించాయి. వెనిజులాకు రష్యా ప్రభుత్వం తన పూర్తి మద్దతు తెలియజేసింది. అక్కడ జరుగుతున్న పరిణామాలపై రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కరీబియన్ జలాలలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో మరో పడవపై అమెరికా రక్షణ దళాలు దాడి చేశాయి. ముగ్గురిని హతమార్చాయి. ఈ ఘటనలపై చైనా కూడా స్పందిస్తూ, అమెరికా దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని విమర్శించింది. వెనిజులా సార్వభౌమాధికారాన్ని, భద్రతను ఉల్లంఘన చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు.

# మయన్మార్‌లో 28 నుండి ఎన్నికల తంతు మొదలు





**ప్యాంగ్‌యాంగ్ :** మయన్మార్‌లో జుంటా సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడం కోసం దేశంలో నామమాత్రంగా ఎన్నికల తంతు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. మూడు విడతలుగా జరిగే ఈ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మొదటి దశ వచ్చే ఆదివారం (డిసెంబరు 28వతేదీ) ప్రారంభం అవుతుంది. జనవరి 11న రెండో విడత పోలింగ్, జనవరి 25న మూడో విడత పోలింగ్ ప్రక్రియ పూర్తిచేస్తారు.

ఐదుకోట్ల మంది ఉన్న మయన్మార్‌లో తిరుగుబాటుదారులున్న ప్రాంతాలలో ఎన్నికలను రద్దుచేశారు. పాలక నాయకుడు మిన్ ఆంగ్ హ్లైంగ్ ఏడాదిక్రితమే ముందుగా ప్రకటించిన విధంగా ఈ ఎన్నికల తంతుకు రంగం సిద్ధమైంది. ఐతే చాలా దేశాలు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాయి. అధికారాన్ని స్థిరీకరించుకోవడానికి నామమాత్రంగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారని విమర్శిస్తున్నాయి. ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలు, నోబెల్ బహుమతి గ్రహీత ఆంగ్ సాన్ సూకీ (80) 33 ఏళ్ళు జైలుశిక్షకు గురయ్యారు. అమె ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాజీవితంలోకి వచ్చే అవకాశాలు లేవు. జుంటా పాలకులు అధికారం తీసుకున్నప్పటినుండి గడచిన ఐదేళ్ళుగా దేశంలో పౌరముఠాలకు, సైన్యానికి మధ్య తీవ్రమైన అంతర్యుద్ధం కొనసాగుతున్నది. తీవ్ర అణచివేత చర్యల మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో పాల్గొనడం ప్రజలకు ఇష్టం లేదు. కానీ ఓటింగ్‌కు దూరంగా ఉంటే చాలా కష్టాలను అనుభవించాల్సి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు.



అత్యున్నత పార్లమెంటు పైతూ హ్లుట్టాలో ఉన్న 440 స్థానాలకుగాను 315 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 221 స్థానాలు గెలుచుకోవాలి. అదే విధంగా అమియోతా హ్లుట్టాలోని 224 స్థానాలకుగాను 16 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. 133 స్థానాలను ఏ పార్టీ అయినా గెలుచుకుంటే మెజారిటీ పొందినట్టు భావిస్తారు. సైన్యం సొంతంగా ఒక పార్టీని స్థాపించింది. కానీ ఇది నేరుగా సైన్యమే నిర్వహించదు. యూనియన్ సాలిడారిటీ అఫ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) సైనికులకు అనుకూలంగా పనిచేస్తుంది. ఈ పార్టీ గతంలో 2020 చివరిలో జరిగిన ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీకి చెందిన నేషనల్ లీగ్ అఫ్ డెమోక్రసీపార్టీ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. దీంతో ఎన్నికల్లో దారుణమైన అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపించిన జుంటా సైన్యం ఆ ఎన్నికలను రద్దుచేసి నాయకులందరినీ జైలులో నిర్బంధించి 2021 ఫిబ్రవరిలో అధికారం స్వాధీనం చేసుకుంది. ఎన్నికల తీర్పును రద్దు చేసింది. గెలిచిన పార్టీ నాయకులపై సైనికకోర్టులో ఏకపక్ష విచారణ జరిపి శిక్షలు విధించింది. ఇందులో భాగంగానే ఆంగ్‌సాన్ సూకీ జైలులో అనేక కేసుల్లో శిక్షలు విధించి ఇక జీవితంలో ఆమె బాహ్య ప్రపంచాన్ని చూసే అవకాశం లేకుండా చేశారు. దేశంలో సైనికుల ఆధిపత్యం నిర్మూలిస్తామని, అందుకు అనుకూలంగా చట్టాలు తీసుకువస్తామని ఆనాడు ఎన్నికల్లో సూకీ వాగ్దానాలు చేసి సైన్యం ఆగ్రహానికి గురయ్యారు. సూకీ పార్టీ రద్దయింది. ప్రస్తుతం సైనిక అనుకూలపార్టీ యుఎన్‌డిపి నాయకుడు ఖిన్ యీ (73) ఎన్నికలకు సారథ్యం వహిస్తున్నారు. ఆయన దేశ సైన్యాధిపతి మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు సన్నిహితుడు.

# బంగ్లాదేశ్‌లో మైనార్టీవర్గాలపై పెరిగిన దాడులు,హింస

### ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ ఖండన

**న్యూయార్క్ :** బంగ్లాదేశ్‌లో ఇటీవల జరుగుతున్న హింస, మైనారిటీ వర్గాలపై పెరుగుతున్న దాడులు హత్యలపట్ల ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు ఒస్మాన్ హది మరణానంతరం బలూకాలో ఒక పరిశ్రమ గేటువద్ద హిందూమతానికి చెందిన కార్మికుడు దీపూ చంద్ర దాస్ (25)ను దారుణంగా కొట్టి చంపి, అల్లరిమూకలు జాతీయ రహదారి పక్కనే దహనం చేసిన ఘటనపై గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి కొద్దిరోజులుగా బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ''ఔను, మేం చాలా తీవ్ర ఆందోళన చెందుతున్నాం, బంగ్లాదేశ్‌లో హింసను చూస్తున్నాం'' అని ఆంటోనీ గుటెర్రెస్ తరపున ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజర్రెక్ ఒక పత్రికాగోష్ఠిలో విమర్శించారు. ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, కొద్దిరోజులుగా ప్రత్యేకించి హిందూ మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ''వారు బంగ్లాదేశీ కావచ్చు, మరొక దేశీయుడు కావొచ్చు,ఒకదేశంలో మైనారిటీ వర్గంగా ఉన్నవారు చాలా సురక్షితంగా ఉండాలి, అందుకు వీలుగా బంగ్లాదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశాభావంతో ఉన్నాం'' అన్నారు. కాగా దీపూ చంద్ర దాస్ హత్యకేసులో మరో ఇద్దరిని ఆదివారంనాడు బంగ్లాదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకూ ఈ కేసులో అరెస్టుల సంఖ్య 12కు పెరిగింది.

# ఉక్రేన్‌లో 13 ప్రాంతాలపై రష్యా దాడులు : ముగ్గురు మృతి

**కీవ్ :** ఉక్రేన్‌పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడులు ఉద్ధృతం చేసింది. రష్యా సైన్యంలో ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగం అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ (56) దక్షిణ మాస్కోలో సోమవారం ఉదయం కారు బాంబు పేలుడు ఘటనలో మరణించిన నేపథ్యంలో ఉక్రేన్‌లోని 13ప్రాంతాలపై దాడుల తీవ్రత పెంచింది. మంగళవారం తెల్లారకముందుగానే రష్యా దాడులు చేసింది. 600 డ్రోన్లు, 36 క్షిపణులను ఈదాడులకు రష్యా సైన్యం ఉపయోగించింది. ఈ దాడుల్లో నాలుగేళ్ళ బాలుడు సహా ముగ్గురు మరణించారు. ఇళ్ళు, పవర్ గ్రిడ్ విభాగాలపై దాడులు చేసింది. ఉక్రేన్ స్పెషల్ సర్వీసెస్ విభాగమే తమ సైనిక ప్రముఖులను చంపుతోందని రష్యా పూర్తిగా విశ్వసించింది. ఇప్పటికే ముగ్గురు రష్యన్ అధికారులు ఇదేవిధంగా బాంబు దాడుల్లో మరణించారు. రష్యా సాయుధ దళాల ఆపరేషన్ శిక్షణా విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న సర్వరోవ్ మరణించినట్లు రష్యన్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ ప్రతినిధి చెప్పారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ రష్యా దాడులపై స్పందిస్తూ, తమ దేశాన్ని శిక్షించాలని పుతిన్ కోరుకుంటున్నారన్నారు. అమెరికా చేస్తున్న శాంతి ప్రయత్నాలపట్ల పుతిన్‌కు ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదని జెలెన్స్కీతోపాటు యూరోపియన్ యూనియన్ నాయకులు కూడా విమర్శించారు. రష్యా దేనికి ప్రాధాన్యత ఇస్తోందో ఈ దాడులవల్ల స్పష్టంగా తెలిపోయిందని అన్నారు. క్రిస్మస్ వేడుకలకు ముందు నుండీ ప్రజలు తమ కుటుంబాలతో హాయిగా గడపాలని కోరుకుంటారని, కానీ పుతిన్ మాత్రం ఆ విచక్షణ లేకుండా వరుస దాడులు చేస్తున్నారని, ఇళ్ళకు భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. క్రిస్మస్ వేడుకలకు ముందుగా డిసెంబరు 23,24,25 తేదీలలో ఉక్రేన్ ప్రజలపై దారుణమైన దాడులు చేయడం రష్యాకు గడచిన నాలుగు సంవత్సరాలుగా ఒక అలవాటుగా మారిందని జెలెన్స్కీ విమర్శించారు.



## ఫలితాలు రావ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని వివరించారు.

**26లోగా కార్యాలయాలన్నీ ప్రభుత్వ భవనాలలోకి మారాలి**

అద్దె భవనాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేసి జనవరి 26వ తేదీ లోపు ప్రభుత్వ భవనాలలోకి మారాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉండకూడదని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని సిఎం స్పష్టం చేశారు. ప్రతీ సెక్రటరీ తమ శాఖలలో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖాధిపతులు పరిశీలించాలని సూచించారు. ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీ లోగా పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

## సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే కార్మికుల జాతీయ సదస్సులో నిర్దేశిత ఒక రోజు సమ్మె పిలుపును లాంఛనంగా ఆమోదిస్తారు. దాంతోపాటే సమ్మె కార్యాచరణకు సం బంధించిన సవిరణాత్మకమైన ప్రణాళికను కూ డా ఈ జాతీయ సదస్సులో రూపొందిస్తారు. కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్స్‌ను ఆమోదించి చట్టరూపంలోకి తీసుకువచ్చింది. యావత్ వ్యవస్థాగత ప్రభుత్వ యంత్రాంగం, మీడియా, ప్రభుత్వ రంగ యాజమాన్యాలను ఉపయోగించుకోవడం ద్వారా అమానుషమైన లేబర్‌కోడ్స్ చుట్టూ ఒక సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేపట్టింది. అదేసమయంలో కేంద్ర కార్మిక సంఘాలు తమ పూర్తి శక్తిసామర్థ్యాలను ఉపయోగించి ప్రభుత్వ ఏకపక్ష చర్యలను వ్యతిరేకిస్తూ, లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయించేందుకు పోరాటాలకు సన్నద్ధమయ్యాయి.

దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మెకు సన్నద్ధమవుతున్న పరిస్థితుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం గనుక లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయకుండా అందులో ఉన్న నిబంధనలను అమలు చేసేందుకే ప్రయత్నం చేస్తే కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇక తదుపరి అనేక రోజులపాటు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టడంతోపాటు బలమైన కార్యాచరణ అమలు చేసేందుకే కట్టుబడి ఉంటుందని, దీంతోపాటు వివిధ విభాగాలకు చెందిన కార్మిక సంఘాలు కూడా విడివిడిగా ప్రతిఘటన కార్యాచరణకు పూనుకుంటాయని జెపి సిటియు మంగళవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరక చేసింది. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యు, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి, ఇతర విభాగాలకు చెందిన సమాఖ్యలు, అసోసియేషన్లు ఈ ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేశాయి.

అదేవిధంగా విద్యుత్ ఉద్యోగులు–ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఓఇఇ) కూడా అదేరోజున (ఫిబ్రవరి 12వ తేదీ) విద్యుత్ కార్మికులు, ఇంజనీర్ల జాతీయస్థాయి సమ్మె నిర్వహిస్తామని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన ప్రమాదకరమైన ''శాంతి చట్టాన్ని'' వ్యతిరేకిస్తూ మంగళవారం (డిసెంబరు 23) దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరపాలని ఎన్‌సిసిఓఇఇ, జెపిసిటియు, ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) ఉమ్మడి సమావేశం ఇప్పటికే నిర్ణయించి అమలు చేసింది. కాగా విత్తన బిల్లు–2025, విద్యుత్ సవరణ బిల్లు–2025, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బదులుగా కేంద్రం తెచ్చిన విబి జీ రామ్ జీ చట్టం–2025లకు వ్యతిరేకంగా, ప్రజల ఇతర డిమాండ్లకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా జనవరి 16న (2026) గ్రామాలు, బ్లాక్ స్థాయిలో పూర్తి స్థాయి కార్యచరణ చేపడుతుంది.

మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు

మోదీ ప్రభుత్వం పార్లమెంటు లోపలా–వెలుపలా ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు పాల్పడుతోందని జెపి సిటియు తన ప్రకటనలో విమర్శించింది. ఇటీవలికాలంలో ప్రజలకు వ్యతిరేకంగా, వారికి హాని తలపెట్టేవిధంగా ఐదు ప్రధాన నిర్ణయాలు తీసుకుంది. లాభాపేక్షతో ప్రజల భద్రతను కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా 'శాంతి చట్టం' (సస్టైయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇండియా) తెచ్చింది. ఈ చట్టంఅమలులోకి వస్తే ప్రైవేటు వ్యక్తులు పౌరుల విద్యుత్ అవసరాల నిమిత్తం అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తారు. ప్రజల భద్రతను పణంగా పెట్టి లాభాలకోసమే కేంద్రం ఈ చర్యలకు దిగింది. పౌరుల విద్యుత్ అవసరాలు తీర్చడంకోసం అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవించినాగానీ విదేశీ కంపెనీలకు ఏ బాధ్యతా ఉండదు. ఈ చట్టంలో ఆ విధమైన నిబంధనలు తెచ్చారు. ఉత్పత్తి చేసినవారిని ప్రమాద సమయాల్లో బాధ్యులుగా చేయకుండా దేశ అణు భద్రతను, సార్వభౌమాధికారాన్ని కేంద్ర ప్రభుత్వం పణంగా పెట్టి ఈ చట్టం తెచ్చింది.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబి జీ రామ్ జీ (వికసిత్ భారత్–రోజ్‌గార్ హామీ–అజీవిక మిషన్) చట్టం–2025ను ఇటీవల కేంద్రం పార్లమెంటులో ఆమోదించింది. ఈ కొత్త చట్టం వల్లల గ్రామీణ ఉపాధి హామీ హక్కులు ప్రమాదంలో పడ్డాయి. ప్రజలు ఉద్యోగాలు లేకుండా సంకట పరిస్థితుల్లో ఉన్నపుప్పడు ఇప్పటివరకూ ఉన్న చట్టం ద్వారా ఉపాధి హామీ లభించింది. కొత్త చట్టంవల్ల ఈ ఉపాధి హామీ ఇచ్చేందుకు ఉద్దేశించిన నిధులభారం ఇకమీదట రాష్ట్రాలపై కూడా పడుతుంది. అసలే రాష్ట్రాలు అస్తవ్యస్థమైన పన్నుల విధానంవల్ల లోటు బడ్జెట్టులలో నడుస్తున్నాయి. పంటల సమయంలో ఈ చట్టం కార్మికులకు ఉపాధిహామీని లేకుండా చేసింది. భూస్వాములకు చాలా చవగ్గా కార్మికులు అందుబాటులోకి వచ్చేవిధంగా కొత్త విబి జీ రామ్ జీ చట్టాన్ని కేంద్రం తెచ్చింది.

బీమా రంగంలో నూటికి నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. ఆచరణాత్మకంగా విదేశీ ప్రైవేటు వ్యక్తులకు మనదేశంలో ఉన్న బీమా కంపెనీలలో హక్కులు ఇచ్చేవిధంగా ఈ చట్టం తెచ్చారు.

వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు–2025ను పార్లమెంటు ఉభయసభల్లో కేంద్రం ప్రవేశపెట్టింది. ఐతే ఈ సమావేశాల్లో ఈ బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. అదేవిధంగా ముసాయిదా విత్తన బిల్లు, ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు–2025లను కూడా కేంద్రం తీసుకువచ్చింది.

ఈ బిల్లులు ఆమోదం పొందితే దేశ వ్యవసాయరంగంపై వినాశకరమైన ప్రభావం పడుతుంది. దేశీయ, సూక్ష్మ,చిన్న,మధ్య తరహా విద్యుత్ వినియోగదారులు, ప్రభుత్వ విద్యుత్ రంగాలు తీవ్ర సమస్యల్లో పడతాయి. అదేవిధంగా ఉత్తర భారతదేశంలో నెలకున్న ప్రస్తుత వాతావరణ సంక్షోభాన్ని కూడా కేంద్ర కార్మిక సంఘాలు తీవ్ర అంశంగా పరిగణనలోకి తీసుకున్నాయి. ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లో దారుణమైన కాలుష్యం రాజ్యమేలుతోంది. సుప్రీంకోర్టు ప్రమాదకరమైన ఉత్తర్వులు ఇచ్చింది. థార్ ఎడారి విస్తరించకుండా ఉత్తర భారతదేశాన్ని రక్షిస్తున్న ఆరావళి పర్వతాలు ఈ ఉత్తర్వు వల్ల 90 శాతం మేరకు నాశనమయ్యే పరిస్థితులు వస్తాయి. అందువల్ల ఈ అమానుషమైన చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే ప్రజలకు, ఉద్యమాలకు కేంద్ర కార్మిక సంఘాలు తమ బలమైన సంపూర్ణ సంఘీభావాన్ని అందిస్తాయని జెపి సిటియు ప్రకటన పేర్కొంది.

## పాపం బిఆర్ఎస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హాయాంలో ఒక్క ప్రాజెక్ట్ అయినా సంతృప్తిగా పూర్తయిందా ? అని అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో మొత్తం రూ. 17,77లక్షల కోట్ల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేవలం రూ. 1,83 లక్షల కోట్లను మాత్రమే ఖర్చు చేశారని, ఇందులోనూ ఒకే ప్రాజెక్ట్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు బ్యారేజీలు కూలిపోయాయయని ఉత్తమ్ వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ విషయంలో సవరణలు చేస్తూ రూ. 55,086 కోట్ల డిపిఆర్‌ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం సిడబ్ల్యుసికి సమర్పించిందని, ఇందులో భూసేకరణకు అయ్యే ఖర్చులను కూడా పొందుపర్చలేదని వివరించారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో కేవలం 30నుంచి 35 శాతం పనులను మాత్రమే పూర్తి చేసిందన్నారు. తాము అధికారంలోనికి వచ్చాక రూ. 7వేల కోట్లతో 11 పంపులను ఇన్‌స్టాల్ తదితర పనులను పూర్తి చేశామన్నారు. కృష్ణట్రిబ్యూనల్ తుది నిర్ణయం వరకు తెలంగాణకు 34 శాతం, ఆంధ్రకు 66 శాతం అని కెసిఆర్ అంగీకరించారని, ఇందులో పాలమూరు రంగారెడ్డితో పాటు పాలమూరు, నల్లగొండ జిల్లాకు చెందిన ప్రాజెక్ట్‌లకు కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. రాయలసీమ ప్రాజెక్ట్ ద్వారా రోజూ 3 టిఎంసిల నీటిని ఎపి తరలించుకునేందుకు కెసిఆర్ దోహదపడ్డారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. 10లక్షల ఎకరాల నీటి కేటాయింపులను 'జూరాల' నుంచి శ్రీశైలంకు తరలించారు...

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిమ్మితం పూర్తిగా తెలంగాణ నియంత్రణలో ఉండే జూరాల ప్రాజెక్ట్‌కు 10లక్షల ఎకరాలతో ప్రణాళికను రూపొందిస్తే, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆ పది లక్షల ఎకరాల నీటి కేటాయింపులను శ్రీశైలం రిజర్వాయర్‌కు బదిలీ చేశారని, ఈ రిజర్వాయర్ తెలంగాణ, ఆంధ్రకు ఉమ్మడిదని, తద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేశారని ఆరోపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2014 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, బిఆర్ఎస్ పదేళ్ల అధికారాన్ని ముగిసే వరకు కూడా కల్వకుర్తి, బీమ, నెట్టెంపాడు, కోయల్ సాగర్ ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు.

## త్వరలో నోటీసులు?

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఫోన్ ట్యాపింగ్ ఎవరి కోసం చేశారు? ఎవరి ఆదేశాల మేరకు చేశారన్న దారిపై సిట్ ప్రధానంగా ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే మాజి సిఎం కెసిఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని యోచిస్తున్నట్లుగా సమాచారం.

అయితే, ఎంక్వైరీలో ప్రభాకర్ రావు పదేపదే అప్పటి డిజిపి మహేందర్ రెడ్డితో పాటు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావనకు తెస్తున్నట్లుగా సిట్ చీఫ్ సజ్జనార్ గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో మహేందర్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేసిన విషయం తెలిసిందే. దీంతో అసెంబ్లీ సమావేశాల అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

**ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా..**

అదేవిధంగా ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో సభ్యులైన మాజీ సిఎస్‌లు సోమేష్ కుమార్, శాంతికుమారి, ఇతర అధికారులు తిరుపతి, శేషాద్రిలను సిట్ విచారించిన విషయం తెలిసిందే. అయితే, తమ దగ్గరికి ప్రభాకర్ రావు కొన్ని వేల నెంబర్లు తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. ఎస్‌బిఐ మీద ఉన్న నమ్మకంతో సంఘ విద్రోహులు, మావోయిస్టులు, టెర్రరిస్టులపై ఫోకస్ పెడతారని ఆ నెంబర్లను తాము వెరిఫై చేయలేకపోయామని సమాధానమిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎఫ్ఎస్ఎల్ ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ ఎండి శ్రవణ్ రావు, మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావుకు మధ్య సంభాషణలను రీట్రీవ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ డేటాను ఆధారంగా చేసుకుని సిట్ మాజి సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు ఇస్తారనే ముచ్చట పొలిటికల్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## మార్పులను అందిపుచ్చుకుని ముందుకు సాగితే..
# సింగరేణి సుస్థిర భవిష్యత్

### కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధే ప్రాధాన్య అంశాలు

**సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఇన్‌చార్జి సిఎండి డి.కృష్ణ భాస్కర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థ బలం కేవలం ఉ త్పత్తిలో కాదని, తరతరాల శ్రమ, క్రమశిక్షణ, పరస్పర నమ్మకంతో పనిచేస్తున్న కార్మికులేనని సింగరేణి ఇన్‌చార్జి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.కృష్ణ భాస్కర్ అన్నారు. గత137 ఏళ్లుగా సింగరేణి దృఢంగా నిలబడటం వెనక కార్మికుల కృషి ఉందని తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన సింగరేణి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి ప్రధాన ప్రాధాన్యాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను మరింత మెరుగుపరచడం, పని పరిస్థితులను మరింత సురక్షితంగా చేయడమే లక్ష్యమన్నారు. ప్ర మాదాలను నివారించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరం కృషి చే యాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఎన్నో వాతావర ణ ప్రతికూలతలు, సాంకేతిక సవాళ్లు, మార్కెట్ మార్పులు ఉ న్నప్పటికీ భద్రత ప్రమాణాలను పాటిస్తూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ముందుకు సాగినట్లు గుర్తు చేశారు. ఈ ప్రయత్నంలో ప్రతీ గని కార్మికుడు, సూపర్ వైజ ర్, అధికారి చూపిన బాధ్యతలను ఆయన ప్రశంసించారు. సిం గరేణి భవిష్యత్‌పై అందరం ప్రశ్నించుకోవాలని, వాటికి సమాధానాలు వెతుక్కోవాల్సిన బాధ్యత మనదే అన్నారు. ఈ దిశలోనే ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాల కోసం మన అనుభవం, సామర్థ్యంతో రాణించే ఇతర రంగాలపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, కీలక ఖ నిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించడం ప్రారంభించామన్నారు. ఈ అంశా లు ఇంకా ఆలోచన దశలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తును నిర్ల క్ష్యం చేయకుండా ముందే సిద్ధమవ్వాలన్న భావనతోనే ప్రయత్నాలు సాగిస్తున్నామని వివరించారు. ఇంధన రంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో సింగరేణి ఏ పాత్ర పోషించగలదనే దానిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. మన పనితీరును మరింతగా మెరుగు పరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సరైన వేగంతో, సరైన దిశలో, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సింగరేణి తన సుస్థిరతను కాపాడుకుంటూ మారుతున్న కాలానికి తగినట్టుగా మారగలదన్న నమ్మకం ఉందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ పరిగెన్, జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లలో అక్రమాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో 3 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్ లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్లపైగా అక్రమ ఆస్తులు గుర్తించామని, బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని బంధువు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. కిషన్ నాయక్‌ను కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు తెలుసుకుంటామని ఎసిబి అధికారులు చెప్పారు.

# జనరల్
STATE & REGIONAL NEWS

## జిఒలు పబ్లిక్ డొమైన్లో పెట్టండి
### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ జిఒలను వెంటనే పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్స్, రూల్స్, జిఒలు, సర్క్యులర్స్ అన్నింటినీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలంటూ బిఆర్‌ఎస్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారించారు. 2022లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిఒలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిఒలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. 2023 డిసెంబరు నుంచి 2025 జనవరి వరకు 19064 జిఒలు జారీ చేస్తే అందులో 3290 జిఒలే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. 15,774 జిఒలు అందుబాటులో లేవు. జిఒలను అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో జిఒ ఇచ్చింది. ఆ జిఒను అమలు చేయాలని 2022లో డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. అయినప్పటికీ ప్రభుత్వం జిఒలను అప్‌లోడ్ చేయకుండా గుట్టుగా ఉంచింది.. అని పిటిషనర్ వాదన. దీనిపై న్యాయమూర్తి జిఒలను వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశించి పిటిష్ప విచారణ ముగించారు.

## పేరు మార్చిన నూతన చట్టంతో
# ఉపాధిహామీ పథకం విధ్వంసం

### కేంద్రంతీరును నిరసిస్తూ వామపక్షాల ఆందోళన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చుతూ గ్రామీణ్ విబి జి రామ్ జి–2025ను తీసుకురావడానికి నిరసిస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని సుభాష్ సెంటర్ లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె హాశం, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ వ్యవస్థను విధ్వంసం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం తెచ్చిందని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బోలుగూరి నరసింహ, నల్పరాజు రామలింగయ్య. వి.లెనిన్, ఎండి అక్బర్, సుజాత, విజయ, ముండ్ల ముత్యాలు, దోటి పందరి, అక్కలయ్య, వీరయ్య, షరీఫ్ మదర్, సిపిఐఎం జిల్లా నాయకులు బండ శ్రీశైలం, పి.ప్రభావతి, సలీం, పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య, ఔటర్ రవీందర్, తుమ్మల పద్మ, కృష్ణారెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిరంజీవి, బొంగురాల నరసింహ, బివి చారి, రావుల నరేష్, కల్లూరి అయోధ్య పాల్గొన్నారు.



హయత్‌నగర్(రంగారెడ్డి)..

### బిజెపి కుట్రలు తిప్పికొట్టాలి

**హయత్‌నగర్:** గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేసే బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన దీక్ష కార్యక్రమానికి రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ జిరామ్‌జి చట్టాన్ని తక్షణమే రద్దు చేసి ఉపాధి చట్టాన్ని యధావిదంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మండల కార్యదర్శి సరిత, మందుల కృష్ణ, పారిజాత, సౌజన్య, సుమతి, యమునా, కళ్యాణి, అనిత, అలివేణి, ఆదిలక్ష్మి, వీరస్వామి, జానీ, గిరి, ఉపేందర్, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గాంధీని అవమానించడమే..

**హుజూర్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం పేరులోని జాతిపిత మహాత్మాగాంధీ పేరును తొలగించడం దేశ చరిత్రను అవమానించడమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేసి గాంధీపార్కులోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరం మల్లీశ్వరి, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, మామిడి వెంకయ్య, సోమగాని కృష్ణ, కందుల వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, గుండా రమేష్, యల్లావుల ఉమా, సుందరి పద్మ, పొనుగులేటి వాసుదేవరావు, శ్యామ్‌సన్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### పేరు మార్చడం కేంద్రానికి సిగ్గుచేటు

**గరిడేపల్లి:** ఉపాధి పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం కేంద్రానికి సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శి పోటు పూర్ణచందర్‌రావు, మండల కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, కిరణ్, తాళ్ల తిరపయ్య, నబీ, మస్తాన్, పీర్‌సాహెబ్, నర్సింరావు, గోవిందు, కట్ట అశోక్, కుందురు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### జి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

**నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం ఎదుట ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకాన్ని రద్దుచేసి తెచ్చిన జిరామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా వామపక్ష నాయకులు నందిరామయ్య, దుర్గం నూతన్ కుమార్, ఎస్.ఎన్.రెడ్డి, జే.రాజు, కే.రాజన్న, సురేష్ మాట్లాడుతూ జీ రామ్ జీ చట్టం రద్దు అయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కె.లక్ష్మి, మహమూద్, రామ్ లక్ష్మణ్, బక్కన్న, సుజాత, వెంకటేష్, నారాయణ, గంగన్న పాల్గొన్నారు.

### నూతన చట్టాన్ని ఉపసంహరించాలి

**కరీంనగర్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దుచేసి కొత్త చట్టం తేవడాన్ని నిరసిస్తూ మంగళవారం గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో తట్టలు, పారలు చేతబూని నిరసన ధర్నా చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోగిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లానాయకులు జిందం ప్రసాద్ మాట్లాడారు. కూలీలు ఉపాధి ఎగ్గొట్టేందుకే పేరు మార్పు అని, నిధులు నిలుపుదల చేయుటకు ఈకుట్ర అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్షనేతలు గుడి కందుల సత్యం, గీట్ల ముకుంద రెడ్డి, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సత్యరావు, రాజశేఖర్, మల్లేశం రాజేశం, అజయ్ గజ్జల శ్రీకాంత్, జి.తిరుపతి నాయక్, గామినేని సత్యం, బాకం అంజయ్య, చెంచల మురళి, పుల్లెల మల్లయ్య, రాయి కంటి శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వినయ్, శ్రీనివాస్,రాకేష్, సాయికుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో...



మహబూబ్‌నగర్‌లో...


వరంగల్‌లో..


నల్లగొండలో..


మునగాల(సూర్యాపేట)..


గరిడేపల్లి(సూర్యాపేట)..

### వికసిత్ భారత్ పేరుతో దోచుకునే నియంతృత్వ చట్టాలు

**వరంగల్ :** గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే చట్టబద్ధ హక్కును తీసివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ రోజ్ గార్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబిజిరాంజి) చట్టాన్ని తీసుకువచ్చిందని, తక్షణమే ఈచట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని లేకపోతే దారిద్ర రేఖకు దిగువ నున్న పేదలకు తీవ్రమైన నష్టం చేకూరుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్ అన్నారు. వామపక్ష పార్టీల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ జిరామ్‌జి అనే నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్లకార్డ్స్ ధరించి నిరసన వ్యక్తం చేస్తూ చట్ట ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు జన్ను రవి, జాన్ పాల్, చిట్యాల, సువర్ణ, లలిత ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్, జిల్లా నగర సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు మహమ్మద్ మెహబూబ్ భాష, పరిమళ గోవర్ధన్, రాజు, ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నూతన చట్టంతో ఉపాధి నిర్వీర్యం

**మహబూబ్‌నగర్ :** గ్రామీణ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన చట్టం తెచ్చిందని వామపక్షాల నాయకులు ఆరోపించారు. నూతన చట్టాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అల్వాల్ రెడ్డి, సిపిఎం నాయకులు కిల్లే గోపాల్, ఎన్.కురుమూర్తి, బొల్లె చంద్రకాంత్, రాజ్ కుమార్, ప్రశాంత్ చారి, సిపిఐ జిల్లా నాయకులు కోటకదిరి నరసింహ, ఇందిరా, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మణ్, సుందర్ , రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడ సుదర్శన్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

### నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు, నిరంతర ప్రజా పోరాట యోధుడు బోడ సుదర్శన్ మరణం పార్టీకి, ఈ ప్రాంతానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి సుదర్శన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. మోత్కూర్ కేంద్రంగా విద్యార్థి ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 15 ఏళ్ల పాటు వలిగొండ మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై పట్టువదలని పోరాటాలు చేసి, సామాన్యుల మనసు గెలుచుకున్న నాయకుడని ఆయన స్మరించుకున్నారు. 'సుదర్శన్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన సేవలు, సాగించిన ఉద్యమాలు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిరంతరం నిలిచి ఉంటాయన్నారు.



**చెరగని ముద్ర : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దివంగత నేత మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి, అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో వారి నిధుల ద్వారా ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో సుదర్శన్ కీలక భూమిక పోషించారని గుర్తుచేసుకున్నారు. జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ మృతి జిల్లా ఉద్యమానికి తీరని లోటుగా పేర్కొన్నారు. వలిగొండ మండల కేంద్రంలో జిల్లా మూడో మహాసభను విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎషాల అశోక్, కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, కుసుమాని హరిచంద్ర, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సుద్దాల సాయికుమార్, కట్ల యాదగిరి, మారోజు నరసింహ చారి తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సుదర్శన్ మృతి పట్ల ఎంపీ, ఎమ్మెల్యేల సంతాపం ..**

బోడ సుదర్శన్ ఆకస్మిక మరణం తమకు దిగ్భ్రాంతిని కలిగించిందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలిపారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లపై పిటిషన్
### 'స్టే'కు హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్ :** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలనే పిటిష్ప హైకోర్టు విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని, రిజర్వేషన్ల వ్యవహారం తేలేవరకు స్టే ఇవ్వాలని అడ్వొకేట్ పుట్టా పద్మారావు వేసిన పిటిషన్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరారు. బార్ కౌన్సిల్ వాదనల తర్వాతే స్టే ఆదేశాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. బార్కౌన్సిల్ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ ఇచ్చిందని, ఎస్సీ, ఎస్టీలకు కూడా రిజర్వేషన్లు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ వాదన. విచారణ ఈనెల 29కి వాయిదా పడింది.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి
# గాంధీ పేరు తొలగించడం దుర్మార్గం

### జనవరి 3న దేశవ్యాప్తంగా ఐఎన్‌టియుసి నిరసన కార్యక్రమాలు
### సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి డా.జి.సంజీవరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి అందిస్తూ గాంధీ పేరుతో పాటు ఆదర్శాలతో స్పష్టంగా ముడిపడి ఉన్న చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి గాంధీజీ పేరును తొలగించడం దుర్మార్గం అని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి డా. జి. సంజీవ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బర్కత్ పురలోని అయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డా. జి. సంజీవ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాలకు పని హామీలను క్రమపద్ధతిలో నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్‌ఘర్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబిజి రామ్ జి) బిల్లు తీసుకువచ్చిందని తెలిపారు. విబిజి రామ్ జి చట్టంలో ఆర్థిక బాధ్యతలో వచ్చిన మార్పు రాష్ట్రాలపై భారాన్ని గణనీయంగా పెంచుతుందని, వాటికి అర్థవంతమైన నిర్ణయాధికారం లేకుండా చేయబడిందని, రాష్ట్రాల మధ్య ఖర్చుభాగస్వామ్య ఒప్పందం దాదాపు 90:10గా ఉండగా, ఇప్పుడు ఇది 60:40 పెంచిందని, దింతో రాష్ట్రాలపై అధిక భారం పడి ఉపాధి పని కోసం డిమాండ్‌ను పరిమితం చేయవలసివస్తుందని, దింతో గ్రామీణ పేదలకు ఉద్దేశించిన హామీనే దెబ్బతీస్తుందని తెలిపారు. విబిజి రామ్ జి కొత్త చట్టాన్ని తీసుకురావడాన్ని ఖండిస్తూ 2026 జనవరి 3న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐఎన్‌టియుసి నిరసన కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా హైదరాబాద్, ఇందిరా పార్క్ వద్ద ఆ రోజు భారీ ధర్నా ను నిర్వహిస్తున్నామని డా. జి. సంజీవ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. సత్యజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.బి. విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, నేతలు రవి పాల్గొన్నారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్స్ : వికారాబాద్ సర్కిల్.
టెండరు నోటిఫికేషన్ నెం. 15/25-26
అవసరమైన సామాగ్రి సరఫరా నిమిత్తం అర్హులైన టెండరర్ల నుండి ప్రతిపాదనలకు ఆహ్వానం.1) డి.బాద్‌లో ఒఎఫ్‌సి సొసైటీ సమీపంలో 100 కిలోవాట్ల యాంపియర్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతిష్ఠాపన. 2) డి.బాద్‌లోని బి.పేట్ (వి) బస్‌స్టాండ్ వద్ద 100 కిలోవాట్ల యాంపియర్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతిష్ఠాపన 3) కెడిజిఎల్ లో 2.5 కిలోమీటర్ల మేరకు 11 కిలోవాట్ల లైన్ ప్రతిష్ఠింపజేయడం ద్వారా 11 కిలోవాట్ల ఎక్స్‌ప్రెస్ ఫీడర్ మరియు కొడంగల్ ఫీడర్ల అనుసంధానం చేయడం. 4) కెడిజిఎల్‌లో 11 కిలోవాట్ల లైన్‌ను 1.35 కిలోమీటర్ల మేరకు ప్రతిష్ఠించడం ద్వారా 11 కిలోవాట్ల పర్సాపూర్ ఫీడర్ మరియు కొడంగల్ ఫీడర్‌ను అనుసంధానం చేయడం. 5) తాండూర్‌లో 11 కిలోవాట్ల గౌతాపూర్ ఫీడర్ బైఫర్కేషన్ నుండి బీ ఎక్స్‌టెన్షన్‌తో 0.75 కిలోమీటర్ల మేరకు 11 కిలోవాట్ల లైన్ విసిబి మరియు విసిబి ప్రతిష్ఠాపన. 6) తాండూర్‌లో 11 కిలోవాట్ల ఓజీపూర్ ఫీడర్ మరియు 11 కిలోవాట్ల కరంకోట్ ఫీడర్ అనుసంధానం. 7) పెద్దెముల్‌లో 4.5 కిలోమీటర్ల లైన్ మరియు 11కిలోవాట్ల విసిబి ప్రతిష్ఠించడం ద్వారా న్యూతట్టెపల్లిలో 11 కిలోవాట్ల ఫీడర్‌ను ప్రతిష్ఠింపజేయాలి. తదుపరి వివరాల కోసం www.tgsouthernpower.com ను సందర్శించండి. సామాగ్రి వివరాలు అన్నీ పైన పేర్కొన్న వెబ్‌సైటులో తెలియజేయడమైనది.
ఫోన్ నెం. 8712469736 లేదా 8712469716
ఇ-మెయిల్ : sevkbtgspdcl@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, ఆపరేషన్, టిజిఎస్‌పిడిసిఎల్ వికారాబాద్ సర్కిల్.
DIPR R.O. No. : 12414-PP/CL/ADVT/1/2025-26, Date: 22-12-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి నం. ఇ2/613/2024 ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన తేది: .12.2025
ఈ దేవస్థానం నందు గల విండో మరియు స్ప్లిట్ ఎ.సి.లకు ది.01.01.2026 నుండి ది.31.12.2026 వరకు ఒక సంవత్సర కాలమునకు Annual Maintenance మరియు ఇతర పనులకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 24.12.2025 ఉదయం గం.11:00 ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 06.01.2026 ఉదయం గం.11:00 వరకు, **టెక్నికల్ బిడ్** అదేరోజు ఉదయం గం.11:30 ని., **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 06.01.2026 మధ్యాహ్నం గం.12:00లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- కె. దామోదర్ రావు కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 12508-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**తెలంగాణ ప్రభుత్వము, అటవీశాఖ, పెద్దపల్లి**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.266/2024/S4/Ramagiri Fort, తేది: 23-12-2025
పెద్దపల్లి జిల్లాలో 2025-26 సంవత్సరకాలంలో ఖిలారామగిరి రిజర్వుఫారెస్టు, బేగంపేట్ మరియు రత్నాపూర్ గ్రామాల పరిధిలోని రామగిరి మండలం, రత్నాపూర్ బీటు, కల్వచర్ల సెక్షన్, పెద్దపల్లి రేంజ్ పరిధిలోని రామగిరి ఖిల్లా యందు ఇకో **టూరిజం** పనుల నిర్మాణం కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **మొత్తం అంచనా విలువ:** రూ. 83.774 లక్షలు (ECV). **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ తేది:** 27.12.2025న ఉ.11:30 గం.ల నుండి, **టెండరు ముగింపు కొరకు చివరి తేది:** 06.01.2026న మ.2:00గం.ల వరకు, **సాంకేతిక బిడ్ తెరచు తేది:** 07.01.2026న ఉ.11:00 గం.లకు, **Price bid (ధర) తెరచు తేది:** 07.01.2026న సా.4:00 గం.లకు. అన్ని వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి.
DIPR R.O. No. : 12545-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: జడ్చర్ల మున్సిపాలిటీ**
మహబూబ్‌నగర్ జిల్లా (టిఎస్)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
2025-26 సంవత్సరానికి సాధారణ నిధుల కింద ఒక పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో టెండర్ పిలవడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: **23.12.2025న మ.01.00గం.ల నుండి,** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: **30.12.2025న మ.01.00గం.ల వరకు.** మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్స్ ఆహ్వానించే అధికారి: కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ, తెలంగాణ స్టేట్. ఫోన్: 7337351867.
సం/- కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 12546-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-14, జిహెచ్ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT No. 59/E.E.14/GHMC/2025-26, తేది: 22.12.2025
**పని పేరు:** జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. **అంచనా విలువ:** రూ.236.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:* 23.12.2025న ఉ.11.00గం.ల నుండి మరియు *బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 30.12.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి. 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 12534-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్రస్థాయి మాక్ డ్రిల్

**12 జిల్లాలు, 5 పారిశ్రామిక ప్రాంతాల్లో విన్యాసాలు**

**ప్రజాపక్షం /హైదరాబాద్:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో స్పందన సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) సహకారంతో ఈ విన్యాసాలు చేపట్టారు. వాతావరణ మార్పుల కారణంగా అకస్మాత్తుగా సంభవిస్తున్న భారీ వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్స్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం సంసిద్ధతను పరీక్షించారు. వరద ప్రభావిత ప్రాంతాల ఆధారంగా 12 జిల్లాలతో పాటు ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా 5 జిల్లాలు, ఆర్‌జిఐఎ పరిధిలో మాక్ డ్రిల్లులు నిర్వహించారు.ఈ విన్యాసాల ద్వారా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కమ్యూనికేషన్, విభాగాల మధ్య సమన్వయం, ప్రజల తరలింపు, అత్యవసర సేవల సామర్థ్యాన్ని పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామిక ప్రమాదాల సమయంలో పరస్పర సహకారం, ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్లను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## మహిళలకు అండగా తెలంగాణ మహిళా కమిషన్

**తెకమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా కమిషన్ ఎల్లప్పుడూ మహిళలకు అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'నారీ న్యాయ్: హియర్ హర్ ఔట్' అనే బహిరంగ విచారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, ఉమెన్ సేఫ్టీ డిసిపిలు డా.లావణ్య, టి. ఉషా రాణి, జిల్లా రెవిన్యూ అధికారి ఈ.వెంకటాచారిలు ఉద్యోగ, గృహ హింస వేధింపులు,వివక్ష, ఆర్థిక, సైబర్ క్రైమ్ తదితర సమస్యలకు సంబంధించిన 100 మందికి పైగా మహిళా బాధితల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ మహిళల ఆవేదనను విని వారికి న్యాయం చేకూరేలా, త్వరితగతిన అవసరమైన చర్యలు చేపట్టేలా చూడటానికే 'నారీ న్యాయ్: హెయిర్ హర్ ఔట్' అనే బహిరంగ విచారణ ఏర్పాటు చేసి ఇందులో వివిధ విభాగాలను విచారణలో భాగస్వామ్యం చేయడం జరిగిందని తెలిపారు. తక్షణమే మహిళల పరిష్కారాలు సూచిస్తూ సంబంధిత శాఖల చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ ఫిర్యాదులపై నివేదికలు కోరారు. అధిక శాతం ఫిర్యాదులు గృహ హింసపై అందాయని ఎక్కువ ఫిర్యాదుల్లో నిందితులు ఎన్‌ఆర్‌ఐలై ఉండటం వల్ల ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ, సభ్యులు షాహిన్ అఫ్రోజ్, ఈశ్వరిబాయ్, శుద్ధం లక్ష్మి , గద్దల పద్మ, కొమ్ము ఉమాదేవి యాదవ్, ఏ రేవతి రావు,జిల్లా సంక్షేమ శాఖాధికారులు అక్కేశ్వర్ రావు, రాజేందర్, ప్రవీణ్ కుమార్, ఆర్. కోటాజీ, జి. ఆశన్న, ఇలియాజ్ అహ్మద్, వివిధ శాఖాధికారులు, వివిధ జోన్‌ల పోలీస్ అధికారులు, సఖి నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎఎఒయు కార్యనిర్వాహక సభ్యుడిగా ఘంటా చక్రపాణి నియామకం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓపెన్ యూనివర్సిటీస్ (ఎఎఓయూ) కార్యనిర్వాహక సభ్యులుగా డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్.ఘంటా చక్రపాణి ఎంపికయ్యారు. 2026–2028 కాలానికి కార్యనిర్వాహక సభ్యులుగా ప్రొ ఫెసర్. ఘంటా చక్రపాణి ని నియమిస్తూ ఎఎఓయూ సెక్రటరీ జనరల్ ప్రొ. రహమ్మత్ బుదిమాన్ అధికారిక సమాచారాన్ని పంపించారు. ఆసియా ఖండంలోని అన్ని ఓపెన్ యూనివర్సిటీలు ఇందులో సభ్యులుగా ఉంటారు. బీజింగ్‌లో ఇటీవల జరిగిన 2025 సంవత్సరపు సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఎఎఓయూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎఎఓయూకు కార్యనిర్వాహక సభ్యులుగా ఎంపిక కావడం తమ భాధ్యతను మరింత పెంచిందన్నారు. తెలంగాణలో సార్వత్రిక విద్య గ్రామీణ ప్రాంతంలో మరింత విస్తరించేలా, అందరికీ అందుబాటులో ఉన్నత విద్య ఉండేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. ఎల్‌వికె రెడ్డి, పలువురు డైరెక్టర్లు ప్రొ. పుష్ప చక్రపాణి, ప్రొ. రాబింద్రనాథ్ సోలమన్, ప్రొ. రాణి రజిత మాధురి, ప్రొ. రజని, ప్రొ. భోజు శ్రీనివాస్, డా. రమా దేవి, డా. దయాకర్ తదితరులు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ని అభినందించారు.

## 5 జిల్లాలలో యూరియా యాప్ ప్రయోగాత్మకంగా అమలు

**● యాప్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు ● త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు ● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ ద్వారా 5 జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున యూరియా యాప్ విజయంతంగా కొనసాగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు రోజులుగా యాప్ అమలు తీరును క్షుణంగా పరిశీలించామని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకున్నారన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 , పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని వెల్లడించారు. మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించారన్నారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి వెల్లడించారు. వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఒటిపి చూపించి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్‌ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో కూడా రైతులకు యాప్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. ఈ రబీ సీజన్‌కు గాను రాష్ట్రానికి ఇప్పటికే 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలలకు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

## కృష్ణా జలాలపై విషయంలో తెలంగాణకు కెసిఆర్ 'మరణ శాసనం'

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కృష్ణా జలాల పంపిణీ విషయం లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి తెలంగాణ రాష్ట్రానికి శాపంగా మారిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నీటి పారుదల అంశాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ కృష్ణా జలాల అంశంపై కెసిఆర్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. కృష్ణా నదిలో ఉన్న మొత్తం 811 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు కేటాయించి, తెలంగాణకు కేవలం 299 టిఎంసిలు మాత్రమే సరిపోతాయని సంతకం పెట్టింది కెసిఆర్ కాదా? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. సమర్థవంతంగా వాదించి ఉంటే 400 నుండి 450 టిఎంసిల వాటా దక్కేదని, కెసిఆర్ చేసిన ఆ చారిత్రక తప్పిదం గత పదేళ్లుగా తెలంగాణకు 'మరణ శాసనం'లా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**కొత్త ట్రిబ్యునలే పరిష్కారం**

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త ట్రిబ్యునల్ ద్వారానే కృష్ణా బేసిన్ నీటి పునర్విభజన శాస్త్రీయంగా జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరైన టెక్నికల్, లీగల్ వాదనలు వినిపించకపోతే తెలంగాణ మరోసారి నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అబద్ధపు ప్రచారాలు పక్కన పెట్టి, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**కేంద్రంపై అబద్ధపు ప్రచారాలు..**

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కెసిఆర్ కేంద్రంపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాంచందర్ రావు స్పష్టం చేశారు. డిపిఆర్‌ల పై కేంద్రం అడిగిన ప్రశ్నలు గత ప్రభుత్వ హయాంలోనే మొదలయ్యాయన్నారు. వేరే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభావంతో కేంద్రం అడ్డుకుంటుందన్న మాటలు కేవలం రాజకీయ నాటకమని విమర్శించారు. ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోవడమే కెసిఆర్ ధ్యేయం అని ఆయన విమర్శించారు.

**బిజెపి ఆధ్వర్యంలో 'ప్రత్యేక అధ్యయన కమిటీ'**

తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల స్థితిగతులను, క్షేత్రస్థాయి లోపాలను పరిశీలించేందుకు బిజెపి ఒక ప్రత్యేక స్టడీ టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ప్రాజెక్టుల వైఫల్యాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తుందని తెలిపారు.






## పివికి ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతరత్న మాజీ ప్రధాన మంత్రి పివి. నరసింహారావుకుకాంగ్రెస్ శ్రేణులతో పాటు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళ్లు అర్పించారు. పివి నరసింహారావు 21వ వర్థంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నెక్లెస్‌రోడ్ లోని పివిజ్ఞానభూమి వద్ద ముందు కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్,మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పివి కుటుంబ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్ లు, ఇతర ముఖ్య నేతలు పివి నరసింహారావు సమాధి వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్థిక అంశాల్లో దేశం ఈ రోజు నిలబడింది అంటే ప్రధానిగా పివి నరసింహా రావు చేపట్టిన సంస్కరణలు నిదర్శనమని పేర్కొన్నారు. పి.వి సేవలు చిరస్మరణీయమని, ఆర్థిక సంస్కరణలతో దేశం ముందంజ నిలిపిన మహనీయుడని కొనియాడారు. ప్రపంచ మాంద్యం వచ్చిన , కరోనా లాంటి విపత్తు వచ్చిన దేశం బయటపడి స్వయంగా నిలదొక్కుకుని నిలబడడానికి ఈ సంస్కరణలు స్ఫూర్తియని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించి పరుగులు పెట్టించిన మహనీయులన్ని కొనియాడారు.

## అసెంబ్లీలో పవర్‌పాయింట్‌ను స్వాగతిస్తున్నాం

**మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాగునీటి ప్రాజెక్టులపైన శాసన సభలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌కు కూడా పవర్‌పాయింట్‌కు అవకాశాన్ని కల్పించాలని బిఆర్‌ఎస్ మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో ఉన్న అనేక సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలన్నారు. తెలంగాణ భవన్‌లో జర్నలిస్టులతో హరీశ్‌రావు మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల్లో నీటి వాడకం కేవలం 28.49 శాతం మాత్రమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 45 టిఎంసిలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తరం రాయడం చారిత్రక తప్పిదమన్నారు. ప్రభుత్వం ఇరుకున పడినప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములాఈ కార్ రేస్ అంటూ లీకులు ఇస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని, అసెంబ్లీ ముగియగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇస్తార అని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మెప్పు కోసం అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసు అధికారుల పేర్లను రాసుకుంటున్నామని, ఎపిలో అధికారులకు పట్టిన గతే మీకు' పడుతుంది. రిటైర్ అయినా, విదేశాల్లో ఉన్నా తీసుకొస్తామని హెచ్చరించారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రూ.7వేల కోట్లను డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్ పంచుకున్నారని, 20 శాతం కమీషన్ ఇచ్చిన వారికే బిల్లులు ఇస్తున్నారని ఆరోపించారు.

## సిఎం ప్రజావాణిలో 433 దరఖాస్తులు

**దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 433 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి అక్కడిక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 133, రెవెన్యూ శాఖకు సంబంధించి 36,ఇందిరమ్మ ఇండ్ల కోసం 177, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు రాగా,ఇతర శాఖలకు సంబంధించి 86 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.




## సిఎం శిఖండి రాజకీయాలు చేయొద్దు

**● కాంగ్రెస్ ప్రభుత్వానికి 420 హామీల భయం.. ఎన్నికల నిర్వహణ నుండి పరార్ ● దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించాలి ● మాజీ మంత్రి,బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ● నల్లగొండలో నూతన ప్రజాప్రతినిధుల అభినందన సభ**

**ప్రజాపక్షం/నల్లగొండ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే, వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు వచ్చి ఏకేసు పెడుతున్నారో చెప్పాలని.. హోం మంత్రి కూడా ఆయనే కాబట్టి, ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలి, శిఖండి రాజకీయాలు చేయడం తగదని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని, కెసిఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల దృష్టి మళ్లించడానికి నోటీసుల డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్ల అభినందన సభ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజా ప్రతినిధులను అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడుతూ కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర మంత్రుల అజ్ఞానంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశం పైన ఎలాంటి అవగాహన లేదని అన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కెటిఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖా మంత్రికి నీళ్లపై కనీస అవగాహన లేదని, ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు నేను ప్రిపేర్ అయి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తాను అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం ఆగదని కెటిఆర్ ప్రకటించారు. ఇలాంటి బెదిరింపులకు బిఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 420 హామీల భయం పట్టిందని అందుకే ఎన్నికల నిర్వహణ నుండి పారిపోయిందని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్,ఎంఎల్‌సి మంకెన కోటిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్,కంచర్ల భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్,మాజీ ఎంఎల్‌సి కర్నే ప్రభాకర్,నాయకులు చెరుకు సుధాకర్,ఒంటెద్దు నరసింహా రెడ్డి,చాడ కిషన్ రెడ్డి, పాల్వాయి స్రవంతి, ముఖ్య నేతలు పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

## సింగరేణి కాలనీ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**సింగరేణి కాలనీ జెఎసి నాయకులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీ ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న నిరుపేద గుడిసెవాసులకు ఉన్నచోటనే పట్టాలు మంజూరి చేయాలని సింగరేణి కాలనీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జెఎసి నాయకులు కొర్ర మోతిలాల్ నాయక్ , మెగావత్ తుకారాం నాయక్ , విక్రం గౌడ్ మంగళవారం సింగరేణి కాలనీలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొర్ర మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ సింగరేణి కాలనీ గుడిసె వాసులు అన్ని విధాలుగా మౌలిక వసతులు ఉండి, గత 30 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నా వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలనీలో నివసించే గుడిసెవాసులు అందరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చే మంజూరు చేయబడిన ఓటరు కార్డు, రేషన్ కార్డు, లేబర్ కార్డు తదితర గుర్తిం పు కార్డులు అన్నీ కలిగి ఉన్నారని వివరించారు. సింగరేణి గుడిసెల ప్రాంతంలో ప్రభుత్వం, జిహెచ్‌ఎంసి మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు గుడిసెవాసులకు ఉన్నచోటనే పట్టాలు ఇప్పిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కొన్ని రో జులుగా కొంత మంది ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ సభ్యులు గుడిసె వాసులకు ప్ర త్యామ్నాయం కల్పిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం వద్దు ఉన్న చోటనే ఇళ్లపట్టాలు ఇవ్వాలి అని ఆయన అన్నారు. జెఎసి ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, ఇది ప్రభుత్వ స్థలం అర్బన్ సీలింగ్ ల్యాండ్‌లో ఉంటున్నామని, పట్టాలు ఇవ్వాలని కలిసి విన్నవించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సక్రి బాయి, సద్దాం ఖాన్ , షేక్ మహమూద్, జం గయ్య, విజయ్, గణేష్ నాయక్, నాగు నాయక్, శాంతి బాయ్, సుకుర్ పాషా, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ చట్టాలు దేశానికే ప్రమాదకరం

**సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాజాగా ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో దేశానికే అత్యంత ప్రమాదకరమైన నాలుగు చట్టాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఆమోదం తెలిపిందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. ఈ చట్టాల వల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి వ్యతిరేకంగా అన్ని కలిసొచ్చే శక్తులు, రాజకీయ పార్టీలను కలుపుకుని దేశవ్యాప్త పోరాటాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ ఎంబి భవన్‌లో మంగళవారం ప్రారంభమైన సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతిలతో విలేకరుల స మావేశంలో రాఘవులు మాట్లాడారు. కార్పొరేట్లకు అధిక లాభా లు కల్పించేందుకే నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని రాఘవులు విమర్శించారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను కార్పొరేట్లకు అప్పగించేందుకే విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ చట్టం అమలుతో క్రా ప్ సబ్సిడీ రద్దై రైతులు, పేదలు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కోల్పోతారని చెప్పారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులకు కూడా సబ్సిడీ వి ద్యుత్ ఉండదన్నారు. అదానీ, అంబానీ, గోద్రెజ్, సుజాన్ వంటి సంస్థల ఒత్తిళ్ల వల్లే ఈ నిర్ణయాలు తీసుకున్నారన్నారని మండిపడ్డారు. తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటుపై కూడా తీవ్ర అ భ్యంతరం వ్యక్తం చేశారు.

**రాష్ట్రాలకు భారంగా 'జీ రాం జీ' చట్టం**

'జీ రాం జీ' చట్టం రాష్ట్రాలకు భారంగా మారుతుందని, రాష్ట్రాలు తమ వాటా నిధులు ఖర్చు చేయకపోతే కేంద్రం నిధులు నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ భూ స్వాములకు, పట్టణ కార్పొరేట్లకు చౌక కూలీలు దొరికే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలు, దళితులే ఎ క్కువగా నష్టపోతారని అన్నారు. ఇన్సూరెన్స్ చట్టంలో మార్పులతో విదేశీ సంస్థలకు వంద శాతం పెట్టుబడులకు అవకాశం కల్పించారని, 'సబ్‌కా బీమా' పేరుతో కార్పొరేట్లకే రక్ష కల్పిస్తున్నారని విమర్శించారు. శాంతి పేరుతో తీసుకొస్తున్న న్యూక్లియర్ లయబిలిటీ బిల్లు దేశానికి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

**గ్రామ పాలకులకు శుభాకాంక్షలు : జాన్ వెస్లీ**

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా నిధులు కేటాయించాలని కోరారు. యూరియా యాప్‌ను ఎత్తివేసి పాత విధానంలోనే యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో సిపిఐ(ఎం) నేత హత్య కేసులో జాప్యం తగదన్నారు. గాదె ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, వెంటనే పనులు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీలను కలిసి కేంద్రంతో పోరాటం చేయాలని కోరారు.

**హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చించాలి..**

ఓఆర్ఆర్ అవతలకు పరిశ్రమలను తరలించి ఆ భూములను పారిశ్రామికవేత్తలకే అప్పగించాలని చూడటం సరిగాదన్నారు. ఆ పేరుతో రూ.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రూ.5వేల కోట్లకే పారిశ్రామిక వేత్తలకు కట్టబోతున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దానిపై అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు. ఆ భూములను ప్రజా ప్రయోజనాల కోసం, పేదలకు ఇండ్లను కట్టించడం కోసం ఉపయోగించాలన్నారు. నగరం నడిబడ్డున ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు వేరే ప్రాంతంలో భూములు అప్పగించి, దాన్ని జిహెచ్‌ఎంసిలో కలపాలని కోరారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలి : అనిల్ చౌహాన్

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని, స్వల్ప కాలిక, సుదీర్ఘ యుద్ధాలకూ భారత్ సిద్ధంగా ఉండాలని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ సూచించారు. ఈ మేరకు ఐఐటి బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారు. వారి నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధపడాలి. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధమవ్వాలి. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలి. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ పోరాట తీరును మారుస్తున్నాయి అని అన్నారు.

## ఒడిశాలో నక్సల్స్ లొంగుబాటు

- ఆయుధాలు వీడిన 22 మంది మావోయిస్టులు



**మల్కన్‌గిరి:** దేశ వ్యాప్తంగా మావోయిస్టులు క్రమంగా ఆయుధాలను వీడుతున్నారు. తాజాగా ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో మంగళవారం 22 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయినట్లు ఓ అధికారి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒడిశా డిజిపి వై బి ఖురానియా, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో తొమ్మిది తుపాకులు, 150 లైవ్ రౌండ్ల మందుగుండు సామగ్రి, 20 కిలోల పేలుడు పదార్థాలు, 13 ఐఇడిలు, జెలటిన్ స్టిక్స్, ఇతర వస్తువులను అప్పగించారు. లొంగిపోయిన మావోయిస్టులలో ఎక్కువ మంది పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు. అయితే వారు ఒడిశాలో కార్యకలాపాలు నిర్వహించేవారని అధికారి తెలిపారు. సుక్మా జిల్లాకు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు (డిసిఎం) లింగే అలియాస్ మైరే మడ్కం (45), ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాకు చెందిన ఎసిఎం (ఏరియా కమిటీ సభ్యుడు), కమాండర్ బామన్ మడ్కం (27) లొంగిపోయిన మావోయిస్టులలో ఉన్నారు. ఒడిశా ప్రభుత్వం నవంబర్ 27న లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చి రివార్డును సవరించింది. పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో అందించే దానికంటే ఇది 10 శాతం ఎక్కువగా పెంచింది.

## యాపిల్స్ సుంకం రాయితీలు
# తొలి దేశంగా కివిస్ అవతరణ

**న్యూఢిల్లీ:** భారతదేశం న్యూజిలాండ్‌కు యాపిల్, కివీఫ్రూట్, మనుకా తేనె కోసం మంజూరు చేసిన కోటా సుంకం రాయితీలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద ద్వీప దేశం కట్టుబడి ఉన్న వ్యవసాయ ఉత్పాదకత కార్యాచరణ ప్రణాళికలకు పంపిణీకి అనుసంధానించబడి ఉన్నాయి. ఈ ప్రణాళికల అమలును ఉమ్మడి వ్యవసాయ ఉత్పాదకత మండలి (జెఎపిసి) పర్యవేక్షిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం సున్నితమైన దేశీయ వ్యవసాయ రంగాల రక్షణతో మార్కెట్ మార్కెట్ యాక్సెస్‌ను సమతుల్యం చేయడం ఈ చర్య లక్ష్యం. భారతదేశంలో ఉత్పాదకత, నాణ్యత, రంగాల వారీ మూలధనాన్ని మెరుగుపర్చడానికి కివిఫ్రూట్స్, యాపిల్స్, తేనె కోసం కేంద్రీకృత కార్యాచరణ ప్రణాళికలపై న్యూజిలాండ్ అంగీకరించింది. ఈ సహకారంలో అత్యుత్తమ కేంద్రాల స్థాపన, మెరుగైన మెటీరియల్ ప్లాంటింగ్, పండ్లతోటల నిర్వహణకు సాగుదారుల సాంకేతిక మద్దతు కోసం సామర్థ్య నిర్మాణం, పంట కోత తర్వాత పద్ధతులు, సప్లయ్ చైన్స్, ఆహార భద్రత ఉన్నాయి. ప్రీమియం యాపిల్ సాగుదారుల కోసం ప్రాజెక్ట్‌లు, స్థిరమైన తేనెటీగల పెంపకం పద్ధతులు భారతదేశంలో ఉత్పత్తి, నాణ్యతా ప్రమాణాలను మెరుగు పరుస్తాయి.




యాపిల్, కివిఫ్రూట్, మనుకా తేనె కోసం అన్ని టారిఫ్ కోటాలు వ్యవసాయ ఉత్పాదకత కార్యాచరణ ప్రణాళికల డెలివరీకి, జెఎపిసి పర్యవేక్షణకు అనుసంధానించబడి ఉన్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఒప్పందం ప్రకారం తన యాపిల్స్‌లకు సుంకం రాయితీలు ఇచ్చిన మొదటి దేశంగా న్యూజిలాండ్ అవతరించింది. ప్రస్తుతం భారతదేశం యాపిల్స్‌పై 50శాతం దిగుమతి సుంకాన్ని కలిగిఉంది. ఈ ఒప్పందం ప్రకారం దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడటానికి భారతదేశం కోటా కనీస దిగుమతి ధర (ఎంఐపి) ఉన్నటువంటి యాపిల్స్‌కు సుంకం రాయితీలను ఇస్తోంది. ప్రస్తుతం భారతదేశం న్యూజిలాండ్ నుండి వార్షిక యాపిల్ దిగుమతులు 32.4మిలియన్ డాలర్ల విలువైన 31.392.6 టన్నులు (మిలియన్ టన్నులు) కాగా, దేశం 519,651.8 మిలియన్ టన్నులు (424. 6 మిలియన్ అమెరికన్ డాలర్లు) యాపిల్ దిగుమతులు చేస్తోంది.ఈ ఒప్పందంలో ఒప్పందం మొదటి సంవత్సరంలో 32,500 మిలియన్ టన్నులపై దిగుమతి సుంకం రాయితీలు న్యూజిలాండ్‌కు ఇవ్వబడతాయి. ఆరవ సంవత్సరంలో కోటా 25 శాతం సుంకం, (1.25/కేజీ అమెరికన్ డాలర్ల ఎంఐపితో 45,000మెట్రిక్ టన్నులకు పెంచబడుతుంది. ఈ కోటా దాటి 50శాతం సుంకం అమలులోకి వస్తుంది. ఒప్పందం ప్రకారం న్యూజిలాండ్ నుంచి ఎంచుకున్న వ్యవసాయ ఉత్పత్తులు (యాపిల్స్, కివిఫ్రూట్, మనుకా తేనె ) అల్బుమిన్‌లకు మార్కెట్ యాక్సెస్ ఎంఐపి, ఇతర రక్షణ చర్యలతో టారిఫ్ రేటా కోటా (టిఆర్‌క్యూ) వ్యవస్థ ద్వారా నిర్వహించబడుతుంది. నాణ్యమైన దిగుమతులు వినియోగదారుల ఎంపికను నిర్ధారిస్తుంది. అదే సమయంలో దేశీయ రైతులను రక్షించడం కూడా చేస్తుంది.

## 'సర్' మొదటి దశ విచారణకు
# 32 లక్షల మంది మ్యాపింగ్ చేయని ఓటర్లు



**కోల్‌కతా:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కింద మొదటి దశ విచారణలకు సుమారు 32 లక్షల మంది మ్యాపింగ్ చేయని ఓటర్లను పిలవనున్నట్లు అధికారులు తెలిపారు. 2002 ఓటర్ల జాబితాలో తమ పేర్లను కుటుంబ సభ్యుల పేర్లతో అనుసంధానించలేని ఈ వర్గం ఓటర్లకు సంబంధించిన విచారణలు ఈనెల 27 నుండి ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. తాము మంగళవారం నుంచి సుమారు 10 లక్షల మంది ఓటర్లకు నోటీసులు పంపడం ప్రారంభించామని, మంగళవారం నుండి మరో 22 లక్షల మంది ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలోని ఒక అధికారి పిటిఐకి తెలిపారు. గణన దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,68,424 మంది మ్యాపింగ్ చేయని ఓటర్లను గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఈ విచారణలు జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాలు, సబ్‌డివిజనల్ కార్యాలయాలు, వివిధ ప్రభుత్వ విభాగాలు, అలాగే పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించబడతాయన్నారు. తార్కిక వ్యత్యాసాలు ఉన్న ఓటర్ల విషయాన్ని తదుపరి దశలో చేపడతామని, దీని కోసం ఎన్నికల సంఘం నుండి మార్గదర్శకాలు కోరినట్లు మరో అధికారి తెలిపారు. ప్రతి విచారణ ఒక మైక్రోఅబ్జర్వర్ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని ఆయన చెప్పారు. 4,000 మంది మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణ 24న కోల్‌కతాలో రెండు దశల్లో జరుగుతుందని, ఈ మైక్రోఅబ్జర్వర్లందరూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అని ఆయన పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మైక్రోఅబ్జర్వర్లకు స్థానిక బెంగాలీ భాషపై అవగాహన లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించడానికి ఎన్నికల సంఘం నుండి ఒక ప్రతినిధి బృందం రాష్ట్రానికి వస్తుందని రాష్ట్ర సిఇఒ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో విచారణ దశ పురోగతిని అంచనా వేయడానికి కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.బి. జోషి, డిప్యూటీ సెక్రటరీ అభినవ్ అగర్వాల్ రాష్ట్రానికి వస్తారని ఆయన చెప్పారు. ఈ అధికారులు డిసెంబర్ 24న మైక్రోఅబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

## మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో
# ఎంవిఎకు కఠిన పరీక్ష



**ముంబయి:** మహారాష్ట్రలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని మహాయుతి భారీ స్థానాలను గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ, మినీ అసెంబ్లీ ఎన్నికలుగా భావిస్తున్న ముంబయితో సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరగబోయే ఎన్నికల్లో కఠిన పరీక్షను ఎదుర్కోనుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామీణ ఎన్నికలు తరచుగా స్థానిక సమీకరణాల ద్వారా ప్రభావితమైనప్పటికీ, అవి రాజకీయ పార్టీల క్షేత్రస్థాయి బలానికి సూచికగా కూడా పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో చిన్న పట్టణాలు, పాక్షిక పట్టణ ప్రాంతాలలో మహాయుతి సంస్థాగత యంత్రాంగాన్ని ఎదుర్కోవడంలో ప్రతిపక్షం ఎదుర్కొంటున్న ఇబ్బందిని ఇటీవలి ఫలితాలు హైలైట్ చేస్తున్నాయని పరిశీలకులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఎన్నికలు జరిగిన 288 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలలో, మహాయుతి 207 మున్సిపల్ అధ్యక్ష పదవులను గెలుచుకుంది.బిజెపి అత్యధిక వాటాను దక్కించుకుని 117 మున్సిపల్ అధ్యక్ష పదవులను గెలుచుకోగా, దాని మిత్రపక్షాలైన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 53 పదవులను, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి 37 పదవులను గెలుచుకున్నాయి.మరోవైపు, ప్రతిపక్ష ఎంవిఎ మొత్తం 44 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 28, ఎన్‌సిపి (శరద్చంద్ర పవార్) 7, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) వరుసగా 9 పదవులను గెలుచుకున్నాయి. నవంబర్ 2024 అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన అద్భుతమైన పనితీరును మహాయుతి స్థానిక సంస్థల ఎన్నికలలో వాస్తవంగా పునరావృతం చేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. జనవరి 15, 2026న జరగనున్న ముంబయితో సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరగబోయే ఎన్నికలలో ఎంవిఎ ఇప్పుడు కీలకమైన సవాలును ఎదుర్కొంటోంది. సంక్షోభంలో ఉన్న ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని సేన (యుబిటి)కి, బిజెపి, షిండే నేతృత్వంలోని శివసేన నుండి బలమైన సవాలు మధ్య ముంబయిలోని తన 'కోట'ను నిలబెట్టుకోవడం ప్రధాన సవాల్‌గా మారింది. ముంబయి కోసం సేన (యుబిటి), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) మధ్య పొత్తుపై చాలా కాలంగా ఎదురుచూస్తున్న ప్రకటన డిసెంబర్ 24న వెలువడే అవకాశం ఉందని సేన నాయకుడు సంజయ్ రౌత్ సూచించారు. ఉద్ధవ్, రాజ్ థాక్రేల మధ్య సాధ్యమయ్యే పొత్తు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపదని బిజెపి నాయకుడు అమీత్ సతమ్ కొట్టిపారేశారు. ముంబయిలో ఎంవిఎ గందరగోళంలో ఉంది. నగరంలో ఒంటరిగా పోటీ చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. మరో పార్టీ అయిన ఎన్‌సిపి(ఎస్‌పి) ముంబయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. స్థానిక సంస్థల్లో మహాయుతి తన ఆధిపత్యాన్ని విస్తరించడంతో, ప్రతిపక్ష పార్టీలు తమ వ్యూహాన్ని, కూటమిలో నాయకత్వ పాత్రలను తిరిగి అంచనా వేయాలని ఒత్తిడి పెరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో విదర్భలోని కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా చంద్రపూర్, మరాఠ్వాడా ప్రాంతాలలో సాధించిన పరిమిత విజయాల కీర్తిలో కాంగ్రెస్ కష్టాల్లో పడినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ చిహ్నంపై 41 మునిసిపల్ కౌన్సిల్ అధ్యక్ష పదవులు, 1,000కి పైగా కౌన్సిలర్ స్థానాలను గెలుచుకున్నట్లు పార్టీ పేర్కొంది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ పార్టీ స్థితిస్థాపకత తను ప్రదర్శించిందని, కాంగ్రెస్ ఇప్పుడు అట్టడుగు స్థాయిలో కీలక ప్రతిపక్ష శక్తిగా ఎదుగుతోందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ అన్నారు. కాంగ్రెస్ తన ప్రాంతీయ భాగస్వాముల కంటే మెరుగ్గా తన స్థానాన్ని నిలుపుకుందని ఫలితాలు చూపిస్తున్నాయని, తాము ఇప్పుడు బిజెపికి ప్రధాన సవాలుదారులం అని పేరు చెప్పకూడదని అభ్యర్థిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ అధికారి ఒకరు అన్నారు.అయితే, విశ్లేషకులు కాంగ్రెస్ మూడు నిర్మాణాత్మక సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఎత్తి చూపారు: అనేక ప్రాంతాలలో బలమైన స్థానిక నాయకత్వ పైప్‌లైన్ లేకపోవడం, క్షేత్ర స్థాయిలో కూటమి భాగస్వాములతో బలహీనమైన సమన్వయం, ప్రత్యేకమైన రాజకీయ కథనాన్ని వ్యక్తపరచడంలో ఇబ్బంది. స్థానిక ఎన్నికల విశ్లేషణ ప్రకారం సాంప్రదాయకంగా శివసేనకు కంచుకోట అయిన రత్నగిరిలో బిజెపి ఆశ్చర్యకరమైన విజయాలు సాధించిందని తెలుస్తుంది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన సింధుదుర్గ్‌ను పట్టుకుంది, సేన (యుబిటి) ప్రభావాన్ని దాని స్వంత వెనుక ప్రాంగణంలో పరిమితం చేసింది.

## ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు

- ప్రజలు ఆమెను అగ్రస్థానంలో చూడాలనుకుంటున్నారు : రాబర్ట్ వాద్రా




**న్యూఢిల్లీ:** తన భార్య ప్రియాంక గాంధీ వాద్రాకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని, భవిష్యత్తులో ప్రజలు ఆమెను అగ్రస్థానంలో చూడాలనుకునే సమయం వస్తుందని వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మంగళవారం అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు హింసను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ ప్రియాంక గాంధీ ఇందిరా గాంధీలాగే బలమైన ప్రధానిగా నిరూపించుకుంటారని చెప్పిన వార్తలపై ఆయన స్పందించారు. మసూద్ మాట్లాడుతూ ప్రియాంక గాంధీ మంచి ప్రధాని అవుతారని, గతంలో ఇందిరా గాంధీ వ్యవహరించిన విధంగానే ఆమె కూడా వ్యవహరిస్తారని అన్నారు. మసూద్ సూచనపై వ్యాఖ్యానించమని కోరగా, రాబర్ట్ వాద్రా పిటిఐతో మాట్లాడుతూ, 'ప్రియాంక (గాంధీ) కూడా తన అమ్మమ్మ (ఇందిరా గాంధీ), తన తండ్రి (రాజీవ్ గాంధీ), సోనియా జీ, తన సోదరుడు (రాహుల్ గాంధీ) నుండి చాలా నేర్చుకున్నారని నేను భావిస్తున్నాను. ప్రజలు ఆమెను ఆరాధిస్తారు. ఆమెలో ఆ లక్షణాలు ఉన్నాయని ప్రజలు చూస్తున్నారు... ఆమె మాట్లాడినప్పుడు, హృదయపూర్వకంగా మాట్లాడుతుంది. నిజంగా వినాల్సిన విషయాలపై ఆమె మాట్లాడుతుంది, వాటిపై చర్చిస్తుంది' అని అన్నారు. 'రాజకీయాల్లో ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురావడంలో కూడా ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నేను భావిస్తున్నాను. అది కేవలం ఆమె ఆలోచనలతో మాత్రమే కాదు, అందరి సమ్మతిని దృష్టిలో ఉంచుకుని అలా మాట్లాడుతున్నాను. ప్రజలకు అవసరమైన మార్పులు తీసుకురావడానికి వారి ఆలోచనలు కూడా ఉన్నాయి. ఇది కాలక్రమేణా జరుగుతుందని నేను భావిస్తున్నాను, ఇది అనివార్యం' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ వరుస ఎన్నికల ఓటముల తర్వాత, ప్రియాంక గాంధీకి పెద్ద పాత్ర ఇవ్వాలని పార్టీలోని ఒక వర్గం నుండి తరచుగా డిమాండ్లు వస్తున్నాయి.

## మూకదాడి కేసులో ఇద్దరు అరెస్టు



**పాలక్కాడ:** కేరళలో మూకదాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పాలక్కాడ వలయార్ సమీపంలోని కిళక్కేటప్పల్లం వద్ద ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యక్తిని కొట్టి చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మూకదాడి కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అరెస్టు చేసిన వారిని అట్టప్పల్లంకు చెందిన వినోద్, జగదీష్‌గా గుర్తించారు. ఈ నెల 17న రామనారాయణ్ (31)ను దొంగగా అనుమానించి దాడి చేసిన గుంపులో వీరు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇంతకుముందు, ఈ కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. పోలీసుల ప్రకారం... ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ ఘటనలో పాల్గొన్న మరో ఎనిమిది మందిని గుర్తించింది. వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 103(1) (హత్య) కింద నమోదు చేయబడిన ఈ కేసులో అదనపు సెక్షన్లు కూడా నమోదు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. మృతుడి సామాజిక హోదాకు సంబంధించి బాధితుడి కుటుంబం నుండి మరిన్ని వివరాలు అందిన తర్వాత ఎస్‌సి/ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టంలోని నిబంధనలను కూడా జతపరుస్తామని వారు చెప్పారు. ఇదిలా ఉండగా, మంగళవారం రామనారాయణ్ మృతదేహాన్ని కొచ్చి నుండి రాయపూర్‌కు విమానంలో తరలించారని, విమానాశ్రయం నుండి అతని స్వగ్రామానికి తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి కుటుంబానికి త్వరలో పరిహారం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. కూలీ అయిన రామనారాయణ్ ఇటీవల వలయార్ ప్రాంతానికి వచ్చాడు. దొంగతనం చేశాడనే అనుమానంతో ఒక గుంపు అతన్ని పట్టుకుని దారుణంగా కొట్టింది. అతన్ని పాలక్కాడ జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు. గతంలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియోలో, ఓ వ్యక్తి రామనారాయణ్‌ను బంగ్లాదేశ్‌కు చెందినవాడివా అని అడగడం వినిపించింది. దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ వ్యాపింపజేస్తున్న మత విద్వేషానికి రామనారాయణ్ బాధితుడయ్యాడని విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి మంగళవారం అన్నారు. రామనారాయణ్‌ను కొట్టిన వ్యక్తులు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలని సిపిఐ(ఎం) ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం బాధితురాలి కుటుంబానికి అండగా నిలుస్తుందని, నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని శివన్‌కుట్టి అన్నారు. బాధ్యులైన వారు ఏ రాజకీయ అనుబంధాలు కలిగి ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం వారికి గరిష్ట శిక్ష పడేలా చూడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## కర్బీ ఆంగ్లాంగ్‌లో హింస

- రెండు వర్గాల మధ్య ఘర్షణలు

పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయు గోళాల ప్రయోగం



**డిప్పు/గువాహటి:** అస్సోంలో ఇప్పటికే అల్లర్లతో అట్టుడుకుతున్న కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో మంగళవారం తాజా హింస చెలరేగింది. నిరసనకారుల రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను ప్రయోగించారని అధికారులు తెలిపారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పటికీ, సోమవారం ఒక గుంపు దుకాణాలను తగలబెట్టిన మహిళలు, పిల్లలతో సహా పెద్ద సంఖ్యలో ప్రజలు హింసకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడానికి బయటకు వచ్చారు. అదే సమయంలో, గిరిజన ప్రాంతం నుండి ఆక్రమణదారులను తొలగించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులు కూడా ఖెరోని మార్కెట్ ప్రాంతంలో గుమిగూడారు. రెండు వర్గాలు కూడా ఆగ్రహంతో ఉన్నాయని, ఆ ప్రాంతంలో మోహరించిన భద్రతా బలగాలు వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించాయని, అయితే అకస్మాత్తుగా ఇరువైపుల నుండి రాళ్ల దాడి ప్రారంభమైందని, ఈ ఘటనలో పలువురు నిరసనకారులు, పోలీసు సిబ్బంది, సంఘటనను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులు గాయపడ్డారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతో, పోలీసులు లాఠీచార్జ్ చేసి, ఆ తర్వాత నిరసనకారుల రెండు వర్గాలను చెదరగొట్టడానికి బాష్పవాయు గోళాలను ప్రయోగించారని ఆయన చెప్పారు. ఆ ప్రాంతంలో పరిస్థితి 'ఉద్రిక్తంగా' ఉందని, అదనపు బలగాలను ఘటనా స్థలానికి పంపినట్లు తెలిపారు. నిరసనకారులు అంతకుముందు ఖెరోని ప్రాంతంలో రెండు మోటార్ సైకిళ్లను తగలబెట్టారు. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ కర్బీ ఆంగ్లాంగ్‌లో పరిస్థితి చాలా సమస్యాత్మకంగా ఉంది అని అన్నారు. 'సీనియర్ మంత్రి రనోజ్ పెగు జిల్లాలో ఉన్నారు. ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని నమ్ముతున్నాను' అని శర్మ ఒక కార్యక్రమం సందర్భంగా అన్నారు. అంతకుముందు, పెగుతో చర్చల అనంతరం గిరిజన ప్రాంతాల నుండి ఆక్రమణదారులను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు చేపట్టిన నిరాహార దీక్షను విరమించుకున్నారు. వివిధ రాజకీయ, సామాజిక సంస్థలకు చెందిన ఆందోళనకారులు అక్రమ నివాసితులను తొలగించాలని డిమాండ్ చేస్తూ గత 12 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. పెగు నిరసనకారులతో చర్చలు జరిపారు. ఈ సమస్యపై త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ప్రభుత్వం నుండి హామీ లభించడంతో వారు తమ నిరాహార దీక్షను విరమించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారని పెగు చెప్పారు. సోమవారం, కర్బీ ఆంగ్లాంగ్ అటానమస్ కౌన్సిల్ (కెఎఎసి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తులిరామ్ రోంగ్‌హాంగ్ నివాసానికి, ఖెరోని బజార్‌లోని సుమారు 15 దుకాణాలకు నిప్పుపెట్టి విధ్వంసం సృష్టించిన నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు గాయపడ్డారు. సోమవారం నాడు నిరసనకారులు ఖెరోనిలోని పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడానికి కూడా ప్రయత్నించారు, కానీ భద్రతా బలగాలు దానిని అడ్డుకున్నాయి. కర్బీ ఆంగ్లాంగ్, పొరుగున ఉన్న పశ్చిమ కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాల్లో నిషేధాజ్ఞలు విధించారు.

## బిఎంసి ఎన్నికల్లో పొత్తులకు పార్టీల కసరత్తు

శివసేన (యుబిటి), ఎంఎన్ఎస్‌తో ఎన్‌సిపి (ఎస్‌పి) చర్చలు

**ముంబయి:** బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి)కి జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. పొత్తులపై పలు పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి), రాజ్ థాక్రే నేతృత్వంలోని ఎంఎన్ఎస్‌తో తమ పార్టీ పొత్తు కోసం చర్చలు జరుపుతోందని మహారాష్ట్ర నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు శశికాంత్ షిండే తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార మహాకూటమిలో ప్రధాన భాగస్వామి అయిన బిజెపికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయడానికి, ఆ పార్టీని వ్యతిరేకించే అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి చర్చలు జరుగుతున్నాయని షిండే అన్నారు. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని అధికార ఎన్‌సిపి పుణె పురపాలక సంఘం ఎన్నికల కోసం తమ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అని అడిగిన ప్రశ్నకు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఎన్‌సిపి (ఎస్‌పి) తన స్థానిక యూనిట్లకు ఇచ్చిందని మాజీ రాష్ట్ర మంత్రి బదులిచ్చారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్ (పిఎంసి) ఎన్నికల కోసం ఎన్‌సిపి (ఎస్‌పి) ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్న కూటమిలో కాంగ్రెస్ భాగమవుతుందా అనే ప్రశ్నకు, ఆ పార్టీ ఇప్పటికే ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో భాగమని షిండే గుర్తు చేశారు. ఎంవిఎలో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) ఉన్నాయి. రాజ్ థాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ఎంవిఎలో భాగం కాదు, కానీ రానున్న పౌర ఎన్నికల కోసం పొత్తు పెట్టుకోవడానికి శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) దానిని తమ వైపుకు ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాయి. ముంబయి, పుణె, థానే, నాగ్‌పూర్, నాసిక్‌తో సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 15న ఎన్నికలు జరగనున్నాయి.

## ప్రజల కేంద్రీకృత భద్రతకు...
# 'జన్ భాగీదారి' ఒక మూలస్తంభం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** సమాజ భాగస్వామ్యం జాతీయ భద్రతను బలోపేతం చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. ప్రజలు తమ చుట్టూ జరిగే వాటిని నిష్క్రియాత్మకంగా గమనించాల్సిన అవసరం లేదని, ప్రజా కేంద్రీకృత భద్రతకు మూల స్తంభంగా 'జన్ భాగీదారి'ని అభివర్ణించారు. మంగళవారం ఇక్కడ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) నిర్వహించిన ఒక కార్యక్రమంలో ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ సోషల్ మీడియా సమాచారం కమ్యునికేషన్ ప్రపంచాన్ని మార్చివేసిందన్నారు. ఇది సృష్టి విధ్వంసం రెండింటి సామర్థ్యాన్ని కలిగి ఉందని ముర్ము అన్నారు.తప్పుడు సమాచారంతో ప్రజలను రక్షించడం చాలా సవాల్‌తో కూడుకున్న పని అని ఆమె చెప్పారు. ఈ పనిని నిరంతరం చాలా ప్రభావవంతంగా నిర్వహించాలన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం వాస్తవ ఆధారిత కథనాలను స్థిరంగా ప్రదర్శించే చురుకైన సోషల్ మీడియా వినియోగదారుల సమాజాన్ని సృష్టించడం అవసరమని ముర్ము సూచించారు. భద్రతా సమాజాలను సృష్టించడంలో తమ ఇన్‌పుట్‌లతో ప్రొఫెషనల్ దళాలకు సహాయం చేసే అప్రమత్తమైన పౌరులకు అనేక ఉదాహరణలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వ కాలం నుండి మారుతున్న వారసత్వ భారం కారణంగా కొంత మంది సహాయం కోసం నమ్మదగిన స్నేహపూర్వక వ్యక్తులుగా పనిచేస్తున్నారని రాష్ట్రపతి ముర్ము వివరించారు. సివిల్




పోలీసులు, అంతర్గత భద్రతా సంస్థలు ప్రజలకు సేవచేసే స్ఫూర్తితో పనిచేయాలని ఆమె చెప్పారు. 'ప్రజలు కేంద్రీకృత జాతీయ భద్రత'వీక్షిత్ భారత్ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై ఇంటెలిజెన్స్ బ్యూరో శతాబ్ది ఎండోమెంట్ ఉపన్యాసంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా మాదకద్రవ్యాల ముప్పుకు వ్యతిరేకంగా దేశం సమర్థవంతమైన శిబిరాన్ని ప్రారంభించిందని, తీవ్రవాదాన్ని నిర్మూలించే ప్రయత్నాలు జరగాలని సూచించారు. జాతీయ వినియోగదారులకు అత్యంత క్లిష్టమైన సవాళ్లు సంప్రదాయేతర, డిజిటల్ స్వభావం అని ముర్ము చెప్పారు. పెరుగుతున్న డిజిటల్ మోసం సమస్యకు గృహ, సంస్థాగత, సమాజ స్థాయిలలో అప్రమత్తత అవసరం అని ద్రౌపది ముర్ము తెలియజేశారు. సరిహద్దు ప్రాంతాలలో ఉద్రిక్తతలు, ఉగ్రవాదం, తిరుగుబాటు, మతపరమైన తీవ్రవాదం భద్రతాపరమైన ఆందోళనలకు దారితీస్తున్నాయని రాష్ట్రపతి వివరించారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల దేశ అంతర్గత భద్రత పరిస్థితి కూడా ప్రభావితం అవుతుందని తెలిపారు. ప్రపంచం భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక స్థితిగతులు, వాణిజ్య అంతరాయాలని చూస్తోందని, ఈదృగ్విషయాలకు అంతర్లీనంగా లేదా అంతర్గతంగా కూడా సంబంధం ఉందని రాష్ట్రపతి వివరించారు. 2026 మార్చి 31నాటికి వామపక్ష ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే దృఢ సంకల్పానికి భద్రతా సంస్థలను ముర్ము అభినందించారు. గతంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతర్గత భద్రతా సవాల్‌గా అంగీకరించారు. వామపక్ష తీవ్రవాదం ఇప్పుడు పూర్తిగా నిర్మూలనకు దగ్గరగా ఉందన్నారు. 2014లో 126 జిల్లాలు మావోయిస్టు ప్రభావితమైన జిల్లాలుగా వివరించారు. కాగా ఇప్పుడు 11జిల్లాలు మాత్రమే మావోయిస్టు ప్రభావిత జిల్లాలు అని పేర్కొన్నారు. నేటికి కేవలం మూడు జిల్లాలు మాత్రమే అత్యంత ప్రభావితమైన జిల్లాలుగా కొనసాగుతున్నాయని రాష్ట్రపతి వివరించారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా మనందరం అప్రమత్తమైన, శాంతియుతమైన, సురక్షితమైన, సంపన్నమైన భారత దేశాన్ని నిర్మించేదిశగా వేగంగా ముందుకు సాగుతామని తాను విశ్వసిస్తున్నానని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, కేంద్ర హోం సెక్రటరీ గోవింద్ మోహన్, ఐబి చీఫ్ తపన్ కుమార్ డేకా తదితరులు పాల్గొన్నారు.


### బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు అయిన **కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్, తండ్రి: కొర్ర శివ,** నివాసం: ఇంటి నెం.13-6-150, రైల్వే కాలని, కైకొండాయి గూడెం, ఖమ్మం జిల్లా. ఖమ్మం జిల్లా, ఖానాపురం హవేలి, ప్రశాంతి నగర్ నివాసి అయిన గుడవర్తి రాణి W/O గుడవర్తి నాగేశ్వరావు, సదరు రాణి భర్త గారి అయిన గుడవర్తి నాగేశ్వరావు గారు గతించి యున్నారు. నా క్లయింట్ అయిన కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్, గుడవర్తి నాగేశ్వరరావు గారి వారసులు అయిన భార్య రాణి, కూతురు వల్లభనేని లావణ్య W/O ప్రసాద్ రావు, కుమారుడు గుడవర్తి మన్మోహన్‌తో **యకరం// 1.28 కుంటలు** 17-10-2025 ఎగ్రిమెంట్ ద్వారా క్రయం పొంది యున్నారు. నా క్లయింట్ అయిన కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్ అట్టి వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు సిద్ధంగా ఉన్నారు. కావున ఎవరికైన ఏవిధమైన అభ్యంతరంలు, ఆక్షేపణలు ఉన్నచో ఈ రోజు నుండి 7 రోజులలో సంబంధిత డాక్యుమెంట్లతో రాత పూర్వకముగా గాని, న్యాయవాది ద్వారా గాని తెలియజేయగలరని మనవి. లేనిచో ఎవరికీ ఏ విధమైన అభ్యంతరంలు లేవని తలచి క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్తిని సంబంధిత రిజిస్ట్రేషన్ వారి కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోబడును. తదుపరి వచ్చిన అభ్యంతరంలు పరిగణించబడవు.

**షెడ్యూల్ ఆస్తి :** ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, కొండాయి గూడేం గ్రామ రెవిన్యూలో గల సర్వే నెంబర్ 41/1 (ఓల్ సర్వే నెం.41)లో గల వ్యవసాయ భూమి **యకరం //1.28 కుంటలు** మెట్ట భూమికి

**సరి హద్దులు:**

**తూర్పు** : ఖమ్మం To ఇల్లందు R&B రోడ్డు
**పడమర** : గుడవర్తి సీతయ్య గారి భూమి
**ఉత్తరం** : గుడవర్తి వెంకటేశ్వర్లు గారి భూమి
**దక్షిణం** : గుడవర్తి సీతారామయ్య గారి భూమి

సం/-
షేక్. లతీఫ్,
న్యాయవాది, ఖమ్మం.
సెల్: 9848334165

ప్రజాపక్షం
బుధవారం, 24 డిసెంబరు

# మహారాష్ట్రలో స్థానిక సమరం

''కలిసి ఉంటే కలదు సుఖం – విడిపోతే కలదు దుఃఖం'' అనే నానుడి మహారాష్ట్రలో ఇండి కూటమి రూపమైన 'మహా వికాస్ అఘాది(ఎంవిఎ)కి అక్షరాలా వర్తిస్తుంది. 2024 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, శివసేన(షిండె), ఎన్‌సిపి(అజిత్‌పవార్)లతో కూడిన 'మహాయుతి' కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ప్రతిపక్ష ఎంవిఎ భాగస్వాముల్లో (కాంగ్రెస్, శివసేన–యుబిటి, ఎన్‌సిపి(శరద్‌పవార్) ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. అది తాజాగా జరిగిన స్థానిక సంస్థల (మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్) ఎన్నికల్లో స్పష్టమైంది. ఎంవిఎ పట్టుదలతో, ఐక్యంగా రాజకీయ పోరాటం చేసి ఉంటే ఫలితాలు ప్రస్తుత దారుణ స్థితికన్నా మెరుగ్గా ఉండేవి. మహారాష్ట్ర నగర పంచాయత్, నగర పరిషద్‌లలోని మొత్తం 286 సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఎంవిఎకి దక్కినవి 44 మాత్రమే. వాటిలో కాంగ్రెస్ 28, ఎన్‌సిపి(ఎస్‌పి)7, శివసేన(యుబిటి)9. ఇంతపెద్ద పరాజయానికి ఆత్మావలోకనం సరైన ఔషధం – పాలకపక్షంపై, ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు నిష్ఫలం. పాలక మహాయుతి 207 సీట్లు గెలుపొందింది – బిజెపి 117, శివసేన(షిండె)53, ఎన్‌సిపి (అజిత్)37. బిజెపి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ దాని మిత్రపక్షాలు కూడా చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించాయి. భాగస్వామ్యపక్షాలు బాహాట కొట్లాటలు లేకుండా కలిసికట్టుగా పనిచేయటంవల్లనే ఇది సాధ్యమైంది. అయితే పాలక కూటమి ఫలితాలు తన వల్లనే సాధ్యమైనట్లుగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావీస్ ప్రకటనలో అహంభావం వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లోగాని, ఈ ఎన్నికల్లోగాని షిండె, అజిత్ పవార్ పార్టీలు దృఢంగా అండగా నిలబడటంవల్లనే బిజెపి మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. అది మరిచిపోయి ఒంటెత్తు పోకడపోతే ఎదురుదెబ్బలు తప్పవు. అదే సమయంలో, ప్రతిపక్ష ఎంవిఎ తమ దిశను సక్రమంగా, కచ్చితంగా నిర్ణయించుకోకపోతే బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ యంత్రాంగాన్ని తట్టుకోవటం కష్టం. ఓటింగ్ యంత్రాల తారుమారు, విచ్చలవిడిగా ధనం వెచ్చించటం వల్ల మహాయుతికి ఈ ఫలితాలు దక్కాయని శివసేన(యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికల్లో పాలకపార్టీకి ఎప్పుడూ అడ్వాంటేజ్ ఉంటుంది. అధికార దుర్వినియోగం, ధనం వెచ్చించటం షరామామూలే. వాటన్నిటినీ తట్టుకుని గౌరవప్రదమైన ఫలితాలు సాధించగలిగితేనే ప్రతిపక్షం పరువు నిలుపుకోగలుగుతుంది.

రెండోదశగా బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. దీనితోపాటు 39 మున్సిపల్ కార్పొరేషన్‌లకు, 32 జడ్‌పిలకు, 336 పంచాయతీలకు జనవరి15న పోలింగ్ జరుగుతుంది. ప్రతిష్ఠాత్మక బిఎంసి కార్పొరేషన్‌పై ఏ జండా ఎగురుతుందో? బిజెపికి మిత్రపక్షాలనుంచి సీట్ల ఒత్తిడి తప్పదు. కాగా శివసేన సహోదరులు ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రే కలసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. సోదరులు చీలిపోయాక నగరం లో, మరికొన్ని నగరాల్లో బలహీనపడిన శివసేనకు ఈ ఐక్యత (ఎస్‌ఎస్–యుబిటి + ఎంఎన్‌ఎస్) తిరిగి జీవం పోస్తుందని వారు భావిస్తున్నారు. ఎంఎన్‌ఎస్ అరాచక చరిత్ర దృష్ట్యా ఈ పొత్తు మైనస్ కానూవచ్చు. బిఎంసిలో ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మిగతా చోట్ల స్థానిక నాయకులు నిర్ణయాలు తీసుకుంటారని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టీవార్ చెప్పారు. కాగా ముంబయి, థానె, మీరా–భయందర్, కల్యాణ్–దొంబివ్‌లి, పూనె, నాసిక్ కార్పొరేషన్స్‌లో ఉద్ధావ్–రాజ్ థాక్రే పార్టీలు కలిసి పోటీ చేస్తాయని, మిగతా చోట్ల స్థానిక నాయకులు నిర్ణయాలు తీసుకుంటారని సంజయ్ రౌత్ చెప్పారు. ఇదిలావుండగా, పూనె, పింప్రి – చించివాడ్ కార్పొరేషన్స్‌లో పవార్ సోదరులు (ఎన్‌సిపి, ఎన్‌సిపి(శరద్ పవార్) కలిసి పోటీ చేస్తున్నారు. ఆ రెండు చోట్ల మహాయుతి భాగస్వాముల మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందని ముఖ్యమంత్రి ఫడ్నావీస్ ధృవీకరించారు. అంటే ప్రభుత్వ, ప్రతిపక్ష కూటముల్లో అనైక్యత స్పష్టంగా కనిపిస్తున్నది. ఏమైనా, ప్రతిపక్ష కూటమి ఊగిసలాటలు విడనాడి స్పష్టమైన రాజకీయ వైఖరితో ఐక్యంగా పోరాటం చేయగలిగితేనే భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుంది.

# ప్రపంచంలోనే అతి పెద్ద వ్యవస్థను నిర్మించుకున్న ఆర్‌ఎస్‌ఎస్

* రిజిస్టర్ లేనప్పటికీ 2,500లకు పైగా అనుబంధ సంస్థలు
* వాటి ద్వారానే నిధుల సమీకరణ, కార్యక్రమాల విస్తరణ
* బైటపెట్టిన 'ది కారావాన్' మ్యాగజైన్
* 'సీయింగ్ ది సంఘ్' పేరుతో పరిశోధనాత్మక కథనం


**సి.ఆదికేశవన్**

'ది కారవాన్' మ్యాగజైన్ భారత జర్నలిజం చరిత్రలో తీవ్ర పరిణామాలు చూపించే పరిశోధన ప్రాజెక్టులలో ఒకదాన్ని డిసెంబర్ మాస పత్రికలో విడుదల చేసింది. 'సీయింగ్ ది సంఘ్' శీర్షికతో ప్రచురితమైన కథనంలో ఆరు సంవత్సరాలు పరిశోధన పటాలతో తొలిసారిగా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పూర్తి సంస్థాగత నిర్మాణాన్ని వివరించింది. పరిశోధకులు ఫెలిక్స్ పాల్, క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ నేతృత్వంలో, సైన్సెస్ పోస్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో అందుబాటులో ఉన్న డేటాతో, ఈ ప్రాజెక్ట్ ఆర్‌ఎస్‌ఎస్‌తో బలమైన, సంబంధాలను కలిగి ఉన్న 2,500 కంటే ఎక్కువ సంస్థలను గుర్తించింది. ఇవి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ అధికారికంగా అంగీకరించిన మూడు డజన్ల అనుబంధ సంస్థల కంటే చాలా ఎక్కువ. ఈ పరిశోధన ఫలితాలు స్వయంప్రతిపత్తి సంస్థలకు మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్ 'స్ఫూర్తినిస్తుందనే' దీర్ఘకాలిక వాదనను నిర్ణయాత్మకంగా సవాలు చేస్తాయి. తద్భిన్నంగా, ఈ అతిపెద్ద పచ్చి మితవాద సంస్థ నిర్మాణ వ్యవస్థ పరిధిని అది డాక్యుమెంట్ చేసింది. కేంద్రం నుంచి సమన్వయంతో, బ్యూరోక్రటిక్ నెట్‌వర్క్ కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

సంఘ్ అనుబంధ సంస్థలు 'స్వతంత్ర, స్వయంప్రతిపత్తి, స్వీయఆధారితమైనవి' అని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పదేపదే నొక్కి చెబుతుంటారు. జనబాహుళ్యంలోని ఆర్‌ఎస్‌ఎస్ సాహిత్యం ఈ ప్రతిష్టను జాగ్రత్తగా పెంపొందిస్తుంది. ఒకవైపు దాని అనుబంధ సంస్థల ఉమ్మడి శక్తి నుండి ప్రయోజనం పొందుతూనే, మరోవైపు వాటిని తిరస్కరిస్తున్నట్లుగా ఆ సంస్థ వ్యవహరిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్‌ఎస్‌ఎస్ ను 'ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జిఒ'గా అభివర్ణించడం ఈ సందిగ్ధతను పెంచుతోంది. ఒకవైపు దాని విస్తృతిపై ఉత్సవాలు జరుపుకుంటూనే, మరోవైపు దాని నిర్మాణాన్ని కనపడకుండా ఉంచుతుంది. సంఘ్ స్వంత అంతర్గత ప్రచురణల నుంచి విస్తృత వివరాలు ద్వారా 'సీయింగ్ ది సంఘ్' కథనం ఈ పొగమంచును తుత్తునీయలు చేసింది. ఆ ప్రచురణలలో ఆర్‌ఎస్‌ఎస్ తరచుగా అనుబంధ సంస్థలను 'ఆర్గాన్స్', 'ప్రొజెనీ', లేదా 'ఫ్రంట్స్'గా వర్ణిస్తుంది. అధికారం బలవంత పెట్టడం ద్వారా కాకుం డా సంస్థాగత మార్గాల ద్వారా ప్రవహిస్తుంది. ఉమ్మడి సిబ్బం ది, ఉమ్మడి చిరునామాలు, సమన్వయ కార్యక్రమాలు, ఆర్థిక పైపులైన్‌లు(ప్రవాహ మార్గాలు), ప్రచారకులు అని పిలువబడే పూర్తికాల క్రమశిక్షణయుతమైన కార్యకర్తల ద్వారా ఇదీ సాగుతుంటుంది.

పరిశోధన ద్వారా రూపొందించిన సమాచారంలో(డాటాసెట్) ఉన్న సైద్ధాంతిక సారూప్య సంస్థలు ఏమాత్రం బలహీనంగా ఉన్నవి కాదు. ఇది నాయకత్వం, మౌలిక సదుపాయాలు, వనరులలో సంస్థలు ఎలా పరస్పరం పెనవేసుకుంటాయో గుర్తించే భౌతిక పటం. పరిశోధకులు కఠినమైన, బరువైన పద్ధతిని అభివృద్ధి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వివిధ స్థాయిలో పట్టును గుర్తించడానికి సంఘ్ మూలాల్లోకి వెళ్ళి ఉమ్మడి ఆఫీస్ బేరర్లు, ఉమ్మడి ప్రాంగణాలు, ఆర్థిక ప్రవాహాలు, సంస్థాగత పేర్లు, బహిరంగ గుర్తింపును పరిశోధించడం జరిగింది. ఫలితంగా ఆర్‌ఎస్‌ఎస్ ఒక విస్తృత సైద్ధాంతిక ఉద్యమంగా కాకుండా విస్తృత కేంద్రంగా, విస్తారమైన హద్దులతో కూడిన ఒకే రాజకీయ జీవిగా కనిపిస్తుంది. దాని కేంద్రంలో బిజెపి, విహెచ్‌పి, ఎబివిపి, విద్యాభారతి, సేవాభారతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వంటి ఉన్నత స్థాయి సంస్థలు ఉన్నాయి. వీటి చుట్టూ వందలాది సమన్వయ ట్రస్టులు, సేవా సంస్థలు, శిక్షణా సంస్థలు, థింక్ ట్యాంకులు, ప్రచార బృందాలు, విదేశీ నిధుల సేకరణ సంస్థలు ఉన్నాయి.

వాటిలో ఒకటి జమ్మూలో బయటపడిన వేదమందిర్ కాంప్లెక్స్ అత్యంత అద్భుతమైన ఉదాహరణ. ఇది నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఒకే ఆస్తి. ఇరవైకి పైగా సంఘ్ సంబంధిత సంస్థలకు నిలయంగా ఉంది. ఇది జమ్మూ కశ్మీర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ఉనికిలో దాదాపు సగం. పాఠశాలలు, అనాథాశ్రమాలు, హాస్టళ్లు, వైద్య మిషన్లు, సంక్షేమ



ట్రస్టులు, విద్యా సంస్థలు అన్నీ ఒకే చిరునామా నుండి పనిచేస్తాయి. దీనిని పరస్పరం ముడిపడి ఉన్న పాత్రలలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో కూడిన చిన్న సముదాయం నిర్వహిస్తుంది. స్వతంత్ర ఎన్‌జిఒలు కాకుండా, ఈ సంస్థలు ప్రాంతీయ కేంద్రంగా పెనవేసుకొని పనిచేసే క్లస్టర్‌లు నిర్వహిస్తాయి. దీనిని సంఘ్ ప్రచురణలలో కేశవ్ భవన్ అని వర్ణించారు. ఈ పేరు సాధారణంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకించబడింది. భగవత్‌తో సహా సీనియర్ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అనుబంధ అధిపతులతో రహస్య సమావేశాల కోసం ఇక్కడకు క్రమం తప్పకుండా వస్తుంటారు.

పరిశోధన ఒక విలక్షణమైన విస్తరణ వ్యూహాన్ని గుర్తించింది. దీనిని పరిశోధకులు సంస్థాగత వ్యాప్తిగా అభివర్ణిస్తారు. ఇప్పటికే ఉన్న పౌర సమాజ సమూహాలతో కూటములను నిర్మించడానికి బదులుగా, ఆర్‌ఎస్‌ఎస్ క్రమపద్ధతిలో కొత్త సంస్థలను సృష్టిస్తుంది. అనుబంధ సంస్థలను సృష్టించడానికి వాటిని ప్రోత్సహిస్తుంది. వాటిని క్రమానుగత నెట్‌వర్క్‌లో భాగం చేసి, వాటిపై ప్రచారక్‌ల పర్యవేక్షణ సాగుతుంది. ఈ ప్రక్రియ కేంద్ర నియంత్రణను కాపాడుతూనే దాదాపు అపరిమిత విస్తరణను అనుమతిస్తుంది. ఉదాహరణకు, విద్యాభారతి దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలను నిర్వహిస్తోంది. కానీ వివిధ పేర్లతో పనిచేస్తున్న రాష్ట్ర స్థాయి ట్రస్టుల ద్వారా అవి నడుస్తుంటాయి. సేవాభారతి ఇదే విధానాన్ని అనుసరిస్తుంది. రాష్ట్రాలలో డజన్ల కొద్దీ విభిన్న స్వచ్ఛంద సంస్థలుగా కనిపిస్తుంది. అయినప్పటికీ అంతర్గత ప్రచురణలు ఈ వ్యత్యాసాలను అసంబద్ధంగా భావిస్తాయి.

సంఘ్ పరిధి భారతదేశానికే పరిమితం కాలేదు. ఈ పరిశోధన సమాచారం(డేటాసెట్)లో విదేశాలలో 300కి పైగా సంస్థలను మ్యాప్ చేసింది. వీటిలో ప్రధాన కేంద్రీకరణ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడాలపై ఉంది. హిందూ స్వయంసేవక్ సంఘ్, అమెరికా విహెచ్‌పి, సేవా ఇంటర్నేషనల్ వంటి విదేశీ సంస్థలు నిధుల సేకరణ, లాబీయింగ్, సైద్ధాంతిక ప్రసార కేంద్రాలుగా పనిచేస్తాయి. ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్‌లోని దయాస్పోరా(ప్రవాసుల) కుటుంబాలు..ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంతో లోతైన సంస్థాగత సంబంధాలను కొనసాగిస్తూ భారతదేశంలోని పాఠశాలలు, హాస్టళ్లు, సైద్ధాంతిక సంస్థలకు నిధులు సమకూర్చే కీలకమైన ఆర్థిక కేంద్రాలుగా ఉద్భవించాయి. విదేశీ రాజకీయ సంస్థలను కఠినంగా నియంత్రించే చైనా, రష్యా వంటి దేశాలలో సంఘ్ ఉనికి కనిపించదు.

ఈ వ్యవస్థ హృదయం వద్ద ఉద్దేశపూర్వక అస్పష్టత ఉంది. ఆడిట్ చేయబడిన ఖాతాలు లేదా బహిరంగ సభ్యత్వ జాబితాలు లేకుండా ఆర్‌ఎస్‌ఎస్ రిజిస్టర్ కాని సంస్థగా కొనసాగుతోంది. అధికారిక జవాబుదారీతనం లేకుండా అపారమైన ప్రభావాన్ని చూపడానికి వీలు కల్పిస్తుంది. ఈ నిర్మాణం ఆమోదయోగ్యమైన తిరస్కరణను అనుమతిస్తుంది. హింస లేదా చట్టవిరుద్ధ చర్యల్లో చిక్కుకున్న అనుబంధ సంస్థలను తిరస్కరించడానికి సంస్థ వారి చర్యల నుండి ప్రయోజనం పొందుతూనే అనుమతిస్తుంది. కులతత్వం లేదా మతతత్వ ఆరోపణలను పైకి కనిపించే సంస్థలు ఎదుర్కొంటాయి. రహస్య సంస్థలు మిలిటెన్సీ ఖర్చులను గ్రహిస్తాయి, సేవా సంస్థలు క్షేత్రస్థాయి చట్టబద్ధతను నిర్మిస్తాయి. థింక్ ట్యాంకులు ఉన్నత వర్గాల చర్చను రూపొందిస్తాయి. హిందుత్వ భావజాలం కథనానికి జిగురును అందిస్తుండగా, భావజాలం మాత్రమే ఉద్యమం పొందికను వివరించలేదని 'సీయింగ్ ది సంఘ్' కథనం నిరూపిస్తుంది. సంఘ్‌ను బంధించేది ఆకస్మిక విశ్వాసం కంటే అధికారిక క్రమశిక్షణ. ఆర్‌ఎస్‌ఎస్ స్వంత రచనలు సమాజానికి సంబంధించి దాని దృష్టిని వ్యక్తపరుస్తాయి. అందులో సంఘ్ సమాజంలో ఉనికిలో ఉండేందుకు కాకుండా సంఘే సమాజంగా మారడానికి ప్రయత్నిస్తుంది. హెడ్గేవార్ నుండి గోల్వాల్కర్ వరకు సమకాలీన నాయకుల వరకు, సందేశం స్థిరంగా ఉంటుంది. సంఘ్ సంస్థలు హిందూ రాజ్యలక్ష్యం దిశగా పనిచేసే ఒకే సంస్థకు చెందిన క్రియాత్మక భాగాలు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నెట్‌వర్క్‌లాగా మొత్తంగా అనుభవపూర్వకంగా కనుగొనడం ద్వారా 'సీయింగ్ ది సంఘ్' కథనం సమకాలీన భారతదేశంలో అధికారాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే ఆలోచనను ప్రాథమికంగా మారుస్తుంది. ఇది సహజ హిందూ పునరుజ్జీవనం కథనాన్ని కూల్చివేసి, దానిని ఉద్దేశపూర్వక, దీర్ఘకాలిక అధికారిక నిర్మాణం అందించే ఆధారాలతో భర్తీ చేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో ఈ పరిశోధన పారదర్శకత, జవాబుదారీతనం, బహుళత్వం గురించి అత్యవసర ప్రజాస్వామ్య ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఒక రిజిస్టర్ కాని సంస్థ రాజకీయాలు, విద్య, సంక్షేమం, దయాస్పోరా(ప్రవాసుల) సమీకరణపై ఇంత విస్తృత ప్రభావాన్ని ఎలా చూపగలదు? వేలాది మంది ప్రతినిధుల ద్వారా అధికారం విస్తరించబడినప్పుడు జవాబుదారీతనం ఎక్కడా లేనప్పుడు ఏ రక్షణలు ఉంటాయి? ప్రజాస్వామ్యం కంటికి కానిరాని దానితో సహజీవనం చేయలేదని, ప్రపంచంలోనే అతిపెద్ద పచ్చి మితవాద వ్యవస్థను, చివరకు అది దేనికోసం పనిచేస్తున్నదో చూడాలని ఈ ప్రాజెక్ట్ నొక్కి చెబుతుంది.

# 'జాగో గ్రహాక్ జాగో'

## వినియోగదారుల చట్టం అమలుకు పాలక ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలి

భారతదేశంలో వినియోగదారుల హక్కులను, బాధ్యతల విషయాన్ని అవగాహన కల్పించడం కోసం 1991లో అప్పటి ప్రభుత్వం 'జాగో గ్రహాక్ జాగో' అనే నినాదం ముందుకు తీసుకురావడం జరిగినది. ఆ నినాదం వలన వినియోగదారులను చైతన్యం చేయడంతో పాటు నేటి ఆధునిక సమాజంలో ప్రశ్నించే తత్వం పెరగాలని వారి యొక్క హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు మొదలుపెట్టారు.

నేడు మార్కెట్ చాలా త్వరగా మారుతున్నది. షాపింగ్ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. ప్రధానంగా ఆన్లైన్ ద్వారా కొనుగోలులు పెరిగినాయి. ఒకరోజు వినియోగదారుడు నేరుగా విక్రయదారుని వద్దకు వెళ్లి వస్తువులను కొనుగోలు చేసేవాడు కానీ నేడు విక్రయదారుడుని చూడకుండానే వినియోగదారుడు కొనుగోలులు చేస్తున్నాడు. మార్కెట్‌లో అనేక సంస్థలు తప్పుడు ప్రకటనల ద్వారా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు తద్వారా వినియోగదారుడు అత్యంత సులభంగా మోసాలకు గురవుతున్నాడు.

ఒకనాడు రాజుల కాలంలో కూడా మార్కెట్ మీద ఆ రాజు నియంతృత్వం ఉండేది. ఆ రోజుల్లో వినియోగదారుల హక్కుల విషయంలో ఎలాంటి చట్టాలు లేకపోయినా వారి నియంత్రణ ఉండేది. వినియోగదారుల రక్షణ చట్టం 1986 అమలులోకి రాకముందు మనదేశంలో వినియోగదారుని రక్షణ విషయంలో పెద్దగా ఎవరికీ అవగాహన లేకపోయినా 1960 తరువాత నుండి క్రమ క్రమేణా వినియోగదారుల హక్కుల విషయంలో కొంత చైతన్యం మొదలయ్యింది. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారి ప్రభుత్వం వినియోగదారుల చట్టం 1986 డిసెంబర్ 24వ తేదీన అమలులోకి తీసుకురావడం జరిగింది. ఆరోజును ప్రతి సంవత్సరం జాతీయ వినియోగదారుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశం దేశంలో మార్కెట్ వ్యవస్థ అత్యంత వేగం గా అభివృద్ధి చెందుతున్న సమయంలో వ్యాపారుల యొక్క మోసాలను నియంత్రించాలని, వినియోగదారులకు త్వరితగతిన సులువైన న్యాయం అందించడమే కాకుండా వారి హక్కులను కాపాడటం, జాతీయ స్థాయిలో వినియోగదారుల కమిషన్ ఏర్పాటు చేయడం. ఈ చట్టం వచ్చిన తర్వాత మూడు దశాబ్దాలుగా అనేక కేసులు పరిష్కరించబడ్డాయి. అయితే నేడు వ్యాపార విధానాలయందు అనేక మార్పులు రావడం, విచ్చలవిడిగా ఆన్లైన్ షాపింగ్ లు చేయడం, డిజిటల్ చెల్లింపులు ఈ కామర్స్ వంటి వాటి విషయంలో 1986 చట్టం యందు కొన్ని మార్పులు తీసుకురావాలని వినియోగదారుల చట్టం 2019ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించి అమల్లోకి తీసుకురావడం జరిగింది. కొత్త వినియోగదారుల చట్టం ద్వారా వినియోగదారుడు ఇంటర్నెట్ ద్వారా కూడా వారి ఫిర్యాదును చేయవ చ్చు.

వినియోగదారులను ఆకర్షించడం కోసం తప్పుడు ప్రకటనలను 1986 చట్టం పరిమితమైన నియంత్రణ ఉన్నప్పటికీ 2019 చట్టం ద్వారా మాత్రం ఖచ్చితమైన నియంత్రణ విషయమై స్పష్టత ఉన్నది. అంతేకాకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కరించుకునే అవకా శం కొత్త చట్టంలో పొందుపరిచి వేగవంతంగా పరిష్కరించడానికి అవకాశం కల్పించారు. అలాగే వస్తువుకు గాని సేవలకు గాని చెల్లించిన మొత్తం వినియోగదారుడు తిరిగి పొందే హక్కు 2019 చట్టం కల్పించడమే కాకుండా కొన్ని సందర్భాల యందు వస్తువులను ప్రత్యామ్నాయంగా పొందే హక్కు కూడా కల్పించడం జరిగింది. చట్టం ఎంత మంచిదైనప్పటికీ అమలు చేసే విధానం ద్వారా పాలకవర్గాలు,వ్యాపార వర్గాలు చట్టంలోని వెసులుబాటును ఆసరా చేసుకొని దుర్వినియోగపరచడము జరుగుతున్నది. అందుకని చట్టంలో పొందుపరిచిన హక్కులను తెలియపరచడము, లోపాలను ఎత్తి చూపినప్పుడు ఉన్నత న్యాయ వ్యవస్థ అవసరమని గుర్తించాలి. వినియోగదారుల వినియోగము రోజురోజుకు విస్తృతమగుచున్నది. వినియోగదారులను చైతన్య పరచడంకోసం విద్యార్థులకు హైస్కూల్ నుండే పాఠ్యాంశముగా పెట్టి భావితరాలకు వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉన్నది. బుద్ధి జీవులు, స్వచ్ఛంద సంస్థల చొరవతో పాటు ప్రభుత్వ యంత్రాంగము కూడా విధిగా బాధ్యతగా ప్రజలలో అవగాహన కలిగించడం ద్వారా 'జాగో గ్రహాక్ జాగో' అనే నినాదానికి బలం చేకూర్చాలి.

**చాడ వెంకటరెడ్డి**
మాజీ ఎమ్మెల్యే
సిపిఐ సీనియర్ నాయకులు

# క్రిస్మస్ ఈవ్ – జీసస్ జన్మించిన పవిత్ర రాత్రి !

క్రిస్మస్ పర్వదినం 25 డిసెంబర్ ముందు రోజు శుభ సాయంకాల గడియల్లో నిర్వహించుకునే ఆనందాల వెలుగుల పండుగను క్రిస్మస్ ఈవ్‌గా పెద్ద ఎత్తున జరుపుకుంటారు. 24 డిసెంబర్ రాత్రి జీసస్ క్రీస్తు పుట్టిన సందర్భంగా పశ్చిమ దేశాలు క్రిస్మస్ ఈవ్ వేడుకల్లో కుటుంబాలు, మిత్రులు సంతోష హరివిల్లుల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. క్రిస్మస్ ఈవ్ మధ్య రాత్రి జీసస్ జన్మించడంతో పవిత్ర రాత్రి (హోలీ నైట్), శుభ రాత్రి (గుడ్ నైట్) లేదా నిశ్శబ్ద రాత్రి (సైలెంట్ నైట్), పవిత్ర రాత్రి (హోలీ నైట్)గా ప్రార్థనలు, గీతాలాపనలు, శుభాకాంక్షలు తెలుపుకోవడం లాంటి ఉత్సవాలను నిర్వహిస్తారు.




**జీసస్ జనన శుభ గడియలు:**

శీతాకాల గాలుల నడుమ భక్తి ప్రపత్తులతో క్రిస్టియన్లు క్రిస్మస్ ఈవ్ వేడుకలను హృదయపూర్వకంగా జరుపుకోవడం, వీధులను విద్యుత్తు కాంతులతో అమర్చడం, సాంప్రదాయబద్ధంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. మేరీ కన్యకు బెత్లహామ్‌లో క్రిస్మస్ ఈవ్ ఘడియల్లో జీసస్ జన్మించడం, సాంప్రదాయ కార్యక్రమాన నిర్వహణ, 25 డిసెంబర్ రోజున పెద్ద ఎత్తున జరుపుకునే క్రిస్టమస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేసుకోవడం జరుగుతుంది. ఆధునిక యుగంలో క్రిస్మస్ ఈవ్ వేడుకలను 24 డిసెంబర్ రాత్రి పలు రుచులతో భోజనాలు, గృహ అలంకరణ లు, కానుకలను సిద్ధం చేసుకోవడం, క్రిస్మస్ ఆధారిత సినిమాలు చూడడం లాంటివి భక్తితోనిర్వహించుకోవడం కనిపిస్తుంది.

తమ ఆరాధ్య దైవమైన జీసస్ పుట్టిన రాత్రి వేళ, అనగా క్రిస్మస్ ఈవ్ దేశంలో క్రిస్టియన్లు భక్తి ప్రపత్తులతో క్రిస్మస్ ఈవ్ వేడుకలను మధ్య రాత్రి వరకు ఘనంగా నిర్వహించడం, కాలానుగుణంగా పర్వదిన వేడుకల సంప్రదాయాలు మారుతూ ఉండడం గమనిస్తున్నాం. క్రిస్మస్ ఈవ్ శుభ ఘడియల్లో క్రిస్టియన్ సోదరసోదరీమణులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేద్దాం, సర్వమత సారం ఒక్కటే అని రుజువు చేద్దాం.

(24 డిసెంబర్ క్రిస్మస్ ఈవ్ శుభ సందర్భంగా)

**ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఎం.జి.నరేగా నుంచి మహాత్ముని పేరు తొలగించడం క్రూరమైన నేరం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MG NREGA) నుండి మహాత్మా గాంధీ పేరు తొలగించాలనే ప్రయత్నం, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న ప్రజావిరోధి, క్రూరమైన ఉద్దేశాల ను స్పష్టంగా బయటపెడుతోంది.

ఎం.జి. నరేగా ద్వారా ఇప్పటివరకు 15.5 కోట్ల మంది క్రియాశీల గ్రామీణ కార్మికులకు ఉపాధి లభించింది. వీరి లో దాదాపు 50 శాతం మహిళలు. లబ్ధిదారుల్లో అధిక శాతం షెడ్యూల్డ్ కులా లు, షెడ్యూల్డ్ తెగలు, పీడిత వర్గాలకు చెందినవారే. గ్రామ స్వరాజ్యం – ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఉండాలన్నది గాంధీజీ కల. ఆ కలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చిన చట్టమే ఎం.జి.నరేగా. కానీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఈ చట్టాన్ని బలహీనపరచడం, క్రమంగా నిర్వీర్యం చేయడం అనే దిశలోనే పని చేస్తోంది. పేదలకోసం అన్నట్లు మాట్లాడే మోదీ ప్రభుత్వం వాస్తవంగా వందమంది కార్పొరేట్ కుటుంబాల అభివృద్ధికే కట్టుబడి ఉంది. నరేగాపై కొనసాగుతున్న దుష్ప్రచారం మొత్తం గోబెల్స్ తరహా అసత్య ప్రచారమే. మహాత్మాగాంధీ పేరు తొలగించడం యాదృచ్ఛిక చర్య కాదు. ఇది గాంధీ హంతకుడు గాడ్సేను ఆరాధించే కాషాయ శక్తులను సంతృప్తి పరచడానికే తీసుకున్న రాజకీయ నిర్ణయం. నరేగా స్థానం లో మరో కొత్త చట్టం తీసుకురావటం కూడా ఇదే ఎజెండాలో భా గం.



కొత్త చట్టంలో: సంవత్సరానికి 100 రోజులు–125 రోజులు ఉపాధి కల్పిస్తామని చెప్పారు – ఇది కేవలం మోసం. ఖర్చులో 60 శాతం రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి అని చేర్చారు. దీనివల్ల: ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు ఈ భారాన్ని మోయలేవు, చివరకు ఉపాధి హామీ పథకం ప్రయోజన రహితంగా కూలిపోతుంది. ఇంకా, గ్రామపంచాయతీలకు పనుల ఎంపికలో అధికారం లేదు, కేంద్ర ప్రభుత్వమే ఏ పనిచేయాలో ఆదేశిస్తుంది, పెరుగుతున్న ధరల మధ్య వేతన పెంపుపై ఒక్క మాట లేదు

ఇది 15.5 కోట్ల గ్రామీణ పేదల పట్ల ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న అమానుష వైఖరిని స్పష్టంగా చూపిస్తుంది. కార్పొరేట్లకు లక్షల కోట్లు – పేదలకు మాత్రం విమర్శలు. ఇప్పటివరకు నరేగా పథకానికి ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం సుమారు ₹10 లక్షల కోట్లు. దీని ఫలితంగా: గ్రామీణ ప్రాంతాల్లో ఆకలి మరణాలు, ఉపాధి లేని వారి ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. కానీ అదే సమయంలో: 2021–22 వరకు కార్పొరేట్లకు ₹8 లక్షల కోట్లు పన్ను రాయితీలు, 2022– 2024 మధ్య మరో ₹3 లక్షల కోట్లు, మొత్తం పన్ను రాయితీలు: ₹11 లక్షల కోట్లు, కార్పొరేట్ రుణ మాఫీలు: ₹16.5 లక్షల కోట్లు

అంటే మొత్తం మీద:

* 100 మంది కార్పొరేట్ మిత్రులకు ₹28 లక్షల కోట్లు
* 15.5 కోట్ల పేదలకు కేవలం ₹10 లక్షల కోట్లు

ఇదే బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల – పేదల వ్యతిరేక విధానం.

**వ్యవసాయ సంక్షోభం – గ్రామీణ విపత్తు**

స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలు గడిచినా, పేదరికం, ఆకలి, నిరుద్యోగం ఇవన్నీ దేశాన్ని వెంటాడుతూనే ఉన్నాయి.

మోదీ ప్రభుత్వం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవం ఏమిటంటే: గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి, వ్యవసాయం నష్టాల వృత్తిగా మారింది, కనీస మద్దతు ధర లేదు, రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఉదాహరణలు: కర్నూలు జిల్లాలో టమాటా రైతులు రోడ్లపై పంట పారేస్తున్నారు, వరంగల్ జిల్లాలో పత్తి రైతులు నష్టాల్లో ఉన్నారు, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు ఛాయలు, తీరాంధ్రలో వరదలు, భారీ వర్షాలతో నానిపోయిన ధాన్యం.

**నరేగా – చారిత్రక నేపథ్యం**

యుపిఎ–1 ప్రభుత్వ కాలంలో, వామపక్ష పార్టీలే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిపాదించాయి. గ్రామీణ నిరుద్యోగుల ఆత్మహత్యలకు చెక్ పెట్టే విప్లవాత్మక ఆలోచన ఇది. అప్పటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం తీవ్రంగా వ్యతిరేకించినా, వామపక్షాల ఒత్తిడితో 2006లో చట్టంగా మారింది.

గాంధీజీ కలకు ప్రతీకగా దీనికి మహాత్మా గాంధీ పేరు జమచేశారు. నరేగా డబ్బు వృథా అన్న ప్రచారం పూర్తిగా అసత్యం. ఇది పని చేయడానికి హక్కు కల్పించిన చట్టం. సోవియట్ యూనియన్‌లో లెనిన్ ప్రవేశపెట్టిన సబోత్నిక్స్ ద్వారా ప్రతి పౌరుడిలో శ్రమ విలువను పెంచారు. ఆ స్ఫూర్తితోనే నేను కూడా నా స్వగ్రామం ఐనంబాకంలో నరేగా పనుల్లో 8 గంటలు పని చేశాను, కార్మికులతో కలిసి అక్కడే భోజనం చేశాను.

**లోపాలు ఉన్నా – చట్టాన్ని రక్షించాలి**

అవును, అమలులో లోపాలు ఉన్నాయి: కొంతమంది భూస్వాములు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారు. అలాంటి వారిని అరెస్ట్ చేసి, ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి. కానీ అవినీతి పేరుతో చట్టాన్ని చంపడం నేరం. నరేగా: 15 రోజుల్లో వేతనం, సమాన పనికి సమాన వేతనం, వలసలు, ఆత్మహత్యలకు అడ్డుకట్ట

**ముగింపు:** కార్పొరేట్లకు ₹28 లక్షల కోట్లు ఇచ్చిన ప్రభుత్వం 15.5కోట్ల పేదల జీవనాధారమైన నరేగాను ఎందుకు రక్షించలేకపోయింది?

మహాత్మా గాంధీ పేరు తొలగించడం పరిపాలనా సంస్కరణ కాదు – అది భావజాల విధ్వంసం.

**డా. కె. నారాయణ,** చైర్మన్,
సెంట్రల్ కంట్రోల్ కమిషన్, సిపిఐ,
అజయ్ భవన్, న్యూఢిల్లీ, 9490952222

## ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

### హన్మకొండ డిఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్‌లో సేవలు మహిళలుఉపయోగించుకోవాలని హన్మకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. మంగళవారం ఆత్మకూరు పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలకు సంబంధించిన వివిధ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. 1560 మహిళలను పరిశీలించడం జరిగిందని, 350 మందికి అవసరమైన పరీక్షలు నిర్వహించినట్లు, 82 మందిని రిఫర్ చేసినట్లు తెలిపారు. 82 మందికి తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని డాక్టర్ స్పందనను ఆదేశించారు. మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు.

## ప్రజాసేవకే జీవితం అంకితం : స్వర్ణలత శివకుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన యాట కమలాకర్ అనారోగ్యంతో మృతిచెందగా కొన్నె గ్రామ నూతన సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్‌గౌడ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి తాను ఉన్నానని ధైర్యం చెప్పివారి కుటుంబానికి అంత్యక్రియలకు గాను రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచినా కానీ అనునిత్యం పేద ప్రజల కొరకు తన జీవితం అంకితమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అందరికీ అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికి పాటుపడతానన్నారు. మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు, ముదిరాజ్ సంఘం నాయకులు రామచంద్రయ్య, ప్రభాకర్, సత్తయ్య, వార్డు సభ్యులు పరిక్షిత్, శ్రీనివాస్, కనకయ్య, వెంకటయ్య, కనకయ్య, ఇస్తారి, ప్రభాకర్, మహేందర్, తిరుమలేష్, అభినయ్, తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గ కాలనీలో అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టి, శంకుస్థాపన చేసిన అనతికాలంలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం 59వ డివిజన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో రూ.74.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడేలా ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు అమలు చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో అవసరమైన పనులను గుర్తించి వేగంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్ రావు,డివిజన్ కార్పొరేటర్ వసంత, డివిజన్ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు కిరణ్,నాయకులునాగరాజు, సమ్మయ్య, సుదర్శన్ రెడ్డి,సుగుణ పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

## కెయులో హాకీ టీమ్ ఎంపిక



**ప్రజాపక్షం/కేయూక్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయంలో మంగళ వారం జరిగిన ఇంటర్ కాలేజీయేట్ హాకీ సెలక్షన్స్ హోరాహోరీగా క్రీడా మైదానం లో జరిగాయి. ఇందులో ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుండి 40 మంది హాకీ క్రీడాకారులు పాల్గొన్నారని స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ కేయూ ప్రొఫెసర్ వై. వెంకయ్య తెలిపారు. ఇందులో సెలక్ట్ అయిన క్రీడాకారులు సత్యభామ యూనివర్సిటీ చెన్నయ్ లో జరుగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్ లో పాల్గొంటారని ప్రొఫెసర్ వెంకయ్య తెలుపడం జరిగింది. ఇట్టి హాకీ క్యాంపు ముందుగా 15 రోజుల పాటు కేయూ గ్రౌండులో జరుగుతుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కుమార్ తెలిపారు. ఇందులో సెలక్టర్లుగా డాక్టర్ కే. సునీల్ రెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాస్, ఎస్డీ యాసిన్, కే. రాకేష్ వ్యవహరించారు.

## సారాయి విక్రేత అరెస్టు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్‌మండలంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన తండా మల్సూర్ అనే వ్యక్తి ఇంటి వద్ద సారాయి తయా రు చేస్తూ అమ్ముతుండగా, మహబూబాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ లు అశోక్, మౌనిక మంగళవారం రైడ్ చేసి (05) లీటర్ల సారాయి, (100) కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశా రు. నిందితుడ్ని అరెస్ట్ చేసి జడ్జి ముందు హాజరుపరిచారు. నిందితుడికి రిమాండ్ విధించారు. మహబూబాబాద్ జైలుకు తరలించారు.

## 26న ఎర్రజెండాలు ఎగురవేయాలి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిపిఐ వందేళ్ళ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 26న గ్రామ గ్రామాన ఎర్రజెండాలు ఎగురవేసి, పార్టీ పోరాటాల చరిత్రను ప్రజలకు తెలియజేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దోపిడీ రహిత సమాజం కోసం, సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా గత వంద సంవత్సరాలుగా ఈ దేశంలో అధికారం లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించి ఎన్నో హక్కులను సాధించి పెట్టి, ఉత్సవాలతో పాలక పార్టీలకు ఎజెండాను నిర్దేశిస్తూ, అనేక సంక్షేమ పథకాలకు దిక్సూచిగా పనిచేస్తోంది సిపిఐ అని కొనియాడారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న,కన్నేవెంకన్న,దూదికట్లసారయ్య, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.

## ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిశీలన



**ప్రజాపక్షం/ఖానాపూర్:** వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారంఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం డిసిపి పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే కేసుల వివరాలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, దుగ్గొండి సిఐ సాయి రమణ, తదితరులు పాల్గొన్నారు.

## మరదలిపై బావ దాడి

### కోర్టు ఆవరణలోనే ఘటన..చికిత్స పొందుతున్న బాధితురాలు

**ప్రజాపక్షం/ జనగామ :** మరదలిపై బావ దాడి చేసిన ఘటన మంగళవారం జనగామ కోర్టు ఆవరణలో జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం..జనగామ నియోజకవర్గం చేర్యాల మండలం సుంచనకోటకు చెందిన బూడిద అశోక్, అర్చనకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో అశోక్ నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. విచారణ నిమిత్తం ఇరు పక్షాలు మంగళవారం కోర్టుకు హాజరయ్యాయి. కోర్టుకు హాజరైన క్రమంలో అర్చనను బావ నర్సింహులు రాజీ చేసుకోవాలని ఒత్తిడి చేశారు. అర్చన కోర్టులోనే తేల్చుకుందామని చెప్పారు. ఆవేశానికి గురైన నర్సింహులు బండరాయితో అర్చన తలపై బాదాడు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో జనగామ ఏరియా హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అర్చన తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణి ఆవిర్భావ వేడుకలపై నిర్లక్ష్యమేల?

### ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్
### వేడుకలు బహిష్కరణ.. అన్ని మైన్స్, డిపార్టుమెంటులలో నిరసన




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకలను సింగరేణి యాజమాన్యం నామమాత్రంగా తూ..తూ.. మంత్రంగా నిర్వహించడం కార్మికులను, సింగరేణిని అవమానించినట్లని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్ ఆరోపించారు. మంగళవారం ఏఐటీయూసీ కొమురయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, సింగరేణి వేడుకల సందర్భంగా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో అన్ని మైన్స్, డిపార్ట్మెంట్లలో నల్ల బ్యాడ్జీలు ధరించి వేడుకలను బహిష్కరించినట్లు తెలిపారు. సింగరేణి డబ్బులను ఇతర ప్రభుత్వ అవసరాలకు 138 కోట్ల తో స్కూల్ అభివృద్ధి పనులకు, ఒకరోజు ఆడే ఫుట్బాల్ ఆటకు పదికోట్ల రూపాయలను ఖర్చు చేసిన సింగరేణి యాజమాన్యం భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా నిర్వహించే ఆవిర్భావ వేడుకలను నిర్వహించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉత్సవాల సందర్భంగా సింగరేణి ఐక్యతను చాటి చెప్పే విధంగా కార్మికులంతా ఒకే చోట నిర్వహించుకునే ఏకైక పండగ లాంటి వేడుకలను నామమాత్రంగా నిర్వహించడం సరైందికాదన్నారు. ఒకపక్క బొగ్గు బ్లాకులను వేలంలో వేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇలాంటి ధోరణి మానుకొని రాబోయే రోజుల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఈ వ్యతిరేక విధానాన్ని పై కార్మికులంతా కలిసికట్టుగా ఉద్యమించాలని ఈ సందర్భంగా రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పారిశుధ్య సిబ్బందికి బాసట

### నగర మేయర్ గుండు సుధారాణి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పారిశుధ్య సిబ్బంది శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నామని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పారిశుధ్య సిబ్బందికి స్వెట్టర్ల అందజేత కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సిబ్బందికి స్వెట్టర్లను అందజేశారు. మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, చలి కాలంలో స్వెట్టర్‌లను అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకుప్రయివేట్‌ఆసుపత్రులసమన్వయంతో ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేసి సాధారణ పరీక్షలతో పాటు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్‌వైజర్‌లు భాస్కర్, గోల్కొండ శ్రీను పాల్గొన్నారు.

## 30 వార్డులలో సిపిఐది ఒంటరి పోరు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోటపలుకుల రమేష్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే కమ్యూనిస్టులను జనవరిలో రాబోయేమున్సిపల్ ఎన్నికల్లో ప్రజ లు ఆదరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్ అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రావి నారాయణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలను నిర్వహించిందని మళ్లీ జనవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనుందని తెలిపారు. మున్సిపల్ ఎ న్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలతో పొత్తు లేకుండాభూపాలపల్లి మున్సిపాలిటీలో ఉన్న 30వార్డులలో ఏ పార్టీకి సంబంధం లేకుండా ఒంటరిగా పోటీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులతో ఓట్లనుకొని మందుకు కి బానిసలను చేసి లక్షల్లో ఖర్చు చేసి ప్రజాభివృద్ధికి ఉపయోగించవలసిన నిధులను సొంత అవసరాలకువాడుతున్నారనిమండిపడ్డారు. డబ్బులు అవసరం లేని రాజకీయా లు రావాలని కొలబెల్ట్ ప్రాంతంలో సింగరేణి కార్మికులు ఐక్యంగా ఉండాలని, డబ్బులకు మీ ఓట్లను అమ్మ రాదని, ప్రజా సేవ చేసి అభివృద్ధి కోసం పాటుపడే వారికే అండగా నిలవాలనిపిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సమితిసభ్యులుమాతంగిరామచందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు క్యాథరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్ ఉన్నారు.

# గర్భిణీ, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్




**ప్రజాపక్షం/ జనగామ :** ప్రతి గర్భిణీలు, శిశువుల ఆరోగ్యం పట్ల అధికారులు బాధ్యతాయుతంగా ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఐడిఓసిలోని మినీ సమావేశ హాల్‌లో శిశు మరణాలపై సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. 2024,,25–26 సంవత్సరాలకు సంబంధించి శిశు మరణాల కేసులను సమగ్రంగా సమీక్షించి భవిష్యత్తులో ఇలాంటి మరణాలు పునరావృత్తం కాకుండా అవసరమైన సరిదిద్దు చర్యలపై మెడికల్ అధికారులతో కలెక్టర్ చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మతృ, శిశు ఆరోగ్య సేవలను బాధ్యత యుతంగా అమలు చేయాలని, ఆరోగ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఔషదాలు, పరికరాలు 24 గంటల సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. డాక్టర్ కె మల్లికార్జున్‌రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

**మీ డబ్బు– మీ హక్కుపై అవగాహన**

మీ డబ్బు..మీ హక్కు అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు మంగళవారం కలెక్టరేట్‌లోజరిగింది. బ్యాంకులు, భీమా సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న అనాధరించబడినడిపాజిట్లు, బీమా మొత్తాలు, ఇతర ఆర్థిక ఆస్తులపై ప్రజలకు కలెక్టర్ అవగాహన కల్పించారు. డిసి చారి, చీఫ్ మేనేజర్ ఎస్ఎల్‌బిసి ఎస్ గోమతి, ఆర్‌బిఐ ఆశాలత, ప్రాంతీయ మేనేజర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శ్రీమూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తోపాటుబ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

**రోడ్‌సేఫ్టీ, యూరియా, నీటిపారుదలపై సమీక్ష**

జిల్లాలోరోడ్ సేఫ్టీ, నీటి పారుదల, యూరియా యాప్‌పై వ్యవసాయ శాఖ అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి 163 డిజైన్ నిర్మాణం గానీ భద్రత ప్రమాణాలను మెరుగు పరచాలని శాసన సభ్యులు కడియం శ్రీహరి అన్నారు.

# రాష్ట్రాభివృద్ధిలో సింగరేణిది కీలకపాత్ర

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
### జీఎం ఆఫీసులో సింగరేణి ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి అని, బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలకపాత్ర పోషిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం సింగరేణి కాలరీస్ 137వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో భూపాలపల్లి ఏరియా నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకు కార్మికులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. జీఎం కార్యాలయ ప్రాంగాణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే, జీఎం పూల వేసి నివాళులర్పించి, జెండావిష్కరణ చేశారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సింగరేణి సంస్థ వెన్నెముకలా నిలుస్తుందని, కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు లభించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకా లను అమలు చేస్తోందన్నారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సింగరేణి సంస్థ ఆధునికీకరణ, సాంకేతిక అభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ, దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సింగరేణి మరింత ప్రగతి సాధించేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థను స్థిరభవిష్యత్తు కొరకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని లని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ఎమ్మెల్యే సన్మానం చేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ :** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి నంద నాయక్ తండ గ్రామ సర్పంచ్ భూక్య వీరేందర్, గీసుగొండ మండలం నంద నాయక్ తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, వార్డు మెంబర్లు,గ్రామ సర్పంచ్ (ఇండిపెండెంట్) భూక్య వీరేందర్, ఉప సర్పంచ్ భూక్య రాము పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పాత కొత్త అనే తేడా లేకుండా సమన్వయంతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని,ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు మెంబర్లు వాంకుడోతూ మంజుల, వాంకుడోత్ రాజు, భూక్యరాజు, భూక్య సుజాత, బదావత్ బద్రు, బదావత్ సునీత, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బాదావత్ బాలోజీ, సుధాకర్ నాయక్, రమేష్, శ్రీను,బాబుతదితరులు ఉన్నారు.

## ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకం : కొండా సురేఖ




**ప్రజాపక్షం / వరంగల్ :** ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ అన్నారు. మంగళ వారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓ సీటీలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్, వరంగల్ జిల్లా కలెక్టర్, మాజీ ఎమ్మెల్సీ, నియోజక వర్గం లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పాస్టర్ లతో కలిసి క్రిస్మస్ వేడుకల కేక్ కట్ చేయడం తో పాటు, వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలోని పాస్టర్ లందరికీ మంత్రి తన సొంత ఖర్చుతో దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు ప్రేమ దయ కరుణలకు చిహ్నంగా నిలుస్తాయని క్రిస్మస్ వేడుకలు కులము మతము ఎటువంటి సంబంధం లేదని మత సామరస్యాన్ని చాటుతూ ఈ పండుగను జరుపుకుంటారని అన్నారు. పొరుగువారిని ప్రేమించి వారి తప్పులను క్షమించాలని క్రీస్తు బోధించారని అన్నారు. ప్రేమ, సహనం, శాంతి, క్షమ ఈ నాలుగు గుణాలే క్రీస్తు చూపిన మార్గాలని, దీనిని అనుసరించడం ద్వారా క్రీస్తు పట్ల మనం చూపే నిజమైన భక్తి అని అన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తున్నదని,పెయింటింగ్స్, లైటింగ్ కొరకు చర్చ్ కు రూ.30 వేల చొప్పున రూ 45 లక్షలు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్. సంధ్యారాణి, ఆర్డీఓ సుమ, కార్పొరేటర్లు భోగి సువర్ణ, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, పోశాల పద్మ, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, పుర్ఖాన్ ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి




**ప్రజాపక్షం/కెయుక్యాంపస్ :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని తెలిపారు. టెక్నాలజీని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసి బ్యాంకు ఖాతాల నుండి డబ్బులను అక్రమంగా కొట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుబేదారి శాఖ మేనేజర్ మౌనిక మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్లైన్ లావాదేవీల ద్వారానే ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయని వివరించారు.కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, డాక్టర్ చందర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమకొండలో ప్రభుత్వ భూముల వేలం ఆపాలి

### వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** పరిపాలన అవసరాలు, ఉద్యోగుల జీత భత్యాల కోసమని ప్రస్థత జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం,స్థానిక (ప్రజాప్రతినిధులు(ఎమ్మెల్యేలు) రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో విలువైన ప్రభుత్వ భూములను తక్కిన ధరలకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నదని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ చర్యను వ్యతిరేకిస్తున్నమన్నారు. బస్టాండ్ కు కూత వేటుదూరంలోకూడా లేని అత్యంత విలువైన సర్వే నెం.. 1066 లో ప్రభుత్వ భూమిని కుడా వేలం వేయడానికి నిర్ణయించుకొని తేదీని సైతం నిర్ణయించి వేలంపాటకు పిలిచిందని, వామపక్షాలు, ఇతర ప్రజాసంఘాలు, పౌరసంఘాల వ్యతిరేకతతో తాత్కాలికంగా నిలుపుదల చేసినా ఆ ఆలోచననువిరమించుకోలేదన్నారు. నగరపాలక సంస్థకు డబ్బులే అవసరమైతే ఇతర మార్గాలు అన్వేషించాలని,రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి కానీ ఆస్తులు అమ్మడం సరైంది కాదన్నారు. పైగా అనేక ప్రభుత్వ కార్యాలయాలూ, విద్యార్థుల హాస్టల్లూ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, భవిష్యత్తులో వీటికి నిర్మాణానికి భూమి ఎక్కడి నుండి తేస్తారని ప్రశ్నించారు. అందుకే ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అవసరాలకైనా వాడాలి, లేదంటే నిరుపేదలకైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలోని అత్యంత విలువైన భూములు కొన్నింటిని నామ మాత్రపు ధరకే పలుకు బడి కలిగిన,ప్రజాప్రతినిధులు కొద్ది మందికి లీజుకు ఇచ్చారని,ప్రజా ప్రతినిధులే లీజు పేరుతో కబ్జా చేశారని ప్రజలుఅనుమానిస్తున్నారన్నారు. నగరంలో అనేక దశాబ్దాలుగా కమ్యూనిస్టుల పోరాటాల వల్ల ప్రభుత్వ భూములు రక్షించబడ్డాయని, కొద్ది పాటి పేదలకు దక్కినప్పటికీ, ఎక్కువ భా గం ఆక్రమణ దారుల చేతుల్లోనే ఉన్నాయ న్నారు. ఈ పరిస్థితుల్లో పలుకుబడి కలిగిన వ్యక్తు లు, ధనవంతులు ఆక్రమించుకొన్న అట్టి ప్రభుత్వ భూములను వెలికి తీసేందుకు నగరవ్యాపితంగా సర్వే చేసి అట్టి భూములను స్వాధీన పరచుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో మొత్తం ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏ ర్పాటు చేయాలని కోరారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, సీపీఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, కర్ర రాజిరెడ్డి, సీపీఐ ఎం ఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు నున్నా అప్పారావు, భారత్ బచావో నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమిలీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురంలోని ఎమిలీ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల యాజమా న్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం క్రిస్మస్ అలంకరణలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు క్రిస్మస్ గీతాలు ద్వారా యేసుక్రీస్తు జన్మ సందేశాన్ని చక్కగా ప్రదర్శించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపినాథ్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సేవాభావానికి ప్రతీక అని ప్రపంచ మంతా చేసుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. విద్యార్థులు ఈ విలువలను తమ జీవితాల్లో పాటించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం చివరిలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను ఆనందంగా ముగించారు.

## 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భట్టి శంకుస్థాపన



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం పినపాకలో నూతన 33/11 కెవి విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంగళవారం శం కుస్థాపన నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాల ప్రజలకు అందించటం జరిగిందని, సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజలకు రైతాంగానికి ఉపయోగపడే సబ్ స్టేషన్‌లో మంజూరు చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందచేసిందని, సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రజలకు రైతాంగానికి ఉపయోగపడే సబ్ స్టేషన్‌లో మంజూరు చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మంచి కోరుతూ పనిచేస్తుందని అన్నారు.

## నూతన సిపిఐ వార్డు సభ్యులకు ఘనంగా సన్మానం



ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామ పంచాయితీలో కాంగ్రెస్, టిడిపి, సిపిఎం పార్టీలు బలపర్చిన సిపిఐ గెలుపొందిన అభ్యర్థులకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సారపాక పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సారపాక మేజర్ గ్రామ పంచాయితీలోని 2 వార్డు సభ్యులుగా ముమ్వా వెంకటేశ్వరరావు(లడ్డా), 6 వ వార్డు సభ్యులు భూక్య హేమావతి, 7వ వార్డు సభ్యులు గుగులోత్ భీమాలు గెలుపొందారు. కాగా వీరిని ఘనంగా పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గెలుపొందిన సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఓటు వేసి వార్డు సభ్యులుగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా బలపర్చిన వివిధ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు, భాస్కర్‌నగర్‌శాఖ కార్యదర్శి వంకాయలపాటి నాగేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు




ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల, ఉమెన్ ఎంపర్‌మెంట్ సెల్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, అనర్థాలుపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాల, డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ కళాశాల విద్యార్థులచే బాల్య వివాహాలు, దుష్పరిణామాలపై నాటికను ప్రదర్శించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే బాలికల విద్య,ఆరోగ్యం, మానసిక వికాసం కోల్పోతారని దీనితో సమాజానికి చేటు కలుగుతుందని అవగాహన కలిగించారు. అనంతరం ఎంపర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ జే. మాధవి మాట్లాడుతూ బ్యా వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు బ్ధాయతగా తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తిలియజేయాలని కోరారు. కళాశాల అద్యాపకులు శెట్టి స్వరూపరాణి, నియాజ్ ఫర్వీన్, విమల, కస్తూర్భా పాఠశాల ప్రిన్సిపాల్ తులసి, విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్పంచ్‌లను సన్మానించిన కాపా అప్పయ్య




ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో సర్పంచ్ గుర్రం శ్రీను నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపా అప్పయ్య ఆధ్వర్యంలో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పాతపినపాక గ్రామపంచాయతీ సర్పంచ్ గుర్రం శ్రీను, మల్లవరం గ్రామపంచాయతీ కిటికి కిరణ్‌కుమార్, కాపా అప్పయ్య చేతుల మీదుగా శాలువాతో సత్కరించి ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు.తల్లాడ మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైరా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాపా సుధాకర్ , ఏరువ గోపాలరావు,రోశయ్య, లక్ష్మీ నారాయణ, కాపా రామారావు, నర్సింహారావు, కాపా మహేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్.జమాల్ పాల్గొన్నారు.

## ఘనంగా పి.వి. నర్సింహారావు వర్ధంతి



ప్రజాపక్షం/మధిర : మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు స్వర్గీయ భారత మాజీ ప్రధాని, భారతరత్న పివి నర్సింహారావు 21వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కృష్ణాపురం సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నాటి రామారావు, పత్తేపరపు సంగయ్య, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ .జహంగీర్, గాంధీ పథం అధ్యక్షులు బోడేపూడి గోపి, పట్టణ డివిజన్ కమిటీ అధ్యక్షులు బొల్లెద్దు రాజేంద్ర, మోదుగు బాబు, సువర్ణకంటి రామకృష్ణ, జాకిర్‌హుస్సేన్, పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్, కర్నాటి శ్రీను, సాయి పాల్గొన్నారు.

## భవిష్యత్‌లో గణితం ఎంతో కీలకం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీ శ్రీనివాస రామానుజం జ యంతి సందర్భంగా కల్లూరు లోని విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా జరిగింది. విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు మోడల్స్ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి నివేదిత పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు. అనంతరం జాతీయ గణిత అవార్డు గ్రహీత షేక్ మౌలాలిని పాఠశాల ఉపాధ్యాయులు తో పాటు ఎంఈఓ అభినందించారు.

# పునర్జన్మనివ్వడం అభినందనీయం

**పాల్వంచ వైద్యులు, సిబ్బంది సేవలు భేష్**

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఆశే లేని చోట ఆయువు పోసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన డిసిఎచ్ఎస్ డా.జి.రవిబాబు, వైద్యబృంధం సేవలు అభినందనీయమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశంసించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 9న పశ్చిమబెంగాళ్‌కు చెందిన బిసాల్ తమాంగ్ అనే వ్యక్తి గొంతుకోసుని ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో వెంటనే స్పందించిన డా. రవిబాబు, డా. రాంప్రసాద్, డా. సోమరాజు దొర, ఎఎన్‌టి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, పాల్వంచ సామాజిక ఆస్పత్రిలో రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సలు చేసి అతనికి ప్రాణాలు పోశారని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాత్రమే జరిగే ఆపరేషన్‌ను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో దిగ్విజయంగా పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. పేదవర్గాల ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోనికి తెచ్చేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషిని ప్రతీ ఒక్కరూ అభినందించి మరింత ప్రోత్సహించాల్సిందే అని, తన నియోజకవర్గం పరిధిలోనిఈ ఘటన చోటు చేసుకోవడం ఆనందంగా ఉందని, ప్రభుత్వం వైద్యం పై నమ్మకం లేని ఈరోజుల్లో ఇలాంటి ఆపరేషన్లతో సామాన్య, పేద వర్గాల చూపు ప్రభుత్వాస్పత్రుల వైపు మళ్లించేందుకు దోహదపడుతుందని కూనంనేని పేర్కొన్నారు.

### ఉప ముఖ్యమంత్రి

# భట్టితో సిపిఐ బృందం



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి సింగరేణి పర్యటనకు మంగళవా రం వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ ఆధ్వర్యంలో సిపిఐ బృందం కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసింది. మ ధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రూ.10 వేల వేతనం వెంటనే ఇవ్వాలని, వారికి రావలసిన పెండింగ్ బిల్లులు, వేతనాలు, కోడి గుడ్డు బిల్లు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ప్రభుత్వ సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని అందులో భాగంగా వికాసి వికాసిత్ భారత్ జి రామ్ జి పథకం తెచ్చిందని దీని వలన కూలీలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని మహాత్మా గాంధీ పేరు తొలగించడం హేయమైన చర్య అని, పార్లమెంట్లో కాంగ్రెస్ ఎంపీలు పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

## సెయింట్ జోసఫ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని గుర్రాలపాడులో గల సెయింట్ జోసఫ్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రిస్మస్ తాత వేషంలో అలరించారు. అలాగే చేసినా నృత్యాలు, నాటికలు ఆకర్షంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్సార్ ప్రశాంతి, కరస్పాండెంట్ ఫ్రాన్సిస్కో డిసౌజ, పిఈటి రామారావు, టీచర్స్ ఉమా, మౌనిక, హలీమా, అనుష, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ అధికారులు

**మూడో రైల్వేలైన్ భూ నిర్వాసితుల పరిహారం విషయంలో విచారణ చేపట్టిన తహసీల్దార్**



ప్రజాపక్షం/ మధిర : మధిర రైల్వే మూడవ లైన్ భూ నిర్వాసితుల పరిహారంలో తమకు అన్యాయం జరిగిందని బాధిత కుటుంబం కలెక్టర్‌కు విన్నవించగా, కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని లడక్ బజార్ వెళ్లే రహదారిలో రైల్వే లైను అనుకుని ఉన్న రాయల్ లాడ్జి భవనం రైల్వే మూడో లైన్ స్థలం సేకరణ చేసి మొత్తం 189 గజాలు ఉన్న బిల్డింగ్‌లో 64గజాలను రైల్వే అధికారులు తీసుకున్నారు. అదేవిధంగా రాయల్ లాడ్జి బిల్డింగ్ శిథిలావస్థకు చేరటంతో ఆ భవనానికి 189 గజాల్లో ఉన్న భవనానికి రూ.68లక్షలు నష్ట పరిహారం వచ్చినట్లు దానిలో నలుగురు వాటాదారులు ఉంటే ముగ్గురికి నష్టపరిహారం అందినట్లు నాల్గొవ వాటాదారుని బాధితులు బిల్లకంటి వెంకటేశ్వర్లు నిన్న ఖమ్మం కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో కలిసి దరఖాస్తు చేసుకోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మధిర తహశీల్దార్ రాంబాబు రాయల్ లాడ్జి భవనం వద్దకు వచ్చి సంబంధిత వ్యక్తులను విచారించారు. ఈ బిల్డింగ్ సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపించనున్నట్లు బాధితునికి తహశీల్దార్ తెలిపారు. రాయల్ లాడ్జి భవనం కూల్చివేత కోసం 19గదులకు రూ.68లక్షల భవనం కూల్చి వేయాలని, లేనిపక్షంలో రికవరీ చేసేందుకు అధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు. ఈ భవనానికి సంబంధించి వాస్తవాలను ఉన్నతాధికారులకు రిపోర్టు పంపనున్నట్లు తెలిపారు. బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

# 'సింగరేణి డే'ను బహిష్కరించిన గుర్తింపు సంఘం

**మైన్స్, డిపార్ట్‌మెంట్స్‌లో**

**నల్ల బ్యాడ్జీలతో నిరసన**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతీ ఏటా డిసెంబర్ 23న జరుపుకునే సింగరేణి డే ని గుర్తింపు సంఘమైన (ఏఐటియూసి అనుబంధం) సింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్ బహిష్కరించింది. ఈ మేరకు మైన్స్, డిపార్ట్ మెంట్స్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లిఖార్జునరావు, సహాయ కార్యదర్శి గట్టయ్యలు మాట్లాడారు. కార్మికుల శ్రమశక్తితో ముం దుకు సాగుతున్న సింగరేణి సంస్థ కార్మికుల కుటుంబాల్లో ఆనందాలు నింపే సింగరేణి డేని అట్టహాసంగా నిర్వహించాల్సింది పోయి నాలుగు గోడల మధ్య జరపడం తీవ్ర అవామన కరం అన్నారు. ఇది కార్మికులను, వారి శ్రమశక్తిని అవమానించినట్లే అని మండిపడ్డారు. ఆర్థిక ఆంక్షల పేరిట నిధులను కుదించి వేడుకలు జరపకుండా జిఎం ఆఫీస్‌కు మాత్రమే పరిమితం చేయడం దుర్మార్గం అన్నారు. 136 సం.ల చరిత్రలో సింగరేణి పరిమిత స్థాయిలోవేడుకలు జరపడం ఏంటని కార్మిక కుటుంబాల్లో అసంతృప్తి కలిగిస్తోందన్నారు. గతకాలంగా వస్తున్న సంప్రదాయాన్ని తిలోదకాలు ఇచ్చి కార్మికులను నిలువునా అవమానించడం సరైంది కాదన్నారు. ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, హీరాలాల్, గుమ్మడి వీర య్య, నాయకులు రాజపూడి సాంబమూర్తి, ఎం ఆర్‌కే ప్రసాద్, కమల్, మెంగెన్ రవి, సురేందర్, మురళీ, వినయ్, లిఖిత్, అవినాష్, రాజేష్, నాగరా జు, భూక్యా రమేష్, సాయిపవన్, అప్పారా వు, ఆకుల శ్రీనివాస్, జడల ప్రకాష్, రాంచందర్, పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ 'ఉపాధిహామీ'లో మహాత్మాగాంధీ పేరును కొనసాగించాలి

**వైరా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరసన**

ప్రజాపక్షం/వైరా: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ(పనికి ఆహార పథకం) పథకానికి మహాత్మాగాంధీ పేరుని తొలగించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం వైరాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ పేరును కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరును మార్చాలని చూస్తూ తీసుకున్న నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తున్నామని ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కూడా చేపడతామని ఆయన తెలిపారు.కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, నూకల ప్రసాదరావు, సముద్రాల మురళీకృష్ణ, యండ్రపూడి శివశంకర్, మిట్టపల్లి వినోద్‌కుమార్, తెల్లాకుల సందీప్, వజినేపల్లి చక్రవర్తి, వజినేపల్లి రవికుమార్, గజ్జల భాస్కర్, బోనగిరి సతీష్, కటకం శివకృష్ణ, జెల్లా అవినాష్, కాజా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ పిహెచ్‌సి ఎదురుగా ఆశా వర్కర్ల సమస్యల పరిష్కరించాలిన బోనకల్ పిహెచ్‌సి ఎదురుగా ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు మండల కన్వీనర్ నరేష్, కో కన్వీనర్ బోయినపల్లి వీరబాబు మాట్లాడుతూ ప్రస్తుతం సర్వే వేతనాలు గతం నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫిక్స్ వేతనం రూ.18వేలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బోనకల్ పిహెచ్‌సి డాక్టర్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్.బుజ్జి మేస్త్రీ ఆశావర్కర్ల నాయకులు రావణ, సరోజిని, కొంగర వెంకటరమణ, మరీదు లీలాకుమారి, ఇరువు యశోద, నక్కల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ టీచర్ నుండి జాతీయ ఆవిష్కర్త దాకా



ప్రజాపక్షం/కారేపల్లి: పాఠాలు చెప్పే చేతులే ప్రాణాలు కాపాడే పరికరాలను తయారు చేస్తే ఆ ఆలోచనకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తే..ఆ స్ఫూర్తికి నిలువెత్తు రూపమే ఎస్‌కే రాజాలి పాషా. ఖమ్మం జిల్లాలోని ఒక మారుమూల పాఠశాలలో సాధారణ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన జాతీయ స్థాయి ఆవిష్కర్తగా ఎదిగిన ఆయన కథ ప్రతి ఒక్కరికీ ఆదర్శం. నేపథ్యం, ప్రేరణ రాజాలి పాషా ఇల్లందు పట్టణానికి చెందిన వారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పెద్దాతండా అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పుట్టుకతోనే వినికిడి, ఉన్నప్పటికీ పట్టుదలతో ఉపాధ్యాయుడయ్యారు. తన స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉదంతం ఆయనను ఆలోచింపజేసింది. బాధితుల భద్రత కోసం ఏదైన చేయాలనే తపన ఆయనను ఒక ఆవిష్కర్తగా మార్చింది.

**అద్భుత ఆవిష్కరణలు..**

దివ్యాంగుల సురక్షా కిట్ ఒక సామాన్య టీచర్ తన పరిమిత వనరులతోనే అద్భుతమైన మూడు పరికరాలను రూపొందించారు.

**స్మార్ట్ హెల్మెట్, క్యాప్..**

హారన్ శబ్దాన్ని గ్రహించి వైబ్రేషన్, లైట్ సంకేతాల ద్వారా బాధితులను అప్రమత్తం చేసే ఈ పరికరాలు విప్లవాత్మకమైనవి.

**డఫ్ కార్ డ్రైవర్ సేఫ్టీ సిస్టమ్..**

కారు నడిపూ బధిరుల కోసం స్టీరింగ్ ముందు అమర్చిన చిన్న బాక్స్ నుండి ఫ్యాన్ గాలి, ఎరుపు రంగు లైట్ ద్వారా వెనుక వాహనాలను గుర్తించేలా చేశారు. జాతీయ స్థాయికి ఎదిగిర ప్రస్థానం సాధారణ తరగతి గది నుండి ప్రారంభమైన ఈ ప్రస్థానం ఢిల్లీ పీఠం వరకు చేరింది.

**న్యూఢిల్లీలో ప్రాతినిధ్యం..**

2023 డిసెంబర్‌లో న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన పీపుల్ ఫస్ట్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ తరపున జాతీయ వేదికపై తన ఆవిష్కరణలను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు.


**రాష్ట్ర స్థాయి గుర్తింపు..**

తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖ నుండి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. డబుల్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు గ్రామీణ ప్రాంతం నుండి అసాధారణ ప్రతిభ కనబరిచినందుకు రెండు సార్లు ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ తన అధికారిక మ్యాగజైన్‌లో ఆయనను ఒక రోల్ మోడల్‌గా ప్రచురించింది.

# ముక్కోటి మురిసేలా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

**29న తెప్పోత్సవం, 30న ద్వారదర్శనం**

**ప్రభుత్వం సాయం అందేనా ?**





ప్రజాపక్షం/భద్రాచలం : దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రంలో ముక్కోటి ఉత్సవం మురిసేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇందు సంబంధించి ఇప్పటికే పనులు ఊపందుకున్నాయి. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణ ముఖద్వారాల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల ఉత్సవానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, కటవుట్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందించి స్వాగతిస్తున్నారు. ఇదిలా ఉండగా మిథిలా స్టేడియంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా అధ్యనోత్సవాలు కొనసాగుతున్నాయి.మంగళవారం స్వామివారు భక్తులకు నర్సింహావతారంలో దర్శనమిచ్చారు. ఉన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మిథిలా స్టేడియం వద్దకు చేరుకున్నారు.

**ఉపందుకున్న పనులు :** ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా పనులు ఊపందుకున్నాయి. భక్తులు మెచ్చేలా ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు కొనసాగుతున్నాయి. మిథిలా స్టేడియం ప్రాంగణంతో పాటు గోదావరి తీరంలో ఏర్పాటు చకచగా సాగుతున్నాయి. ఆలయ ప్రాంగణాన్ని ఇప్పటికే సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు.విద్యుత్ దీపాల కాంతులతో పరిసర ప్రాంతాలు మిరిమిట్లు గొలిపేలా ఉన్నాయి. చుట్టు ప్రాకారాలతో పాటు గాలిగోపురానికి రంగురంగుల విద్యుత్ దీపాలు అలంకరించారు. గోదావరి ఆవలి తీరంలో కూడా ఆలయ అందాలు విరజిమ్ముతున్నాయి. బారికేడ్లు, సెక్టార్లు, పారిశుధ్య పనులు, పార్కింగ్ తదితర పనులు శరవేగంగా సాగుతున్నాయి. అదే విధంగా భక్తులకు మెరుగై సదుపాయాలు అందించేందుకు అధికారులు శ్రమిస్తున్నారు.

**29,30 తేదీల్లో :** ఈనెల 29న తెప్పోత్సవం, 30న ఉత్తర ద్వార దర్శనం జరగనున్నాయి. 29వ తేది గోదావరి తీరంలో స్వామివారి జల విహారం కన్నుల పండువగా జరిపించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే హంస వాహన పనులు పూర్తి కావచ్చాయి. గోదావరిలో నది ఒరవడి ఆధారంగా హంస తిరిగే ఏర్పాట్లను ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. భక్తులుస్వామివారి తెప్పోత్సవ వేడుకను కన్నులారా వీక్షించేందుకు సెక్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. 30వ తేదిన స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నాయి. మిథిలా స్టేడియం ముందున్న ఉత్తర ద్వా రా న్ని ఉత్సవానికి సిద్ధం చేస్తున్నారు. ఉత్తర ద్వారం వద్ద భక్తులు కూర్చుని తిలకించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సెక్టార్ల కేటాయింపు పూర్తికాగా వివిఐపి, విఐపితో పాటు పలు రకాల సెక్టార్ల నిర్ణయం జరిగిపోయింది. సామాన్య భక్తులు సైతం స్వామి వారి దర్శనాన్ని వీక్షించే విధంగా పరిసరాల్లో ఎల్ఇడిలు ఏర్పాటు చేస్తున్నారు.

**భక్తులపైనే భారం :** ప్రభుత్వాలు మారినప్పటికీ జరిగే ఉత్సవాలకు ఆర్థిక సహాయం అందడం లేదు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయించాలని భక్తులు మొత్తుకుంటున్నప్పటికీ ఏ మాత్రం పాలకుల్లో చలనం లేదు. మేడారం వంటి ఉత్సవాలకు కోటాను కోట్లు వెచ్చించే ప్రభుత్వాలు రామయ్యపై శీతకన్ను వేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలో శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి ఉ త్సవాలు ప్రతీ ఏటా వైభవంగా నిర్వహిస్తుంటారు.రెండు ఉత్సవాలకు కలిపి సుమారు రూ.3.50 కోట్ల వరకు వ్యయం అవుతోంది. భక్తులు వేసే కానుకల్లో నుండే ఆలయ దూపదీప నైవేద్యాలు, ప్రసాదాలు,జీతభత్యాలకు ఖరు చేస్తుంటా రు. ఇప్పుడు ఈ ఉత్సవాలకు కూడా భక్తులు చెల్లించే కానుకల్లో నుండే వెచ్చించాల్సి రావడంతో భారం పడుతో ంది. ప్రభుత్వాలు నిర్వహించాల్సిన ఉత్సవాలను కూడా దాతలపై ఆధారపడాల్సి రావడంతో రామభక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు రామాలయంలో జరిగినే ఉత్సవాలకు ఆర్థిక సహాయాన్ని అందించాలని పలువురు కోరుతున్నారు.

క్రీడ

# స్టార్ ఆటగాళ్ల సందడి..

## విజయ్ హజారే ట్రోఫీకి కొత్త కళ



ఇంతకుముందు విజయ్ హజారే ట్రోఫీ అంటే అభిమానుల్లో పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. టోర్నీ ఎప్పుడు మొదలైంది, ఎప్పుడు ముగిసిందో కూడా చాలామందికి తెలిసేది కాదు. కానీ, ప్రస్తుతం భారత జట్టులో ఉన్న క్రికెటర్లందరూ కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐ షరతు విధించడంతో ఈ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీకి కొత్త కళ వచ్చింది. స్టార్ ఆటగాళ్లు తమ తమ రాష్ట్రాల జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. డిసెంబరు 24 నుంచి మొదలుకానున్న ఈ టోర్నమెంట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మతోపాటు మరికొంత మంది స్టార్ ప్లేయర్లు సందడి చేయనున్నారు. కోహ్లీ 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతుండటం విశేషం.

### మళ్లీ రో-కో ఫైర్ చూస్తామా?

ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్న రోహిత్ శర్మ.. డిసెంబర్ 24, 26న సిక్కిం, ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌ల కోసం జైపుర్ చేరుకున్నాడు. రోహిత్ ఇప్పటివరకు ఈ టోర్నీలో 18 మ్యాచ్‌లు ఆడి 600 రన్స్ చేశాడు. 2005–06 సీజన్‌లో వెస్ట్ జోన్‌కు ఆడిన హిట్‌మ్యాన్.. నార్త్ జోన్‌పై 142 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌తోనే దేశవాళీ క్రికెట్‌లో రోహిత్ వెలుగులోకి వచ్చాడు. ఇక, కొన్ని రోజుల కిందట లండన్ నుంచి భారత్‌కు చేరుకున్న కోహ్లీ ముంబయిలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. ఢిల్లీకి ఆడనున్న కోహ్లీ.. ఆంధ్రతో మ్యాచ్ కోసం బెంగళూరు వెళ్లాడు.




విజయ్ హజారేలో 'కింగ్'కు మంచి రికార్డు ఉంది. 2008–9 సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి నాలుగు శతకాలు బాది 534 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాతి సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి 229 రన్స్ చేశాడు. ఇటీవల సఫారీలతో వన్డే సిరీస్‌లో రాణించిన రో..కో విజయ్ హజారే ట్రోఫీలోనూ అలరించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

### పంత్ సద్వినియోగం చేసుకుంటాడా?

కొంతకాలంగా టెస్టులకే పరిమితమైన రిషభ్ పంత్ ఢిల్లీకి ఆడనున్నాడు. ఈ టోర్నీలో సత్తాచాటి తిరిగి పరిమిత ఓవర్ల క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నాడు. మరి అతను ఏ మేరకు రాణిస్తాడో చూడాలి. టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకోవడంతో నిరాశలో ఉన్న శుభ్‌మన్ గిల్ పంజాబ్ తరఫున బరిలోకి దిగుతున్నాడు. వచ్చే నెలలో కివీస్‌తో వన్డే సిరీస్ ఉన్నందున ఈ టోర్నీ అతనికి మంచి సన్నాహకంగా ఉపయోగపడనుంది.

### కొత్త పేసర్లు వెలుగులోకి వస్తారా?

విజయ్ హజారే ట్రోఫీలో ప్రతిభావంతులైన యువ పేసర్లు వెలుగులోకి వస్తారని సెలక్టర్లు ఆశిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రంజీ ట్రోఫీలో రాణించిన మహ్మద్ సిరాజ్.. తర్వాత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని భారత జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా మారాడు. సిరాజ్ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో మరో కొత్త పేసర్ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్ వంటి పేసర్లు వెలుగులోకి వచ్చినా వారిలో నిలకడ లేదు. గుర్జప్నీత్ సింగ్ (తమిళనాడు), గుర్నూర్ బ్రార్ (పంజాబ్), యుధ్వీర్ సింగ్ (జమ్మూ కశ్మీర్), అనుజ్ థక్రాల్ (హరియాణా), సాకిబ్ హుస్సేన్ (బిహార్) ఈ టోర్నీలో రాణిస్తారనే అంచనాలున్నాయి.

## నెంబర్ వన్ టీ20 బౌలర్‌గా

# దీప్తి శర్మ




భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ.. టీ20ల్లో అత్యుత్తమ బౌలర్‌గా నిలిచారు. ర్యాంకింగ్స్‌లో ఆమె ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఆ ఆల్‌రౌండర్ తొలిసారి తన కెరీర్‌లో ఫస్ట్ ర్యాంక్ కొట్టేసింది. శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ దుమ్మురేపింది. ఈ నేపథ్యంలో ఆమె ర్యాంక్ మరింత మెరుగైంది. ఇక వన్డే బ్యాటర్లలో స్మృతి మంథానా తన నెంబర్ వన్ బ్యాటింగ్ పొజిషన్‌ను చేజార్చుకున్నది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో దక్షిణాఫ్రికా కెప్టెన్ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చింది. ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సుదరల్యాండ్.. టీ20 బౌలర్ల జాబితాలో ఆగస్టు నుంచి నెంబర్ వన్ స్థానంలో ఉన్నది. అయితే తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన దీప్తి శర్మ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నది. దీంతో ఆమె టాప్ ర్యాంక్ కొట్టేసింది. 8 వికెట్ల తేడాతో ఇండియా ఆ మ్యాచ్‌లో గెలవగా, దీప్తి శర్మకు అయిదు కీలకమైన పాయింట్లు వచ్చేశాయి. దీంతో ఆ స్టార్ ఆల్‌రౌండర్ ఒక పాయింట్ తేడాతో ఆస్ట్రేలియా బౌలర్ కన్నా ముందు నిలుచుంది. టీ20 బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ టాప్ టెన్‌లోకి చేరుకున్నది. ఆమె ప్రస్తుతం 9వ స్థానంలో నిలుచున్నది. లంకతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న ఆమె టాప్ 10లోకి ప్రవేశించింది. టాప్ టెన్‌లో మంధానా, షఫాలీ శర్మ కూడా ఉన్నారు. వన్డే బ్యాటర్ల జాబితాలో మంధానా రెండో స్థానంలో ఉన్నది.

ఫోకస్

మహిళ




నిరుద్యోగులు.. చివరుద్యోగులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉన్న కేంద్ర పథకాల్లో 'ప్రధాన మంత్రి ఉద్యోగ గ్యారంటీ ప్రోగ్రామ్' (పిఎంఇజిపి) మెరుగైనదని చెప్పుకోవచ్చు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో కొత్త సూక్ష్మ పరిశ్రమలను స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వం అందించే రుణ-సబ్సిడీ పథకం.

# చిన్న పరిశ్రమలకు 'పిఎంఇజిపి' ఊతం

ఈ పథకం కింద ప్రాజెక్టు వ్యయం తయారీ రంగానికి గరిష్ఠంగా రూ. 50 లక్షలు, సేవా రంగానికి రూ. 20 లక్షలు వరకు మంజూరు చేస్తారు. ఈ పథకం ద్వారా రుణం బ్యాంకుల ద్వారా అందిస్తారు. అలాగే మార్జిన్ మనీని సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ పథకంలో వ్యాపారానికి సంబంధించిన మూలధన ఖర్చుల కోసం టర్మ్ లోన్‌ను మంజూరు చేస్తారు. అదే విధంగా రోజువారీ వ్యాపార నిర్వహణ కోసం వర్కింగ్ క్యాపిటల్ రుణం ఇస్తారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 15 శాతం నుండి 35 శాతం వరకు సబ్సిడీని అందిస్తుంది. ఇది లబ్ధిదారుడిపై ఉన్న రుణ భారాన్ని తగ్గిస్తుంది. సాధారణ లబ్ధిదారులకు పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం వరకూ సబ్సిడీ అందే అవకాశాలు ఉన్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, మహిళలు, ఈశాన్య రాష్ట్రాల వారు, హస్తకళల కార్మికులు, మాజీ సైనికులు వంటి వర్గాలకు 25 నుంచి 35 శాతం వరకూ సబ్సిడీ ఉంటుంది.

### కీలక అంశాలు..

- రుణమొత్తం రూ. 10 లక్షల లోపు ఉంటే, ఏవిధమైన భద్రతా హామీ (కొల్లేటర్ సెక్యూరిటీ) అవసరం లేదు.
- ఈ పథకాన్ని అమలు చేసే ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) సంస్థ లబ్ధిదారులకు మార్కెటింగ్ సాయం అందిస్తుంది. వారి ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఎగ్జిబిషన్లు, కొనుగోలు–అమ్మకందారుల సమావేశాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- దరఖాస్తు దారుల కనీస వయసు 18 సంవత్సరాలు. గరిష్ట వయసును పేర్కోలేదు.
- ఆదాయ పరిమితి లేదు. ఎవరికైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యార్హత విషయానికి వస్తే, రూ.10 లక్షలు లేదా అంతకు మించిన ప్రాజెక్టు విలువగల తయారీ రంగ ప్రాజెక్టులు , రూ.5 లక్షలు అంతకు మించిన ప్రాజెక్టు విలువగల సేవా రంగ ప్రాజెక్టులకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణత. మిగతా ప్రాజెక్టులకు కనీస విద్యార్హత అంటూ ఏదీ లేదు.
- పాత వ్యాపారాలకు లేదా రీన్యువల్ ప్రాజెక్టులకు ఈ పథకం వర్తించదు. కేవలం కొత్త ప్రాజెక్టులకు మాత్రమే ఈ పథకం కింద ఆర్థిక సహాయం లభిస్తుంది.
- ఆన్‌లైన్ దరఖాస్తులో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఆసక్తిగల వారు అన్ని వివరాలతో దరఖాస్తు ఫారాలను పిఎంఇజిపి ఇ–పోర్టల్ https://kviconline.gov.in/pmegpeportal/jsp/pmegponline.jsp ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తుదారులకు పారిశ్రామికాభివృద్ధి ప్రోగ్రామ్ కింద తప్పనిసరిగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేయాలి. ఇది వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, అకౌంటింగ్ వంటి ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తుంది.
- ఆన్‌లైన్ దరఖాస్తు బ్యాంకుకు ఫార్వార్డ్ చేయబడుతుంది. బ్యాంకు పరిశీలన తర్వాత రుణం మంజూరు చేస్తుంది.
- బ్యాంకు రుణం మంజూరు చేసిన తర్వాత, మార్జిన్ మనీ సబ్సిడీ ప్రభుత్వం నుండి బ్యాంకుకు జమ చేస్తారు. ఆ మొత్తాన్ని బ్యాంకు ప్రాజెక్టు ఖాతాలో నిలిపి ఉంచుతుంది.
- పిఎంఇజిపి పథకాన్ని మూడు ప్రధాన సంస్థల ద్వారా అమలు చేస్తారు. జాతీయ స్థాయిలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) పర్యవేక్షణ బాధ్యత చేపడుతుంది. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (కెవిఐబి) సంస్థ రాష్ట్రస్థాయిలో ఈ పథకాన్ని పర్యవేక్షిస్తుంది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ (డిఐసి) దీనిని అమలు చేస్తుంది.
- గ్రామీణ, పట్టణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, సూక్ష్మ , చిన్న స్థాయి పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) అభివృద్ధికి సహకరించడం, గ్రామీణ ప్రజలను వ్యవసాయం కాకుండా ఇతర రంగాల్లోకి ఆకర్షించడం వంటివి ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు.
- ఉదాహరణకు గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకుడు ఒక ఫర్నిచర్ తయారీ యూనిట్ ప్రారంభించాలని అనుకుంటే, రూ.25 లక్షల ప్రాజెక్టు ఖర్చుతో పిఎంఇజిపి ద్వారా రుణం పొందవచ్చు. సబ్సిడీగా సుమారు రూ.6.25 లక్షలు (25 శాతం) లభిస్తాయి.
- ఒక మహిళా వ్యాపారవేత్త బ్యూటీ పార్లర్ లేదా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించాలని అనుకుంటే, రూ.10 లక్షల ప్రాజెక్టు మీద 30–35 శాతం సబ్సిడీ పొందవచ్చు.
- లబ్ధిదారులు తమ ప్రాజెక్టుల వివరాలను కెవిఐసి మొబైల్ యాప్ (KVIC Mobile App) ద్వారా కూడా ట్రాక్ చేసుకోవచ్చు.
- పథకం కింద సబ్సిడీని మూడు సంవత్సరాల తర్వాత మాత్రమే పూర్తిగా క్లెయిమ్ చేయవచ్చు.
- పిపిఎంఇజిపి ప్రాజెక్టులలో సుమారు 80 శాతం వరకు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నాయి.
- పిపిఎంఇజిపి పథకం అనేది నిరుద్యోగ యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి దిశగా కీలకమైన ప్రోత్సాహం. బ్యాంకుల ద్వారా రుణం, ప్రభుత్వ సబ్సిడీ, శిక్షణ, మార్కెటింగ్ సహాయం వంటి సమగ్ర మద్దతు ఈ పథకం ప్రత్యేకత. సరైన వ్యాపార ఆలోచన, సరైన ప్రణాళిక, మరియు శిక్షణతో పిపిఎంఇజిపి పథకం ద్వారా వ్యక్తిగత స్థాయిలో ఆర్థిక స్వావలంబన సాధించడం పూర్తిగా సాధ్యమే.

## దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన

# ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్

రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభలు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారతదేశానికి స్వాతంత్య్రం కావాలని ఏర్పడి విద్యార్థులను చైతన్యం చేసి పోరాడిన ఏకైకవిద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ అని దేశంలో 90 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర ఎఐఎస్‌ఎఫ్‌కు ఉందని. మోడీ ప్రభుత్వం మతంపేరుతో రాజకీయం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, అందాల పోటీలకు ఉన్న నిధులు, మెస్సీతో ఫుట్‌బాల్ ఆటపై ఉన్న శ్రద్ధ, వాటికి ఉన్న నిధులు విద్యార్థులకు ఎందుకు లేవని, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభ సందర్భంగా పట్టణంలో జూనియర్ కళాశాల గ్రౌండ్ నుండి కమాన్ చౌరస్తా మీదుగా ఎస్‌ఎస్ గార్డెన్స్ వరకు విద్యార్థి ప్రదర్శన ర్యాలీ నిర్వహించి అనంతరం ఎఐఎస్‌ఎఫ్ జెండాను మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్కపురి సూర్య ఆవిష్కరించారు. జిల్లా మహాసభ సాయి ఆజాద్ అధ్యక్షతన జరగగా మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్‌లు మాట్లాడుతూ.. దేశంలో మోడీ ప్రభుత్వం 11ఏళ్ల పాలనలో విద్యార్థులను విస్మరించిందని దేశంలో విద్య ప్రవేటీకరణ, కార్పొరేటీ కరణ, కాషాయికరణ చేయడానికి కుట్ర చేస్తుందని నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగ మొత్తం నిర్వీర్యం చేస్తున్నారని, పాఠ్యాంశాల్లో మతపరమైన అంశాలను చేస్తూ చరిత్రను తొలగించే ప్రయత్నం చేయడాన్నీ విద్యార్థులు తిప్పికొట్టాలని, విభజన హామీల ప్రకారం తెలంగాణకి పెద్దపల్లికి రావాల్సిన నవోదయ పాఠశాల ఏర్పాటు కాలేదని, బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లాపై వివక్ష చూపుతుందన్నారు. ఈ మహాసభలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, కోశాధికారి ఎల్కపల్లి సురేష్, కార్యవర్గ సభ్యులు మాతాంగి సాగర్, గుండ్లా లక్ష్మి ప్రసన్న, పల్లె హర్ష, సాయి అనుప్, సాయి తేజ, పూదరి సాయి, అభిషేక్, చైత్ర, మైథిలి, సాయి శరణ్య, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో నేడు దర్శనాలు బంద్

**ప్రజాపక్షం/ములుగు:** మేడారం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల దర్శనాలను బుధవారం నిలిపివేస్తున్నట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. మంగళవారం గద్దెల ఆవరణలో ఆయన మాట్లాడారు. గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెల ప్రతిష్టాపన కార్యక్రమాలతో పాటు గద్దెల విస్తరణ పనులు సాగుతున్నట్లు చెప్పారు. దీనితో ఒక్క రోజు అమ్మవార్ల దర్శనాలు నిలిపివేస్తున్నామని, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

**మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు**

ములుగు జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు కంబాల రవి మేడారం సమ్మక్క తల్లిని దర్శనం చేసుకున్న అనంతరం మంగళవారం జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించుటకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సిఎం ఒఎస్‌డి వేం నరేందర్ రెడ్డి, ఎంపి బలరాంనాయక్‌తో కలిసి మేడారం జాతర అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వం ఇంత శ్రద్ధ వహించి పని చేయలేదని ఈ సందర్భంగా వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# హత్య కేసులో 9 మందికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం గంగారం గ్రామంలో భూమి తగాదాల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో 9 మంది నిందితులకు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ న్యాయస్థానం, న్యాయమూర్తి సిహెచ్.రమేష్ బాబు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. ఏ1 లౌడియా మహంకాళి నాయక్, ఏ2 లౌడియా భాస్కర్ నాయక్, ఏ3 లౌడియా సర్దార్ నాయక్, ఏ4 లౌడియా బాపు, A5 కౌసల్య (భార్య మహంకాళి నాయక్) ఏ6 లౌడియా సారయ్య నాయక్, ఏ7 బాబు నాయక్, ఏ8 లౌడియా సమ్మయ్య, ఏ9 అజ్మీర రాజ్ కుమార్ లకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. కొంతకాలంగా భూమి తగాదాల విషయమై ఇరు వర్గాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా, 2021 జూన్ 19న ఉదయం 11 గంటల సమయంలో మాంజా నాయక్ తన కుమారులతో పత్తి చేనులో పనులు చేసుకుంటున్న సమయంలోపై నిందితులు గొడ్డళ్లు, కర్రలు పట్టుకుని కారం చల్లుతూ మాంజా నాయక్ అతని ఇద్దరు కుమారులు సారయ్య నాయక్, భాస్కర్ నాయక్లపై దాడి చేశారు. ఈ దాడిలో మాంజా నాయక్, అతని ఇద్దరు కుమారులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో కుమారుడు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హత్య కేసును పోలీసులు శాస్త్రీయంగా దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో, కోర్టు 9 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు 31000/ రూపాయలు జరిమానా విధించింది. ఈ కేసు దర్యాప్తులో అప్పటి డీఎస్పీ బోనాల కిషన్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సాంబమూర్తి, సిడిఒ కె.రమేష్, లైజనింగ్ ఆఫీసర్ జి.వెంకన్నలు కీలకంగా పని చేశారు. వారి సమర్థవంతమైన సేవలను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు. ఈ తీర్పుతో నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని, చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని పోలీసులు స్పష్టం చేశారు.






## వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించుకున్న

# మానసిక దివ్యాంగ పిల్లలు

ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులే స్వయంగా పేపర్ ప్లేట్లు, కొవ్వొత్తులు, సర్ఫ్, చాక్ పీస్, ఫినాయిల్ స్వయంగా తయారు చేస్తూ వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించుకుంటున్నారని కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల, తల్లిదండ్రులతో సమావేశం తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి కాలనీలోని పాఠశాల ఆవరణంలో ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ నగరంలో 1989లో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు అంతా కలిసి మానసిక దివ్యాంగుల పాఠశాలను ఏర్పాటు చేయడం కోసం సంకల్పించారని, 1990లో రిజిస్ట్రేషన్ చేసుకొని పాఠశాలను కరీంనగర్‌లో కొద్దికాలం నడిపారని అనంతరం 2005లో ఎల్ఎండి కాలనీలోని సొంత భవనాన్ని నిర్మించుకొని నిర్విరామంగా నడిపిస్తున్నామని, పాఠశాల ఏర్పాటు చేసి 35 సంవత్సరాలకు పైగా అవుతుందని, పాఠశాల నిర్వహణ కోసం, విద్యార్థుల సంరక్షణ కోసం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ఎంతోమంది దాతల సహకారంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనేకమంది ప్రజాప్రతినిధుల, అధికారుల సహాయ సహకారాలతో ఈ పాఠశాల నిర్వహించబడుతుందని, పిల్లల తల్లిదండ్రుల వద్ద నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా పాఠశాలను నిర్వహిస్తున్నామని, పిల్లల తల్లిదండ్రులే స్వచ్ఛందంగా పాఠశాల నిర్వహణ పిల్లల సంరక్షణ వారికి కావలసిన వస్తువుల రూపేనా తల్లిదండ్రులకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని వెంకటరెడ్డి తెలిపారు. మానసిక వైకల్యంతో ఉన్న విద్యార్థులు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నారని, వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారని, స్వయంగా విద్యార్థులే పేపర్ ప్లేట్లు, చాక్‌పీసులు, సబ్బులు, కొవ్వొత్తులు, ఫినాయిల్, సర్ఫ్ తయారు చేస్తున్నారని వెంకటరెడ్డి తెలిపారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ అధికారి మహేశ్వర్ మాట్లాడుతూ.. మానవ సమాజంలో ఎంతోమంది బ్రతుకుతున్నారని కానీ 'మానవసేవయే మాధవ సేవ'గా భావించి పనిచేస్తున్న వారంతా చిరకాలం గుర్తుండిపోతారని ఆ కోవకు చెందిన వ్యక్తి చాడ వెంకటరెడ్డి అని, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల కోసం ఒక పాఠశాల ఉండాలనే సంకల్పంతో, మానవత్వంతో ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులంతా కలిసి పాఠశాలను స్థాపిస్తే ఆ పాఠశాలను నిరంతరం కొనసాగించడానికి పాఠశాల ట్రస్ట్ చైర్మన్, సభ్యులు, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అధ్యాపకులు, సంరక్షిస్తున్న వారందరిని ఆర్డీవో ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి ట్రస్ట్ సభ్యులు జి.కొమురెల్లారెడ్డి, ఎస్.జనార్ధన్ రావు, జి.భగవాన్, జెవి.రమణా రెడ్డి, డి.మధుసూదన్ రావు, మహాత్మనగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, సర్పంచ్ కిషన్ రావు, సి.ఏ ఆదిత్యా, డిడబ్ల్యువో సరస్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఏ.వో బాల్ రాజు ఉపాధ్యాయ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యమే లక్ష్యం.. ప్రజాసేవే పరమావధి!

నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు మంత్రి అడ్లూరి, ఎంపి చామల దిశానిర్దేశం

గోశాల నుంచి లక్ష్మీనరసింహ గార్డెన్ వరకు కాంగ్రెస్ శ్రేణుల భారీ ప్రదర్శన



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాదులని, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో ఆలేరు నియోజకవర్గ స్థాయి సర్పంచ్లు, ఉప సర్పంచ్ల ఆత్మీయ సన్మాన సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు, ఎన్నికైన ప్రతినిధులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకండి. క్షేత్రస్థాయిలో ప్రజలకు అత్యంత అందుబాటులో ఉండేది మీరే. సమస్యల పరిష్కారంలో సర్పంచ్లు, ఉప సర్పంచ్లు సమన్వయంతో పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలి' అని సూచించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. 'ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా సంకల్పం. నిధుల కేటాయింపులో గానీ, అభివృద్ధి పనుల్లో గానీ ప్రతి గ్రామానికి నా పూర్తి సహకారం ఉంటుంది' అని హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పరిధిలోని గోశాల నుంచి వైకుంఠ ద్వారం మీదుగా మున్సిపల్ కార్యాలయం పోలీస్ స్టేషన్ తాసిల్దార్ కార్యాలయం మీదుగా ఫంక్షన్ హాల్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరసారపు యాదగిరి గౌడ్, బీర్ల శంకర్, కానుగు బాలరాజ్, మంగ సత్యనారాయణ, దుంబాల వెంకటరెడ్డి, సర్పంచ్ కళ్ళెం జహంగీర్ తదితరులు పాల్గొన్నారు



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## 29, 30 తేదీలలో గోవాకు ఆర్‌టిసి ప్రత్యేక బస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల డిపో నుండి మురుదేశ్వర్, గోకర్ణ, గోవా వంటి ప్రదేశాలకు రెండు ప్రత్యేక టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేసినట్లు సిరిసిల్ల ఆర్టీసి డిపో మేనేజర్ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మురుదేశ్వర్, గోకర్ణ, గోవా టూర్ కై ఈనెల 29న మధ్యాహ్నం 12 గంటలకు సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి బస్సు బయలుదేరి మురుదేశ్వర్, గోకర్ణ దేవాలయాల దర్శనం అనంతరం 31 నాడు గోవాకు చేరుకుంటుందని, అక్కడి నుండి బస్సు జనవరి 1న బయలుదేరి జనవరి 2 న సిరిసిల్లకు చేరుకుంటుందని తెలిపారు. దీనికిగాను పెద్దలకు రూ. 4000, పిల్లలకు 2800 చార్జీలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రెండవ టూర్ ప్యాకేజ్ లో భాగంగా ఈ నెల 30న మధ్యాహ్నం 12 గంటలకు సిరిసిల్ల కొత్త బస్టాండ్ నుండి డీలక్స్ బస్సు బయలుదేరి 31 నాడు గోవాకు చేరుకుంటుందన్నారు. అక్కడినుండి బస్సు తిరిగి జనవరి 2న బయలుదేరి జనవరి 3న సిరిసిల్లకు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తిగల ప్రయాణికులు 9063403778, 9959225929, 6304171291, 9154298576 ఎగువ తెలిపిన నంబర్లకు ఫోన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని కోరారు.

## సైబర్ నేరాలు, డిజిటల్ చెల్లింపులపై ఆర్‌బిఐ అవగాహన సదస్సు

ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**ప్రజాపక్షం/కరీంనగర్:** రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర హాలు నందు ఇబిఎఎటి (ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ మరియు ట్రైనింగ్) కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు, నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అవలంబిస్తున్న కొత్త కొత్త పద్ధతుల పట్ల పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే బాధితులకు త్వరితగతిన న్యాయం చేయగలమని సూచించారు. ఈ సదస్సులో క్రింది అంశాలపై కూలంకషంగా వివరించారు.

**సైబర్ మోసాలు**: ఇటీవల సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్ట్, లాటరీ స్కామ్‌లు మరియు అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరుగుతున్న నేరాలు.

సురక్షిత లావాదేవీలు: యూపిఐ, ఎన్ఈఎఫ్‌టి, ఆర్‌టిజిఎస్ మరియు ఐఎంపిఎస్ వంటి సేవలను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముఖ్యంగా యూపిఐ పిన్ భద్రత గురించి వివరించారు. అసలు నోట్లకు, నకిలీ నోట్లకు (ఫేక్ కరెన్సీ) మధ్య ఉండే తేడాలను ఎలా గుర్తించాలి. నోట్ రీఫండ్ నియమాల గురించి అవగాహన కల్పించారు.

**ఫిర్యాదుల విధానం:** డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవలను ఎలా పొందాలి అనే విషయాలను వివరించారు. నగదు రహిత లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు మరియు సైబర్ భద్రతా చిట్కాలను పోలీసు సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (అడ్మిన్) వెంకటరమణ, ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, వెంకటరమణ, కమీషనరేటుకు చెందిన ఎసిపిలు, ఇన్‌స్పెక్టరు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలలో నోబెల్ విద్యార్థులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జాతీయస్థాయి కరాటే పోటీలలో పెద్దకల్వలలోని నోబెల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ ఈ. మోహన్ రాజా తెలిపారు.ఆదివారం రోజున హనుమకొండలోని జకీరియా ఫంక్షన్ హాల్ లో బిఎమ్ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి జాతీయస్థాయి కరాటే అండర్ 14కటాస్ విభాగంలో శ్రీధర్మతేజ్,మనీష్ కృష్ణ, వెంకటేష్, శ్రీహన్,హర్షన్, వెంకటరమణ, జస్వంత్ , మహేష్ లు బంగారు వెండి కాస్య పథకాలు సాధించగా వీరిని నోబెల్ స్కూల్‌కరస్పాండెంట్ ఈ.మోహన్ రాజా,మాస్టర్ కర్ర వెంకటేష్ ,ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

## కొత్తూరు రాజమ్మకు సిపిఐ నాయకులు నివాళులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) అనుబంధ జాతీయ మహిళా సమాఖ్య రామగుండం నగర సమితి ఉపాధ్యక్షురాలు కొత్తూరు రాజమ్మ ఆకస్మిక మరణం పట్ల సిపిఐ నగర సమితి నివాళులు అర్పించడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ శ్రేణులు వారి ఇంటికి వెళ్ళి రాజమ్మ పార్థీవ దేహం పై పార్టీ పతాకాన్ని కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజమ్మ మరణం పార్టీ కి మహిళా సమాఖ్య కు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్, ఎర్రల రాజయ్య, పడాల కనకరాజు, గంగారపు చంద్రయ్య, దుబాసి రేణుక, భాగ్యలక్ష్మి , నర్మద, ఆసాల నవీన్ తదితరులు ఉన్నారు.

## రైతులు నాణ్యమైన ఉత్పత్తులతో ఎగుమతులు చేపట్టి ఆదాయం పొందొచ్చు

జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) కార్యక్రమంలో మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు మాజీ ప్రధాని చరణ్ సింగ్ చిత్ర పటానికి పూలు సమర్పించి ఘన నివాళులు అర్పించడం జరిగింది.జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వకాలపు సంప్రదాయ నత్రజనినీ మనం వాడడం మర్చిపోయాం రైతు కుటుంబం నుండి వచ్చిన సీఎం రైతు పక్షపాతి. ఆధునిక టెక్నాలజీ వాడడం, ఆన్లైన్ లో వ్యవసాయ పద్ధతులు పాటించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవడం మంచిది.తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా రావడం జరిగింది అని కొందరు ఉద్దేశ పూర్వకంగాఅసత్య ప్రచారాలు చేయటం వల్ల కొందరు రైతులు ముందస్తు యూరియా నిల్వ చేసుకోవడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ హరీష్ కుమార్ శర్మ, డీన్ భారతి, జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, శాస్త్ర వేత్తలు, పోలాస సర్పంచ్ శంకరయ్య, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి మహేశ్వర్ రావు, కట్ట రాజేందర్, సురేందర్ నాయక్, చిర్ర నరేష్, ములసపు మహేష్, దమ్మ సురేందర్ రెడ్డి, దనేశ్వర్ రావు, రాజేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మహేష్, హరీష్, గంగారెడ్డి, రామ్ రెడ్డి, మల్లేశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని మతాల అభివృద్ధికి
# కాంగ్రెస్ కట్టుబడి ఉంది

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం :** క్రీస్తు బోధనలు మానవాళి శాంతికి మూలకారకాలని, యేసుక్రీస్తు ప్రేమ త్యాగం గొప్పవని ఆయన బోధనలు అందరూ అనుసరించదగినవని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మంథని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాల వారి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పరమత సహనం పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ముందస్తుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. శాంతి, జాలి, కరుణ, దయ, ప్రేమ త్యాగం వంటి పదాలకు నిదర్శనం క్రీస్తు అని ఆయన తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రతి ఒక్కరు పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. యేసు క్రీస్తు జన్మ పవిత్రమైనదని, క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, సీయోను ప్రార్థన మంది రం పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అ జ్మీరా దయారాజు, కలువల శామ్యూల్, సంఘ పెద్దలు ఎంకే జోసఫ్, రామగిరి కుమార్, అందే రమేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిని ప్రేమించాలి, భగవంతుడు అందరికి ఒక్కడే : మంత్రి పొన్నం



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :**శాంతిని ప్రేమించాలని ఏసుక్రిస్తు బోదించారని మనం అందరం శాంతియుతంగా ఉంటు కలిసి మెలసి ఉండాలని ఏసు క్రిస్తు జన్మదినం సందర్భంగా వేడుకలను జరుపుకుంటున్నట్లు తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్న ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని నియోజకస్థాయి క్రిస్ మస్ వేడుకలను లక్ష్మి గార్డెన్‌లో ప్రభుత్వ నిర్వహించగా అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం క్రైస్తవవుల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. నేను స్వయంగా హైద్రాబాద్‌లో ముఖ్యమంత్రితో కలిసి క్రిస్ మస్ వేడుకల్లో పాల్గొనడం జరిగిందని అన్నారు. పట్టణంలో క్రైస్త కమ్యూనిటి హాల్‌కు స్థలం చూపించడం జరుగుతుందని భవన నిర్మాణం కోసం రూ.25 లక్షల నిధులు కేటాయిస్తామఅన్నారు. ఈ కార్యాక్రమమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ అహ్మద్, గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమీటి చైర్మెన్ తిరుపతిరెడ్డి ,సహకార సంఘం చైర్మెన్ శివయ్య, అర్‌డివో రాంమూర్తి, ఎంఅర్‌ఓ లక్ష్మ రెడ్డి, మతత పెద్దలు తదితరులు పాల్గోన్నారు.

## తిరుమల మెట్ల మార్గంలో భక్తుల భద్రత ప్రశ్నార్థకం

పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రపంచంలోనే అత్యంత భక్తి గల తిరుమల తిరుపతి దేవస్థానంలో మెట్ల మార్గం భక్తుల భద్రతపై ప్రశ్నార్థకంగా మారిందని పెద్దపల్లి ఎంపి గడ్డ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం కాకా వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి ఏడుకొండల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సందర్భంగా, తిరుమల మెట్ల మార్గంలో నెలకొన్న దయనీయ పరిస్థితులపై వంశీకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితో మెట్ల మార్గం ద్వారా కొండ లెక్కుతున్న సమయంలో అక్కడ ఏర్పడిన పరిస్థితులు తన మనసును తీవ్రంగా కలచివేశాయని ఆయ న తెలిపారు. ప్రస్తుతం ఏడుకొండల మెట్ల మార్గం అత్యంత నిర్లక్ష్యానికి గురైందని, మెట్ల దారి పొడవునా ప్లాస్టిక్ వ్యర్థాలు, కన్‌స్ట్రక్షన్ వేస్ట్ పేరుకుపోయి ఉండటం వల్ల భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, టాయిలెట్ ఇన్నోవేషన్ల పేరుతో ఏర్పాటు చేసిన కమోడ్లు, మెట్ల మధ్యలో పెట్టిన స్టీల్ ట్రేల కారణంగా భక్తులు సరిగా నడవలేని ప్రమాదకర పరిస్థితి నెలకొంద ని, కాళ్లకు గాయాలయ్యే అవకాశం అధికంగా ఉందని తెలిపా రు. కనీసం ఫస్ట్‌ఎయిడ్ కేంద్రాలు కూడా మెట్ల మార్గంలో అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన కార్మిక వర్గం

యాజమాన్యం వైఖరిపై మండిపడ్డ మడ్డి ఎల్లాగౌడ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తూతూ మంత్రంగా జరిపెందుకు నిధులను కుదించడం పై యాజమాన్య వైఖరి పై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ మండిపడ్డారు. మంగళవారం అర్జీ వన్ ఏరియా లోని గనులు డిపార్ట్మెంట్, ఓసిపి లలో గుర్తింపు సంఘం ఏఐటియుసి పిలుపు మేరకు బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మరియు పిట్ కార్యదర్శులు కార్మికుల కు నల్ల బ్యాడ్జీలు పెట్టి ఆవిర్భావ దినోత్సవ వేడుకల పై సింగరేణి యాజమాన్యం తీరుపై నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ లో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ ఐన కన్నతల్లి లాంటి సింగరేణి ఆవిర్భావ దినోత్సవం రోజున వేడుకలు చేయలేని దుస్థితిలో యాజమాన్యం ఉండడం బాధాకరమని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. సింగరేణి లో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఆవిర్భావ దినోత్సవం చేయకపోవడం 135 ఏళ్ళ చరిత్రలో మొదటిసారని ఆయన అన్నారు. సంస్థలో డబ్బులు లేవని సాకు చూపుతూ, నిరుత్సాహంతో, సింగరేణి యాజమాన్యం సంస్థ యొక్క ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించక పోవడం కేవలం జి.ఎం కార్యాలయాల వరకే పరిమితం చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. ఈ నిరసన కార్యక్రమం లో భాగంగా శ్రీఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం జిడికె 11వ ఇంక్లైన్ లో, జిడికె 2వ ఇంక్లైన్ లో సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఓసిపి 5 లో బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సిద్దమల్ల రాజు లు మాట్లాడగా, ఇంకా ఈ నిరసన కార్యక్రమం లో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ మరియు పిట్ కార్యదర్శులు సిర్ర మల్లికార్జున్, మిట్ట శంకర్ , బోగ సతీష్ బాబు, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, దొంత సాయన్న, బుడిమె సమ్మయ్య, రెడ్డి వెంకట స్వామి, ఇజ్జగిరి రాజు, దాసరి శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, దాసరి అనిల్, వేముల అశోక్, గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్, పొన్నం రంజిత్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థ బలోపేతం

రాజన్న సిరిసిల్ల జిల్లా వార్షిక నివేదికలో
జిల్లా ఎస్పి మహేష్ బి.గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యార్థినీ,విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటుగా జిల్లాలో అవగాహనా ర్యాలీలు నిర్వహించామని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే వార్షిక ప్రణాళికలో పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పోలీసుల స్నేహపూర్వక విధానం మరియు పోలీసుల పారదర్శక పనితీరు విధానం వలన ప్రజలలో పోలీసులపై విశ్వాసం పెరిగిందనీ జిల్లాలో గ్రామస్థాయిలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థ బలోపేతం చేసి శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మహిళల రక్షణే ధ్యేయంగాజిల్లాలో మహిళల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతూ జిల్లా షీటీం విద్యసంస్థలలో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ఏర్పాటు చేసి అవగాహనా కార్యక్రమాల ద్వారా మహిళల్లో,విద్యార్థుల్లో ఆత్మస్థైర్యా న్ని పెంపొందించం జరిగింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు సైతం పూర్తి స్థాయిలో పోలీస్ సేవలు విస్తరించాలనే ఉద్దేశ్యంతో జిల్లా పోలీస్ కార్యాలయంలోగ్రీవెన్స్ డే, మెసేజ్ యువర్ ఎస్పీ లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. 2025 సంవత్సరంలో జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామపంచాయితి ఎన్నికలు విజయవంతం చేయడం జరిగింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం నేరాలు (14.03%), రోడ్డు ప్రమాదాల సంఖ్య 13.94% తగ్గడం జరిగింది.షీ టీమ్ భరోసా సిబ్బంది పాఠశాలలు, కళాశాలలు మరియు మహిళలు పనిచేసే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వలన బాధితులు ముందుకు వచ్చి సంబంధిత నిందితులపై ఫిర్యాదులు చేయడంతో, ఈ సంవత్సరంలో కేసుల సంఖ్య పెరిగింది.. డయల్100 కాల్ ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంనుండైనా నేర సమాచారం అందుకున్న 5 నిమిషాల వ్యవధిలో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించడం జరుగుతుంది. గల్ఫ్ ఛీటింగ్ కేసులు: గల్ఫ్ కు పంపిస్తానని మోసం చేసిన 38 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్ట్ చేయడం జరిగింది. 2025 సంవత్సరంలో గంజాయి నిందితులపై 02 హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయడం జరిగింది. ఆంటీ డ్రగ్ క్లబ్స్ మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్ విద్యా సంస్థలు, బస్టాండ్ లు, మహిళలు పని చేసే ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో నిరంతరం పోకిరీలపై నిఘా ఉంచుతూ మహిళా చట్టాలపై వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. గ్రామపంచాయతి ఎన్నికలు మూడు విడుతలో జరుగగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్సిడెంట్ ఫ్రీ అండ్ ఫెయిర్ గా అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేశాం ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి చంద్రయ్య, డి.ఎస్.పి నాగేంద్ర చారి ఉన్నారు.



## కస్తూరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొత్తగా ఈ సంవత్సరం ప్లే స్కూల్ ఎంపిక చేసిన పిల్లలను ఆడుకోవటానికి అందించిన ఆట వస్తువులను ఏలా ఉన్నాయి ? పిల్లలు బాగ ఆడుకుంటున్నారా ? అని పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. అన్ని ఆట వస్తువులతో పిల్లలను ఆడించాలన్నారు. వస్తువుల నాణ్యత గురించి ప్రిన్సిపల్‌తో ఆరా తీశారు. పిల్లలు చాల బాగ ఆడుకుంటున్నారని, తినటం సైతం తరగతి గదిలోనే తింటున్నారని కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాల ప్రాంగణం అంతా కలియతిరిగారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదరకంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. వంట గదికి ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. అన్నం, పాలకూర పప్పు చేసినట్లు వంట గది సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. రోజు కామన్ డైట్, మెనుప్రకారం తప్పనిసరిగా పాటించాల్సిన పిల్లలకు రుచికరంగా వండాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలకు పిల్లలు వెళ్లకుండ గ్రామస్తులతో ఒప్పించి పాఠశాల వాతావరణం కార్పొరేట్ స్థాయిగా తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డిని అభినందించారు. ఆలాగే పాఠశాలను మరింత అభివృద్ధిలోకి తేవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలకు ఆదనపు గదులు తేవాలని అడగ్గా తప్పకుండ మంజూరు చేయిస్తానని కలెక్టర్ హామీనిచ్చారు.

## 25 నుంచి కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

33 జిల్లాల నుంచి సుమారు
1200 మంది క్రీడాకారులు రాక



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియం హాకీ మైదానంలో ఈనెల 25 నుంచి 28 వరకు 72వ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం చీఫ్ పాటర్న్ పారామిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఈ ప్రసాద్ రావు తెలిపారు. మంగళవారం మంకమ్మ తోటలోని పారమిత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కరీంనగర్ వేదికగా 17 సంవత్సరాల అనంతరం కబడ్డీలో రాష్ట్ర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. తెలంగాణలోని 33జిల్లాల నుంచి క్రీడాకారులు రాలున్నట్లు పేర్కొన్నారు. 1200 మంది క్రీడాకారులు 100మంది రెఫరీలు, 40మంది కబడి సంఘం బాధ్యులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఏషియన్ గేమ్స్‌లో కబడ్డీ ఉండగా ఒలంపిక్‌లాంటి మెగా పోటీలకు కూడా భవిష్యత్తులో కబడ్డీ క్రీడ ఎంపిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో కబడ్డీ క్రీడను ప్రోత్సహించడానికి రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు డాక్టర్ అమిత్ కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు అట్టహాసంగా కబడ్డీ పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు ఆస్ట్రో టర్ఫ్ మైదానాలపై పోటీలు జరుగుతాయని, లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు బుధవారంతో పూర్తి కానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు సిహెచ్ సంపత్ రావు మాట్లాడుతూ 25న సాయంత్రం నాలుగు గంటలకు జరిగే పోటీల ప్రారంభోత్సవానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో పాటు శాసనసభ్యులు గంగుల కమలాకర్ , మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ అలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లు హాజరుకారునట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ముగింపు వేడుకలకు కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరు అవుతారని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి మల్లేష్ గౌడ్, పారామిత విద్యాసంస్థల డైరెక్టర్ అనుకర్ రావు, కబడ్డీ సంఘం కోశాధికారి కే.శ్రీనివాస తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్:** రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌టిసి, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు. జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అతికించాలని సూచించారు. జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రైతులకు సన్మానం..



**ప్రజాపక్షం/బైంసా :**బైంసా పట్టణంలో గణేష్ నగర్ లో అంతర్జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రాము ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు ఘనంగా సన్మానించడం జరిగినది.ఈ కార్యక్రమంలో రైతు సోదరులు తోటముత్తన్న..పెరుగు బాబు తిప్పల అశోక్ సుదర్శన్..సాయినాధ్ రాజు.నరసయ్య,తుమ్మల సాయి.చిన్న పాడి శంకర్,పబ్బం ధర్మపురి.రైతు సోదరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆవిర్భావ వేడుకలకు నిధులివ్వకపోవడంపై నిరసన



**ప్రజాపక్షం/కాసిపేట:**సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి నిధులు కేటాయించకుండా యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎఐటియుసి పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీ నారాయణ ఎన్నో సంవత్సరాలుగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునే సంప్రదాయం ఉందని, ఈసారి యాజమాన్యం సరైన నిధులు కేటాయించకుండా కార్మికులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఇటీవల మెస్సీతో మ్యాచ్ నిర్వహణకు సింగరేణి నిధుల నుంచి పది కోట్లు ఖర్చు చేయడం, సింగరేణేతర కార్యక్రమాలకు నిధులు దుర్వినియోగం చేయడం దురదృష్టకరమన్నారు. సంస్థకు ప్రతిష్ఠాత్మకమైన ఆవిర్భావ దినోత్సవానికి నిధులు ఇవ్వకపోవడం కార్మికుల పట్ల యాజమాన్య వైఖరిని స్పష్టంగా చూపుతోందని విమర్శించారు. యాజమాన్యం వెంటనే తన ధోరణి మార్చుకుని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ మల్లేష్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు రాజేందర్, సురేష్, వర్కమెన్ ఇన్స్పెక్టర్లు రంజిత్, అశోక్, గణేష్, మహేష్, శ్రీనివాస్, రవీందర్, ఆంజనేయులు, శంకర్, రాజన్న, లక్ష్మ ణ్, మహేష్, టిబిజికెఎస్ పిట్ సెక్రటరీ బైరి శంకర్, అఫ్జల్, రమేష్, సంపత్, కార్మికులు పాల్గొన్నా రు.

## సీలింగ్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** కేంద్ర ప్రభుత్వం 50 శాతం సీలింగ్ రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తు జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. గత 40 సంవత్సరాలుగా ఉద్యమాలు నడుస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు 50 రిజర్వేషన్ల దాటవద్దని తీర్పును బూచిగా చూపిస్తుందని ఆరోపించారు. సుప్రీంకోర్టు నలుగురు జడ్జిలు తీసుకున్న నిర్ణయం మాత్రమే అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్లతో 50 శాతం సీలింగ్ దాటిందని కానీ దానికి ఏ సీలింగ్ అడ్డురాదని పేర్కొన్నారు. వెంటనే కేంద్రం చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చే యాలని డిమాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ని ర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గు మ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు గజ్జల్లి వెంకటయ్య, నాయకులు శాఖపూరి బీమ్ సేన్, చంద్రగిరి చంద్రమౌళి, సతీష్, రామగిరి రాజన్న, ధర్మాజి మల్లేష్ , చెలిమెల అంజయ్య, వేముల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికే క్రికెట్ టోర్నీ

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రతి సంవత్సరం యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి రఘునాథ్ వెరబెల్లి పౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నిని నిర్వహిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంగళశారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భారత రత్న స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పెయి జయంతిని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంటును బ్యాటింగ్ చేసి ఆరంభించారు. అంతకు ముందు ఈ టోర్నిలో పాల్గొన్న జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉద్దేశించి మాట్లాడారు. అటల్ బిహారి వాజపేయిని స్ఫూర్తిగా తీసుకుని యువతను క్రీడలలో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్ర మోదిపిలుపు మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఈ టోర్నిని నిర్వహిస్తున్నట్లు వివరించారు. నేటి యువత చెడు వ్యవసనాలకు అలవాటు కాకుండా జీవిత లక్ష్యంపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. వాజపేయి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముఖేష్‌గౌడ్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బియ్యాల సతీష్‌రావు, బెల్లంకొండ మురళి, శ్రీనివాస్, రాజమౌళి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:**కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు ఈ సమ్మెకు దిగారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ విభాగాల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సుమారు 180 మంది కార్మికులు ఈ రిలే సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ సమ్మెకు బిఆర్ఎస్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి జాకీర్ షరీఫ్‌తో పాటు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎండి జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొనప్ప ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కార్మికులకు సంఘీభావం ప్రకటించామని తెలిపారు. ప్రభుత్వం ప్రతీ నెలా వేతనాలు చెల్లించేందుకు గ్రీన్ ఛానల్ ప్రతిపాదన ఉన్నప్పటికీ అది అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు తమ నాయకుడు కొనప్ప కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరిసింగుల జయచందర్, వసీం, వాణమాల రాము, నియాజుద్దీన్ బాబా, శివప్రసాద్, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం

నితియోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రత్యేక అధికారి శిల్పా రావు



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్:**నిర్మల్ జిల్లా పెంబి మండలంలో నితియోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని నితియోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రత్యేక అధికారి శిల్పా రావు అన్నారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ అమలు తీరుపై ఆమె జిల్లా కలెక్టర్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్య,వైద్యం,బ్యా ంకిం గ్, పోస్టల్‌సేవలు,పోషకాహారం,త్రాగునీరు,ఇతర మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.వివిధ శాఖల అధికారులు పెంబి మండలంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.పెంబి మండల ప్రజలు సమగ్ర అభివృద్ధి కోసం అధికారుల సమన్వయంతో కృషి చేయాలని ఆమె సూచించారు.ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని పెంబి బ్లాక్ లో అధికారులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు.భవిష్యత్తులో మరింత కృషి చేసి అన్ని రంగాల్లో పెంబిబ్లాక్ ను అభివృద్ధి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని ఆమె భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,నితియోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమాన్ని పెంబి బ్లాక్‌లో విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించడం గర్వకారణమన్నారు.ప్రజల భాగస్వామ్యం,అధికారుల అంకిత భావంతో ఈ కార్యక్రమ పెండిలో విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు.అన్ని విభాగాల్లో పెండి బ్లాక్‌ను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.సమీక్షా సమావేశానికి ముందు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు కలెక్టర్ ఛాంబర్‌లో పూల మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్,వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్,జిల్లా విద్యాశాఖ అధికారి అంబాజీ,డిఆర్‌డిఒ,జెడ్‌పిసిఇఒ శంకర్,పశువైద్య శాఖ అధికారి బాలిక్ అహ్మద్,ఎల్‌డి ఎ ంరామ్‌గోపాల్‌తో పాటు ఇతర అధికారులు,సిబ్బంది పా ల్గొన్నారు.

## భూభారతి పెండింగ్ దరఖాస్తులకు సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలపై తహసీల్దార్, ఆర్ఐ, ఇతర అధికారులతో సమీక్షించారు. దరఖాస్తులను పరిష్కరించే విషయమై నెలకొన్న ఇబ్బందులు, సాంకేతిక కారణాలపై రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకరాగా వాటిని నివృత్తి చేస్తూ దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై కలెక్టర్ సూచనలు చేశారు. భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూ హక్కులు కల్పించి సాంత్వన చేకూర్చాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరేలా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన ప్రతి అర్జీదారుడి దరఖాస్తును పరిశీలిస్తూ పరిష్కరించేందుకు అవకాశమున్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ తగిన న్యాయంజరిగేలా మానవీయ కోణంలో పని చేయాలన్నారు. అర్హులైన వారిని పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సకాలంలో వారికి భూములపై హక్కులు కల్పించాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులైన రైతులతో కూడా కలెక్టర్ ముఖాముఖిగా భేటీ అయి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికి భూభారతి చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ తప్పనిసరిగా భూములపై హక్కులు కల్పిస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ రవికుమార్, తహసీల్దార్ కిరణ్మయి, అధికారులున్నారు.

## వేగవంతంగా నిర్మాణ పనులు



**ప్రజాపక్షం/ కాసిపేట/ నస్పూర్:**ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. విద్యాలయంలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మండలంలోని దేవాపూర్ లోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను గుత్తేదారుల సమన్వయంతో వేగవంతం చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నెలలతరబడి రాని గ్యాస్ సబ్సిడీలు

అయోమయంలో లబ్ధిదారులు
పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీలు.. అధికారులు..



**ప్రజాపక్షం / నందిపేట్ :**అర్హులైన గ్యాస్ వినియోగదారులకు, శాసనసభ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తాము సబ్సిడి ఇస్తున్నామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కాని డబ్బులు రావడం లేదని వినియోగదారులు మొత్తుకుంటున్నారు. ఏజెన్సీలు తమకు ఏమి తెలియదని అంత మండల అధికారులకే తెలియాలని చేతులు ఎత్తివేస్తుంది. మండలం చుట్టు లబ్ధిదారులు తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదని మహిళలు అంటున్నారు.ఒకటి రెండు నెలలు మాత్రమే గ్యాస్ బండపై రూ. 500 సబ్సిడి ఇచ్చింది. సుమారు నాలుగైదు నెలల నుంచి సబ్సిడి రావడం లేదు. కారణాలు తెలియటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు గ్యారంటీలను నెరవేరుస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. చాలా మంది వినియోగదారులు అసలు సబ్సిడి గురించి అటు మండల ఆఫీస్ చుట్టు, ఇంకోవైపు గ్యాస్ ఏజెన్సీ చుట్టు తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. ప్రభుత్వం సబ్సిడి విడుదల చేస్తే ఎటుపోతున్నాయి. దీని గురించి ఎవరు పట్టించుకోకపోవడం విచారకరం. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు పడకుంటే గ్యాస్ ఏజెన్సీ ఖాతాలో పడుతున్నాయా తెలియాలి. ఈ వైపు అధికారులు ఆలోచించాలి. లేదా ప్రభుత్వం ఈ విషయం స్పష్టం చేయాలి. లేదా సబ్సిడి మంజూరు చేస్తే ఆ డబ్బులు గ్యాస్ వినియోగదారులకు అందకుండా ఎటుపోతున్నాయో చెప్పాలని అందరు అంటున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క గ్యాస్ బండకు కేవలం రూ. 47 సబ్సిడి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. ఇదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బ్యాంకుఖాతాలో డబ్బులు జమ చేయడం లేదు పేరుకే గ్యాస్‌బండకు సబ్సిడి ఇస్తామని ప్రభుత్వం చెబుతుందని లబ్ధిదారులు అంటున్నారు.ఈవిషయంలో జిల్లా కలెక్టర్ స్పంది ంచి ఎక్కడ లోపం ఉందో సరిదిద్దాలని అంటున్నారు.

## ఓడిపోతే కుంగిపోవద్దు...గెలిస్తే పొంగిపోవద్దు

ఆత్మీయ సన్మాన సభలో మెదక్ ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :**ఎన్నికలు ఏవైనా గెలుపు ఓటములు సహజమని, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు కుంగిపోకుండా, ఓటమిని సవాల్ గా తీసుకొని ముందుకు సాగాలని రానున్న రోజుల్లో అంతామంచే జరుగుతుందని, గెలుపొందిన అభ్యర్థులు పొంగిపోకుండా ఎంత ఎదిగిన ఒదిగిఉండాలని, ప్రజలతో మమేకమై గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు కృషి చేయాలని మెదక్ ఎంపి రఘునందన్ రావు దిశానిర్దేశం చేశారు. మంగళవారం సాయి బాలాజీ గార్డెన్ లో ఎన్నికల్లో మెదక్ జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన సభను బిజెపిజిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొన్న జరిగిన ఎన్నికల్లో మెదక్ జిల్లాలో కాషాయం జండా సత్తా చాటిందన్నారు. సిద్దిపేట, గజ్వేల్ హుస్నాబాద్ లో సైతం బిజెపి అభ్యర్థులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులుగా ఎన్నికయ్యారని వివరించారు. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఓటమిని మెట్లుగా మలుచుకొని పని చేయాలన్నారు. గెలిచిన అభ్యర్థులు దేవుడిచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మంచి పాలనందించాలన్నారు. మొన్నటి వరకు మెదక్ ఎంపీ ఒక్కడే ఉండేవాడని ఇప్పుడు గ్రామ, గ్రామాన బిజెపి నుంచి ప్రజా ప్రతినిధులు తయారవుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. త్వరలో కాంగ్రెస్ పాలనకు చరమ గీతం పాడుతామని, రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలేది ఒక బిజెపి పార్టీనే అన్నారు. నరేంద్ర మోదీని బిజెపి పార్టీని కెసిఆర్ విమర్శిస్తే ఫాం హౌస్ కె పరిమితం చేస్తామని రఘునందన్ రావు హెచ్చరించారు. మెదక్ జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులను ఎంపిసత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఇన్‌చార్జి నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు నాయని ప్రసాద్, శ్రీనివాస్, రాగి రాములు, ఎంఎల్ఎన్ రెడ్డి, పంజా విజయ్ కుమార్, రంజిత్ రెడ్డి, గడ్డం కాశీనాథ్, విజయ్ కుమార్, శివతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మీ డబ్బు - మీ హక్కు: కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**ప్రజలు మీ డబ్బుమీ హక్కు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, ఖాతాదారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పది సంవత్సరాల కంటే పైగా బ్యాంకులలో ఖాతాలు కలిగి ఉండి నేటి వరకు డబ్బు క్లెయిమ్ చేసుకోని వారి కోసం ఈ నెల 1వ తేదీ నుండి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 65 వేల ఖాతాలు ఇలాంటివి ఉన్నాయని, ఈ ఖాతాలలో 15 కోట్ల 76 లక్షల రూపాయలు జమ కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నెల 12వ తేదీ వరకు 254 ఖాతాల వారు ఒక కోటి 34 లక్షల రూపాయలు క్లెయిమ్ చేసుకున్నారని, జిల్లాలోని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో సర్పంచులను సమన్వయం చేసుకోవాలని, బ్యాంకులు గ్రామాల వారీగా క్లెయిమ్ చేసుకోని వారి వివరాలతో జాబితా తయారుచేసి అందించాలని తెలిపారు. అధికారులు, మెప్మా, సెర్ప్, స్వయం సహాయక సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా క్లెయిమ్ చేసుకున్న వారికి ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలసూచికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం వీరభద్రుడు, మంచిర్యాల, ఆదిలాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్లు, బ్యాంకు మేనేజర్లు, ఐకెపి, మెప్మా సిసిలు, ఏపిఎంలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిలువు దోపిడీ

**ప్రజాపక్షం / చెన్నూరు:**చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామ వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను నిలువునా దోచుకుంటున్నారని, తరుగు పేరిట అధిక తూకం వేస్తూ అన్నదాతల నడ్డి విరుస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలోని పాక్స్ సెంటరుతో పాటు ఐకెపి నిర్వాహకులు తూకం వేసే క్రమంలో రెండు నుండి మూడు కిలోల వరకు అధికంగా వడ్ల తూకం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. దోచుకున్న వడ్లను అధికారుల సహకారంతో ఇతరుల పేరున మళ్ళీస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోగా అలుసుగా తీసుకున్న పాక్స్, ఐకెపి సెంటర్ల నిర్వాహకులు వారి తరహాలోనే రైతులను దోచుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో జరిగే అక్రమాల్లో అధికారుల హస్తం సైతం ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. నిర్వాహకులు అధికారులను మచ్చిక చేసుకొని అధిక తూకం వేసిన మిగులు వడ్లను గ్రామంతో సంబంధం లేని వారి పేరున కొనుగోలు చేసినట్లు ఆధారాలు సృష్టిస్తున్నారని తెలిపారు.ఎఇఒ మొదలుకొని సివిల్ సప్లై జిల్లా అధికారులు మామూళ్లు తీసుకుంటూ రైతులను దోచుకుంటున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడెంకి చందు మాట్లాడుతూ రైతుల పట్ల దోపిడీ వ్యవస్థ రోజు రోజుకూ పెరిగిపోతుందన్నారు. ఇటీవలే దుగ్నేపల్లిలోని డిసిఎంఎస్ సెంటర్లో భారీ అవకతవకలు వెలుగు చూసినా అధికారులు కేవలం సెంటరును రద్దు చేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అక్రమాలపై దృష్టి సారిస్తే దోపిడీ వ్యవస్థ సమూలంగా కనుమరుగవుతుందని తెలిపారు.

## రైతు బాగుపడితేనే రాజ్యం బాగు

**ప్రజాపక్షం/కుంటాల:**దేశానికి అన్నం పెట్టే రైతన్న బాగుపడినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కుంటాల సర్పంచ్ జక్కుల గంజేధర్ అన్నారు.మంగళవారం స్థానిక కుంటాల మున్నూరు కాపుసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు జాతీయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు..దేశానికి వెన్నెముకగా నిలుస్తూ ఆరుగాలం శ్రమిస్తూ దేశ పౌరులకు మూడుపూటలు అన్నం పె ట్టే రైతన్న ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రైతుకు పాలక ప్రభుత్వాలు వెన్ను దన్నుగా నిలిచి మరింత ముందుకు తీసుకు వెళ్లాల్సిన ఆవసరం ఎంతైనా ఉందని అన్నారు.అంతకుముందు మున్నూరు కావు సంఘ భవనంలో రై తు విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు.పాడి పంటలు బాగా పండాలని రైతు కుటుంబాలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో విరసిల్లాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మునురుకాపు ప్రజా ప్రతినిధులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.సర్పంచ్ జక్కుల గజేంధర్,ఉప సర్పంచ్ పరికిపండ్ల వెంకటరమణ,వార్డు సభ్యులు బోనగిరి రాకేష్,జుట్టు అభిషేక్ కుమార్,సుద్దపు ముత్యం లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తోతట రాఘువేంధర్,ప్రధాన కార్యదర్శి,మాగామా నాగ రాజు,కోశాధికారి సిపతి వివేకానంద్,కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల నరేంధర్,సబ్బిడి గజేంధర్,సబ్బిడి రాకేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లీక్

## 'డైమండ్ డిపాజిట్' టీజర్ లాంచ్



'డైమండ్ డెలాయిట్' సినిమా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా టీజర్ రిలీజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హీరో పార్థ గోపాల్ మాట్లాడుతూ నేను మా డైరెక్టర్ సూర్య జియాదవ్ గత మూడు సంవత్సరాలనుండి జర్నీ చేస్తూ చాలా ఒడి దుడుకులు ఎదుర్కొని చిత్రాన్ని తెర కెక్కించినాము. మా అందరి సమక్షంలో టీజర్ రిలీజ్ చేయటం చాలా ఆనందంగా ఉంది. డైమండ్ డెలాయిట్ ఒక ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా 2026 ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం అని అన్నారు. హీరోయిన్ మేఘన మాట్లాడుతూ ఈ సినిమాని చాలా కష్ట పడి పనిచేసాము. ముఖ్యంగా మా డైరెక్టర్, హీరో, ప్రొడ్యూసర్ పార్థ గోపాల్ అందరం కష్ట పడి పనిచేసాము చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, డైరెక్టర్ సూర్య జి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏదో ఏదో' పాట ఆవిష్కరణ



'లూసియా' ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. ఈ సినిమాని వృద్ధి క్రియేషన్స్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ మూవీకి వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడీగా 'కాంతార', 'తమ్ముడు' ఫేమ్ సప్తమి గౌడ నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, తాజాగా రిలీజ్ చేసిన పవర్ ఫుల్ సాంగ్ 'వినరా మాదేవ' అంద రినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా ప్రేమ జంటను కట్టిపడేసేందుకు ఓ మంచి రొమాంటిక్ మెలోడీతో టీం ముందుకు వచ్చింది. తాజాగా 'ది రైజ్ ఆఫ్ అశోక' నుంచి 'ఏదో ఏదో' అంటూ సాగే యూత్‌ఫుల్ గీతాన్ని విడుదల చేశారు. 'ఏదో ఏదో' అనే ఈ పాటను జయచంద్ర జెడి. రచించారు. సాయి చరణ్, ఎం.డి. పల్లవి గాత్రం ఈ పాటను గుండెకు హత్తుకునేలా చేసింది. పూర్వచంద్ర తేజస్వి ఇచ్చిన బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. సంతు మ్యాగర్ కొరియోగ్రఫీ ఎంతో సింపుల్‌గా, చాలా ఎఫెక్టివ్‌గా కనిపిస్తోంది. లహరి మ్యూజిక్ ద్వారా ఆడియో మార్కెట్లోకి విడుదలైంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనులన్నీ పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేం దుకు సన్నాహాలు చేస్తున్నారు.

## జనవరి 14న నారి నారి నడుమ మురారి



శర్వానంద్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నారి నారి నడుమ మురారి. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. ఎకె ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. మేకర్స్ ఇప్పుడు సినిమా టీజర్ను లాంచ్ చేశారు. కథ శర్వా పాత్ర చుట్టూ తిరుగుతుంది, అతను ప్రేమలో పడతాడు, తన గర్ల్ ఫ్రెండ్ తండ్రి వారి వివాహానికి ఆమోదించమని ఒప్పిస్తాడు. అంతా సజావుగా జరుగుతున్న సమయంలో, అతని మాజీ ప్రియురాలు అకస్మాత్తుగా ఆఫీస్ లోకి రావడంతో ఊహించని మలుపు తిరుగుతుంది. తరువాత జరిగే హ్యూమరస్ సంఘటనలు ఇద్దరు అమ్మాయిల మధ్య చిక్కుకున్న శర్వా పాత్ర.. వినోదాత్మక కథనం ఆకట్టుకున్నాయి బ్లాక్ బస్టర్ 'సామజవరగమన'ను అందించిన తర్వాత, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను రూపొందించడంలో తన ప్రతిభ నిరూపించుకున్నాడు. నారి నారి నడుమ మురారి టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు హ్యూమర్ తోనిండి ఉంది, ప్రేక్షకులను ఆద్యంతం అలరిస్తుంది. గ్లామర్ లవర్‌గా సాక్షి వైద్య, మాజీ లవర్‌గా సంయుక్త నటించారు. ఇద్దరూ తమ పాత్రలకు న్యాయం చేస్తూ ఆకట్టుకున్నారు. నరేష్ తనదైన స్టైల్ కామెడీతో సినిమాకు పెద్ద ప్లస్ అయ్యారు. సత్య, సునీల్, సుదర్శన్ లాంటి సహాయ నటులు హాస్యాన్ని మరింత పెంచుతూ వినోదాన్ని అందించారు. జనవరి 14న రిలీజ్ అవుతుంది. 5:49 ఫస్ట్ షో. తప్పకుండా అందరూ థియేటర్స్‌లో చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు.

## అందర్ని భయపెట్టే సినిమా

**- అఖిల్ రాజ్**



'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లరు సినిమా ప్రేక్షకుల ముందుకు డిసెంబరు 25న రానుంది. ఈ సందర్భంగా హీరో అఖిల్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈషా కథ చెప్పగానే ఎంతో షాకింగ్‌గా అనిపించింది. తప్పకుండా హారర్ థ్రిల్లర్ సినిమాలు చూస్తే వారికి కొత్త అనుభూతినిస్తుంది. సినిమాలో ట్విస్టులు చాలా ఉంటాయి. కథ చెప్పినప్పుడు నేను కూడా ఉలిక్కి పడ్డాను. ట్రైలర్ చూసినప్పుడు కూడా అదే ఫీలింగ్. లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాను విడుదల చేసిన వంశీ నందిపాటి, బన్నీవాస్ ఆ సినిమా విషయంలో ఎలా సక్సెస్ అయ్యారో. ఈసినిమా విష యంలో కూడా అంతే సక్సెస్ అవు తారని నమ్ముతున్నాను. తప్పకుండా అందర్ని భయపెట్టే సినిమా ఇది. వినయ్ అనే పాత్రను చేస్తున్నాను. నలుగురు చిన్నప్పటి స్నేహితుల్లో నేను ఒకర్ని. త్రిగుణ్, సిరి, హెబ్బా పటేల్, మైమ్ మధు వంటి మంచి నటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా నుంచి చాలా నేర్చుకున్నాను. దర్శకుడు శ్రీనివాస్ రాగా నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. ప్రతి ప్రాజెక్టును ఓన్ చేసుకొని చేస్తాను. ఈ సినిమా పట్ల కూడా అంతే నమ్మకంతో ఉన్నాను. నా వైపు నుంచి ఉన్న ప్రమోషన్స్ కూడా చేస్తాను. కంటెంట్ బాగున్న సినిమాను ఎవరూ ఆపలేరు. అరకులో షూటింగ్ పూర్తయిన తరువాత ఓ పురుగు కుట్టి ఫీవర్ వచ్చింది. ఆ తరువాత నెల రోజులు జ్వరం వచ్చింది. అంతే తప్ప ఇంకే మీ అనుకోని సంఘటనలు జరగలేదు. సౌండ్ డిజైనింగ్ భయంకరంగా ఉంటుంది. అందరూ భయపడే విధంగా ఉంటుంది. నిజంగా హార్ట్ వీక్‌గా ఉన్నవాళ్లు ఈ సినిమాను చూడలేరేమో. సభిలా అనే వెబ్‌సిరీస్ సంబంధించిన గ్లింప్స్ చూసి దర్శకుడు నన్ను ఎంపిక చేసుకున్నాడు. చిన్నప్పుడు నుంచి నాకు భయం ఉండేది. ఏజ్ పెరుగుతున్న కొద్ది ఆ భయం పోయింది. ప్రస్తుతం నాలుగైదు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. ఆన్‌సెట్స్‌లో తరుణ్‌భాస్కర్, అనుపమతో కలిసి ఓ సినిమా చేస్తున్నాను భద్రి దర్శకుడు.

## 'చిన్ని చిన్ని' సాంగ్ రిలీజ్



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న 'వృషభ'. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తోంది. 'వృషభ' సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. 'వృషభ' సినిమా నుంచి బ్యూటిఫుల్ లవ్ సాంగ్ 'చిన్ని చిన్ని..' రిలీజ్ చేశారు. సమర్జీత్ లంకేష్, నయన్ సారికపై చిత్రీకరించిన ఈ లవ్ సాంగ్‌కు కల్యాణ్ చక్రవర్తి క్యాచీ లిరిక్స్ రాయగా, అనురాగ్ కులకర్ణి మంచి లవ్ ఫీల్ తో పాడారు. సామ్ సీఎస్ కంపోజ్ చేశారు. 'చిన్ని చిన్ని..' ఎవ్వరే నువ్వెవ్వరే చెప్పవే ఓ దేవత, ఏమిటే ఇదేమిటే ఓ మాయగా ఉన్నదే, ఏ శరానివో నీవు, ఏ స్వరానివో నీవు, ఓ వరానివో నీవు, తేలే వీలే లేదే, నా ప్రయాణమే మారి, నీ పదాలలో చేరి, నా ప్రపంచమే న్యుతివే, ఎవ్వరే నువ్వెవ్వరే, నీ ఆలోచనే నా ఆలాపనైపోయో, చిన్ని, చిన్ని నా చిన్ని చిన్ని నా కన్నీ నువ్వే అయిపోయావే..' అంటూ పాట సాగుతుంది.

## 'రాజుగారి పెళ్లి' అంటున్న నవీన్ పొలిశెట్టి



నవీన్ పొలిశెట్టి హీరోగా మీనాక్షి హీరోయిన్‌గా నిర్మిస్తున్న అనగనగా ఒక రాజు సినిమా నుంచి సెకండ్ సాంగ్ రిలీజ్ చేస్తున్నారు. వెడ్డింగ్ పాటగా రాజుగారి పెళ్లిరో అనే పాట ప్రోమోను విడుదల చేశారు. ఈ పూర్తి సాంగ్‌ను ఈనెల 26న విడుదల చేయనున్నారు. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి జనవరి 14న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిక్కిజే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమాకు నిర్మాతలు నాగ వంశీ, సాయి సోజన్య. సితార ఎంటర్టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకార స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'లభోరే లభోరే..' పాట విడుదల

అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వానర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వానర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నాయి. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వానర' సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'లబొరే లబొరే..' రిలీజ్ చేశారు.



## ఎన్నో రూమర్లు వచ్చాయి!

**శృతి హాసన్..**



శృతి హాసన్.. గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. లోకనాయకుడు కమల్ హాసన్ కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన శృతి హాసన్ చాలా తక్కువ టైమ్‌లోనే తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుని నటిగా, గాయనిగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా పలు రంగాల్లో సత్తా చాటుతోంది. అయితే శృతి గతంలో కొన్ని సార్లు ప్రేమలో పడి, దాని వల్ల చాలా తీవ్రంగా బాధపడిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తానే చాలా ఓపెన్‌గా మాట్లాడుతూ, తన లవ్ స్టోరీస్ వేరే వాళ్లకు సిల్లీగా అనిపించినా, తనకు వేరేగా ఉంటుందని చెప్పిన అమ్మడు తన తండ్రి ప్రతీ విషయంలోనూ తనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని తెలిపింది. తన తండ్రి తనకు ఏ విషయంలోనూ అడ్డు చెప్పలేదని, దాని వల్ల తానెప్పుడూ జీవితంలో ఇబ్బంది పడింది లేదని శృతి చెప్పుకొచ్చింది. నాపై ఎన్నో రూమర్లు వచ్చాయని, వాటిలో కొన్ని నిజాలుంటే, కొన్ని అబద్ధాలుంటాయని, కానీ తన తండ్రి మాత్రం ఎప్పుడూ తనకు సపోర్ట్ గానే నిలిచారని, తన తండ్రి ఓ వ్యక్తిగా ఎంతో మందిలో స్ఫూర్తిని నింపారని, అందుకే తనకు తన తండ్రి అంటే ఎంతో అభిమానమని చెప్పింది శృతి. సినీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ నుంచి వచ్చినప్పటికీ, తాను మాత్రం సొంతంగానే ఈ పొజిషన్‌కు వచ్చినట్టు శృతి పేర్కొంది.

# పివి నిజమైన జాతీయవాది

**సీనియర్ జర్నలిస్ట్ ఎ.కృష్ణారావు**



**న్యూఢిల్లీ :** విద్యార్థిగా ఉండగానే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి వందేమాతర గీతాలాపన చేసిన మాజీ ప్రధాని పివి నరసింహారావు నిజమైన జాతీయవాది అని సీనియర్ జర్నలిస్ట్ ఎ.కృష్ణారావు అన్నారు. పివి నరసింహారావు వర్ధంతి సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన మంగళవారం క్యానిస్టిట్యూషన క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కీలక ప్రసంగం చేస్తూ.. ఆర్యసమాజ్, వందేమాతరం ఉద్యమాలు స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం వ్యతిరేక పోరాటం పీవీపై ప్రగాఢ ప్రభావాన్ని చూపాయని ఆయన అన్నారు. నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ వరకు స్వాతంత్ర్యఅనంతర సామాజిక, ఆర్థిక చరిత్ర ఒక ఘట్టమైతే ఆధునిక భారత దేశ చరిత్ర పీవీతోనే ప్రారంభమైందని ఆయన అన్నారు. భారతను తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన పీవీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం ఒంటరిగా మిగిలిపోకుండా ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు బాటలు వేశారన్నారు. టెలికమ్యూనికేషన విప్ల వం, మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ పెట్టుబడులు, ఐటీ విప్లవం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం వంటి అనేక పరిణామాలు పివి హాయాంలోనే మొదలయ్యాయని చెప్పారు. నరేగాకు ముందే 1991లోనే జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టడం, పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం, మహిళలకు స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఇవన్నీ పివి హయాంలోనే జరిగాయన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే రామమందిర నిర్మాణం సాధ్యమయ్యేదీ కాదని ఆయన చెప్పారు. కాశ్మీర్, పంజాబ్ సమస్యలను పరిష్కరించడం, మైనారటీ ప్రభుత్వంలో ఉన్న ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవడం పివికే చెల్లిందని చెప్పారు.

ఈ సమావేశంలో మాట్లాడిన రాజ్యసభ బిజెపి ఎంపి సుధాంశు త్రివేది, ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన మణీందర్‌జీత సింగ్ బిట్టా.. పివి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. వాజ్‌పేయితో పీవీకి సత్సంబంధాలు ఉండేవని, వాజ్‌పేయిని జెనీవాకు పంపి కాశ్మీర్‌పై పాక్‌ను ఎండగట్టే బాధ్యతను అప్పజెప్పారని సుంధాశు త్రివేది అన్నారు.



# సిపిఐకి రూ.50 వేల విరాళం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మగ్దూం భవన్‌లో మంగళవారం సిపిఐ రాష్ట్ర పార్టీకి భూరి విరాళం అందింది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు రూ.50 వేల నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ కె. నారాయణ, కూనంనేని సాంబశివ రావులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు రాయబండి పాండురంగ చారి సిపిఐ రాష్ట్ర పార్టీకి రూ.10 వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె. నారాయణ, కూనంనేని సాంబశివ రావు విరాళాలు అందించిన చంద్రమోహన్ గౌడ్, రాయబండి పాండురంగచారిలను అభినందించారు. పార్టీ కార్యక్రమాలకు ఇటువంటి సహకారం మరింత బలాన్ని చేకూరుస్తుందని వారు అన్నారు.

# చదువుకున్న పాఠశాలకు ఆర్వో ప్లాంట్ విరాళం

**152 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందచేసిన లక్ష్మీ రామచందర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ మేనేజర్ లక్ష్మీ రామచందర్ అన్నారు. చదువుకున్న మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తన తల్లిదండ్రులు శామమ్మ, నరహరిల జ్ఞాపకార్థం ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం పాఠశాలకు అందజేసి ప్రారంభించారు.. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కొంత ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో తన సొంత గ్రామంలో చదువుకున్న పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందజేశామన్నారు. అదేవిధంగా పాఠశాలలో చదువుకుంటున్న 152మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందచేసిన ఆయన భవిష్యత్తులో అందిస్తానని లక్ష్మీ రామచందర్ పే ర్కొన్నాడు. పాఠశాలలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు లక్ష్మీ రామచందర్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిలుక నాగరాజు, ఉపసర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎందుకంత పట్టుదల?

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి వివరణలు మరిన్ని ప్రశ్నలుస సందేహాలను రేకెత్తిస్తున్నాయన్నారు. ఆరావళీల 1.44 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కేవలం 0.19 శాతం మాత్రమే ప్రస్తుతం మైనింగ్ లీజుల కింద ఉందని మంత్రి చెబుతున్నారని, ఇది ఇప్పటికే 68,000 ఎకరాలు, అంటే ఒక విశాలమైన ప్రాంతమని అన్నారు. అయితే 1.44 లక్షల చదరపు కిలోమీటర్ల సంఖ్య తప్పుదోవ పట్టించేదిగా ఉందని, ఇది నాలుగు రాష్ట్రాలలో మంత్రిత్వ శాఖ గుర్తించిన 34 ఆరావళీ జిల్లాల మొత్తం భూభాగాన్ని విస్తరించి ఉందన్నారు. 34 జిల్లాలకుగానూ 15 జిల్లాలలో ఆరావళీల కింద ఉన్న ప్రాంతం మొత్తం భూభాగంలో 33 శాతంగా ఉందని రమేష్ పేర్కొన్నారు. ఈ ఆరావళీ ప్రాంతాలలో ఎంత భాగాన్ని కొత్త నిర్వచనం కింద మినహాయించి, మైనింగ్, ఇతర అభివృద్ధి పనుల కోసం అందుబాటులోకి తెస్తారనే దానిపై ఎటువంటి స్పష్టత లేదన్నారు. స్థానిక ప్రొఫైల్‌లను బేస్‌లైన్‌గా తీసుకుంటే, మంత్రి సూచిస్తున్నట్లుగా, 100+ మీటర్ల ఎత్తైన కొండలు రక్షణ కవచం నుండి మినహాయించబడతాయి. సవరించిన నిర్వచనంతో ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లోని ఆరావళిలో ఉన్న చాలా కొండ ప్రాంతాలు రియల్ ఎస్టేట్‌కు ద్వారాలు తెరవబడుతాయని, ఈ చర్య పర్యావరణ ఒత్తిడిని పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిస్కా టైగర్ రిజర్వ్ సరిహద్దులను మైనింగ్‌కు అనుమతించే చర్యకు నాయకత్వం వహిస్తున్న మంత్రి, తప్పనిసరిగా ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన పర్యావరణ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడం దాని పర్యావరణ విలువను దెబ్బతీస్తుందనే ప్రాథమిక ఆందోళనను విస్మరిస్తున్నారని, ఇతర చోట్ల ఇటువంటి విచ్ఛిన్నం ఇప్పటికే వినాశనానికి కారణమవుతోందని ఆయన అన్నారు. కాగా, సోమవారం యాదవ్ ఆరావళి కొత్త నిర్వచనం అంశంపై కాంగ్రెస్ తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. పర్వత శ్రేణిలోని 0.19 శాతం ప్రాంతంలో మాత్రమే చట్టబద్ధంగా మైనింగ్ నిర్వహించవచ్చన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నవంబరులో పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ సిఫార్సుపై సుప్రీం కోర్టు ఆరావళి కొండలు, ఆరావళి శ్రేణి దేనిని కలిగి ఉంటుందనే దానిపై ఏకరీతి చట్టపరమైన నిర్వచనాన్ని ఆమోదించింది. ఈ నిర్వచనం ప్రకారం... 'ఆరావళీ కొండ అనేది దాని స్థానిక చుట్టుపక్కల భూభాగం కంటే కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న భూరూపం. 'ఆరవల్లి శ్రేణి అనేది ఒకదానికొకటి 500 మీటర్ల లోపల రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సమూహాన్ని సూచిస్తుంది.

## భవిష్యత్తు ప్రశ్నార్థకమే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థపై ఆధారపడి దాదాపు 89వేల మంది జీవిస్తున్నారని, ప్రైవేట్‌తో పోటీ పడకపోతే వాళ్ల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగం వైపు దృష్టి పెట్టిన సింగరేణి మరో అడుగు ముందుకు వేసి గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన, సోలార్, హైడల్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, హైడ్రోజన్ పవర్, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ ప్రొడక్షన్ వంటి తదితర రంగాల వైపు దృష్టి పెట్టి సంస్థ పై ఆధారపడి జీవిస్తున్న ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సూచించారు. క్రమేపి బొగ్గు ఆధారిత పరిశ్రమల సంఖ్య తగ్గుతుందని, దూసుకుపోతున్న టెక్నాలజీకి అనుగుణంగా సింగరేణి సంస్థ పరుగులు పెట్టాలన్నారు. ముఖ్యంగా గ్రాఫైట్, కాపర్ ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పటికే కర్ణాటకలో కాపర్ ఉత్పత్తి, గోల్డ్ మైన్స్ సర్వే బాధ్యతలు స్వీకరించిన సింగరేణి మరింత వేగంతో పోటీ ప్రపంచంలోకి రావాలని ఆహ్వానించారు. సింగరేణి జెండా ప్రపంచవ్యాప్తంగా ఎగిరేలా ప్రతి ఒక్కరు కష్టపడాలని పిలుపునిచ్చారు. జైపూర్‌లో విద్యుత్ ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేశామని, ఎక్స్పర్ట్స్ సూచనలు, సలహాలు తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళితేనే సంస్థను కాపాడుకోగలమని తెలిపారు. ఆ దిశగా సింగరేణి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**సంక్షేమం వైపు కూడా..**

సింగరేణి వ్యాపారం ఒక్కటే కాకుండా ప్రజల సంక్షేమం వైపు కూడా దృష్టి పెడుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రభావిత గ్రామల అభివృద్ధి కోసం సింగరేణిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎక్కడా నష్టం జరగకుండా బొగ్గు పావుల నిర్వహణ జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

**శైలో బంకర్ తొలగించండి..**

సత్తుపల్లి మండలం, కిష్టారం పంచాయతీలోని అంబేద్కర్ నగర్ ప్రజలకు ప్రాణ సంకటగా మారిన శైలోబంకర్ సమస్య పరిష్కరించాలని శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కోరారు. అంబేద్కర్ నగర్ ను రీ హ్యాబిటేషన్ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏరియాలో ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారని, ఇంకా అనేకమంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లుగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు..

## రైతులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో సోయాబీన్ ఒక ప్రధాన ఖరీఫ్ పంట అని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 2025–26 సీజన్‌లో సుమారు 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు జరగగా, దాదాపు 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. అయితే, కోత దశలో కురిసిన భారీ వర్షాల వల్ల సోయాబీన్ పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దీంతో పెద్ద మొత్తంలో పంట ఎఫ్ఎక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకుండా మారిందని వివరించారు. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డి వంటి జిల్లాల్లో ప్రధానంగా గిరిజన రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షాల కారణంగా సుమారు 36 వేల మెట్రిక్ టన్నుల సోయాబీన్‌ను ధర మద్దతు పథకం (పిఎస్ఎస్) కింద కొనుగోలు చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. అవసరమైతే ఎఫ్ఎక్యూ నిబంధనల్లో సడలింపులు ఇస్తూ, అమలుకావాల్సిన ధర విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా, గిట్టుబాటు ధర పొందగలుగుతారని మంత్రి పేర్కొన్నారు.

**నాఫెడ్ ద్వారా మొక్కజొన్నను కేంద్రం కొనుగోలు చేయాలి**

అదేవిధంగా, మొక్కజొన్న రైతుల పరిస్థితిపై కూడా మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, మార్కెట్లకు భారీగా పంట రావడంతో ధరలు కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువకు పడిపోయాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 2.96 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి, వేలాది రైతులకు అండగా నిలిచిందన్నారు. అయితే, ఈ కొనుగోళ్ల వల్ల రాష్ట్ర ఖజానాపై ఇప్పటికే దాదాపు రూ.750 కోట్ల ఆర్థిక భారం పడిందని తెలిపారు.ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ద్వారా రాష్ట్రం కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎథనాల్, డిస్టిల్లరీ పరిశ్రమలకు సరఫరా చేసేలా తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కేంద్రాన్ని కోరారు. దీనివల్ల రాష్ట్రంపై పడుతున్న ఆర్థిక భారం కూడా తగ్గడంతో పాటు మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పనలో రాష్ట్రప్రభుత్వానికి చేయూతనిచ్చినట్లు అవుతుందని అన్నారు. ఈ అంశాలపై చేశారు.కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేవిధంగా చొరవ చూపాలని ఆయన కేంద్ర మంత్రులను కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com